

ఐసిసి అవార్డు రేసులో గొంగడి త్రిష

8

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 187 | విజయవాడ, శనివారం 8 ఫిబ్రవరి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 8 February 2025 | Rs

నీట్ (యుజి) నోటిఫికేషన్ విడుదల

- మార్చి 7 వరకు దరఖాస్తులకు అవకాశం

న్యూఢిల్లీ : వైద్య కళాశాలల్లో వివిధ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ – యుజి 2025 పరీక్షకు నోటిఫికేషన్ విడుదల చేశారు. మే 4న ఈ పరీక్ష నిర్వహించనున్నట్లు ఇప్పటికే ప్రకటించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 7 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఇంగ్లిష్, హిందీ, తెలుగుతో పాటు మొత్తం 13 భాషల్లో పెన్ను, పేపర్ విధానంలో ఒకే షిఫ్టులో ఈ పరీక్ష జరగనుంది. ఎంబిబిఎస్, బిడిఎస్, బిఎస్ఎంఎస్, బియూఎంఎస్, బిహెచ్ఎంఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఏటా ఈ పరీక్ష నిర్వహిస్తున్నారు.

దరఖాస్తులకు ఫిబ్రవరి 7 నుంచి మార్చి 7 రాత్రి 11.50 గంటల వరకు అవకాశం కల్పించారు. దరఖాస్తులో పొరపాట్ల సవరణకు మార్చి 9 నుంచి 11వరకు గడువు ఇచ్చారు.

మార్చి 24, 25తేదీల్లో

బ్యాంక్ ఉద్యోగుల దేశవ్యాప్త సమ్మె

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా మార్చి 24, 25 తేదీల్లో బ్యాంక్ ఉద్యోగులు రెండు రోజుల సమ్మె నిర్వహించనున్నారు. అన్ని విభాగాల్లో ఖాళీల భర్తీ, వారానికి ఐదు రోజుల పనిదినాలు వంటి డిమాండ్ల సాధనకు సమ్మె నిర్వహించాలని తొమ్మిది బ్యాంక్ ఉద్యోగ సంఘాల వేదిక యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బియు) పిలుపునిచ్చింది. వరుసగా పలుమార్లు జరిపిన చర్చలు విఫలమైన తరువాత ఈ రెండు రోజులు సమ్మె నిర్వహించాలని నిర్ణయించినట్లు యుఎఫ్‌బియు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. వర్క్‌మెన్, ఆఫీసర్ డైరెక్టర్స్ పోస్టులను భర్తీ చేయడంతోపాటు, ఉద్యోగుల భద్రతకు ముప్పు కలిగించే, ఉద్యోగుల మధ్య విభజనను సృష్టించేలా పనితీరు సమీక్ష, పనితీరు సంబంధిత ప్రోత్సాహకాలపై ఆర్థిక సేవల విభాగం (డిఎఫ్ఎస్) ఇటీవల జారీ చేసిన ఆదేశాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని యుఎఫ్‌బియు డిమాండ్ చేసింది. పిఎస్‌బిల విధానపరమైన విషయాలపై డిఎఫ్ఎస్ మైక్రో-మేనేజ్‌మెంట్ వల్ల ఆయా బోర్డుల స్వయం ప్రతిపత్తి దెబ్బతింటుందని యుఎఫ్‌బియు ఆరోపించింది. ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబిఎ)తో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ ఉద్యోగుల పథకం తరహాలో గ్రాట్యూటీ చట్టాన్ని సవరించి ఆదాయపు పన్ను నుంచి మినహాయించాలని యుఎఫ్‌బియు డిమాండ్ చేసింది. యుఎఫ్‌బియులో ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎఐబిఇఎ), ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ (ఎఐబిఓసి), నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయిస్ (ఎన్‌సిబిఇ), ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఎఐబిఒఎ), బ్యాంక్ ఎంప్లాయిస్ కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియా (బిఇఎఫ్ఐ) ఉన్నాయి. ఎఐబిఓసి గతంలో ఈ నెల 24, 25 తేదీల్లో దేశవ్యాప్త సమ్మెకు వెళతామని హెచ్చరించింది. ఇప్పుడు యుఎఫ్‌బియు నిర్ణయించిన తేదీలకు అనుగుణంగా సమ్మె తేదీలను మార్చాలని ఎఐబిఓసి నిర్ణయం తీసుకుందని సంఘం ప్రధాన కార్యదర్శి రూపం రాయ్ తెలిపారు.

ఏడుగురు చొరబాటుదార్ల కాల్చివేత

వాస్తవాధీన రేఖ వద్ద ఆర్మీ పోస్టుపై దాడిని తిప్పికొట్టిన సైన్యం

శ్రీనగర్ : వాస్తవాధీన రేఖ వద్ద గల సైనిక పోస్టుపై పాకిస్తానీ చొరబాటుదారులు పొంచి వుండి జరిపిన దాడిని భారత సైన్యం విజయవంతంగా తిప్పికొట్టింది. ఏడుగురు చొరబాటుదారులను కాల్చివేసింది. వారిలో ఇద్దరు ముగ్గురు పాకిస్తాన్ ఆర్మీ సిబ్బంది వున్నారని సైనిక వర్గాలు తెలిపాయి. ఈ నెల 4వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ దాడి జరిగిందని వెల్లడించాయి. జమ్ముకాశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో కృష్ణ ఘటి సెక్టార్‌లో ఈ దాడి జరిగింది. సరిహద్దులు దాటి తీవ్రవాద కార్యకలాపాలు చేపట్టడంలో సిద్ధహస్తులైన పాకిస్తాన్ సరిహద్దు కార్యాచరణ బృందాని (బిఎటి)కి చెందిన కొంతమంది భారత సైనిక పోస్టుపై దాడికి ప్రయత్నించారు. కాల్చి చంపిన వారిలో ఇద్దరు ముగ్గురు పాక్ సైనికులు వున్నారని, మిగిలిన వారు అల్ బదర్ గ్రూపు తీవ్రవాదులై వుండొచ్చునని ఆ వర్గాలు తెలిపాయి.

కాశ్మీర్‌తో సహా అన్ని సమస్యలను భారత్‌తో చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని భావిస్తున్నట్లు ఈవారం ప్రారంభంలో పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ పేర్కొన్న నేపథ్యంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. పాకిస్తాన్ కపటత్వాన్ని బహిర్గతం చేస్తూ జైషే మహ్మద్, లష్కరే తోయిబా వంటి తీవ్రవాద సంస్థల కమాండర్లు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో సమావేశం పెట్టిన తరుణంలోనే ఈ దాడి జరగడం గమనార్హం. జమ్ముకాశ్మీర్, లడఖ్‌లు భారతదేశంలో ఎప్పటికీ అంతర్భాగమేనని భారత ప్రభుత్వం పదేపదే పునరుద్ఘాటిస్తూనే వుంటుంది. ఎలాంటి తీవ్రవాద చర్యలు, హింస చోటు చేసుకోని వాతావరణం వుంటేనే పాకిస్తాన్‌తో సత్సంబంధాలు వుంటాయని స్పష్టం చేస్తూనే వుంది. 2019లో భారత ప్రభుత్వం 370వ అధికరణను రద్దు చేసి, జమ్ముకాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేసినప్పటి నుండి ఇరు దేశాల మధ్య దౌత్య, వాణిజ్య సంబంధాలు క్షీణించాయి. ఇటీవలి మాసాల్లో జమ్ము ప్రాంతంలోని వివిధ జిల్లాల్లో తీవ్రవాద దాడులు పెరిగాయి. 18మంది భద్రతా సిబ్బందితో సహా 44మంది మరణించారు.

స్వర్ణాంధ్ర 2047కు చేయూత

నీతిఆయోగ్ వైస్‌ఛైర్మన్‌ను కోరిన చంద్రబాబు

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన స్వర్ణాంధ్ర 2047 విజన్‌కు చేయూతనందించాలని నీతిఆయోగ్ వైస్ ఛైర్మన్ సుమన్ భేరీని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కోరారు. రాష్ట్ర సచివాలయానికి నీతి అయోగ్ వైస్ ఛైర్మన్ శుక్రవారం వచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రితో ఆయన భేటీ అయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో అభివృద్ధికి ఉన్న అవకాశాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ముఖ్యమంత్రి వివరించారు. ఆవిష్కరణలకు సాంకేతికత అందించడంతో పాటు నూతన విధానాల అమలుకు తోడ్పాటు ఇవ్వాలని నీతిఆయోగ్‌ను కోరారు. ప్రతి ఏటా 15 శాతం వృద్ధిరేటు సాధించి 2047 కల్లా 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను నెలకొల్పడం, తద్వారా 42 వేల డాలర్ల తలసరి ఆదాయాన్ని చేరుకునేలా ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఈ లక్ష్య సాధనకు నీతి ఆయోగ్ సహకారం అవసరమని చెప్పారు. ఆర్థిక,



నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమలు, సుస్థిరత ప్రధానాంశాలుగా స్వర్ణాంధ్ర 2047పై దృష్టి పెట్టినట్లు సిఎం తెలిపారు. మానవాభివృద్ధి ఉత్తమ పాలన అంశాల్లో గ్లోబల్ లీడర్‌గా ఎపిని తీర్చిదిద్దాలని భావిస్తున్నట్లు చెప్పారు. అదే సమయంలో రాష్ట్రం కొన్ని సవాళ్లను ఎదుర్కొంటోందని, విభజన వల్ల ఆర్థిక వివాదాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని తెలిపారు. గ్రోత్ ఇంజన్ లాంటి హైదరాబాద్‌ను కోల్పోవడం, ఎపి పూర్తిగా వ్యవసాయ ఆధారిత రాష్ట్రం కావడంతోపాటు గత ఐదేళ్లలో మూలధన వ్యయంపై నిర్లక్ష్యం వల్ల మౌలిక వసతులు కల్పించకపోవడం వంటి సమస్యలు ఉన్నాయని వివరించారు.

మూడు నెలలకు ఒకసారి సమీక్షించండి

దేశంలో నాలుగు గ్రోత్ హబ్‌లలో ఒకటిగా ఉన్న విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్‌తోపాటు, తిరుపతి అమరావతిని రీజినల్ గ్రోత్ హబ్‌లుగా మార్చేందుకు నీతి ఆయోగ్ సహకారం అందించాలని కోరారు. బ్లూఎకానమీ, గ్రీన్ హైడ్రోజన్, ఎఐ అభివృద్ధిని గ్రోత్ ఇంజన్‌గా గుర్తించామని అన్నారు. వీటిపై మూడు నెలలకు ఒకసారి సమీక్షించాలని నీతిఆయోగ్‌ను సిఎం కోరారు. ఎపి తీసుకున్న కీలక కార్యక్రమాలైన నదుల అనుసంధానం, పి4 విధానం ద్వారా పేదరిక నిర్మూలన, 2047 విజన్‌లో పది ప్రధాన సూత్రాల అమలుకు నీతిఅయోగ్ ప్రాధాన్యత మిగతా 7లో

14 నుంచి 20 వరకు

కేంద్ర బడ్జెట్‌పై నిరసనలు

వామపక్ష పార్టీల పిలుపు

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ప్రజావ్యతిరేక ప్రతిపాదనలను ప్రజలు తిరస్కరించాలని వామపక్ష పార్టీలు కోరాయి. అఖిల భారత వామపక్ష పార్టీల పిలుపులో భాగంగా ఈ నెల 14 నుంచి 20 వరకూ రాష్ట్ర వ్యాప్త నిరసనలకు వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, నిరసనలు, ప్రదర్శనలు, రౌండ్‌టేబుల్ సమావేశాలు జరిపి నిరసన తెలపాలని కోరాయి. ఈ మేరకు శుక్రవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, సిపిఐఎంఎల్ న్యూడెమొక్రసీ నాయకులు పి ప్రసాద్, సిపిఐఎంఎల్ నాయకులు జాస్తి కిషోర్, ఎంసిపిఐ(యు) నాయకులు కాటం నాగభూషణం, సిపిఐఎంఎల్ లిబరేషన్ నాయకులు బి బంగారురావు, ఎస్‌యుసిఐ(సి) నాయకులు బిఎస్ అమర్‌నాథ్, ఫార్వార్డ్‌బ్లాక్ నాయకులు పివి సుందరరామరాజు, ఆర్ఎస్‌పి నాయకులు జానకి రాములు ఉమ్మడిగా ప్రకటన విడుదల చేశారు.

ప్రజల్లో కొనుగోలు శక్తి కుచించుకు పోయినందున ఆర్థిక వ్యవస్థలో తగ్గిన డిమాండ్ సమస్యను పరిష్కరించడానికి బదులు అందుకు విరుద్ధంగా మోడీ ప్రభుత్వం సంపన్నులకు రాయితీలు ఇస్తోందని పేర్కొన్నారు. ఖర్చుల్లో కోత పెట్టడం గర్హనీయమని, నిరుద్యోగ సమస్యను ఈ బడ్జెట్ పూర్తిగా విస్మరించిందని తెలిపారు. ఆహార సబ్సిడీలు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, సామాజిక సంక్షేమంపై పెట్టిన ఖర్చు గతేడాది కంటే బాగా తగ్గిపోయిందన్నారు. అవసరం ఉన్నప్పటికీ ఉపాధిహామీ పథకానికి నిధులు అదనంగా కేటాయించలేదని, ధరల పెరుగుదల, జిఎస్‌టి పెంపుదలతో అనేక ఇబ్బందులు పడుతున్న కార్మికవర్గాన్ని మిగతా 7లో

ప్రభుత్వ శాఖల ద్వారానే నియామకాలు

ప్రైవేట్ ఏజెన్సీలకివ్వాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి : జెఎసి డిమాండ్

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

ప్రభుత్వ శాఖలు, వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా భర్తీ చేయాలని మంత్రి మండలి తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఎపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్, టీచర్స్ అండ్ వర్కర్స్ జెఎసి డిమాండ్ చేసింది. ఈ మేరకు జెఎసి ఛైర్మన్ ఎవి నాగేశ్వరరావు, కో-ఛైర్మన్ బి కాంతారావు, కోశాధికారి డి దయామణి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా నియామకాలు జరిపితే పారదర్శకత లోపించడంతోపాటు నిజమైన మెరిట్ అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. రాజకీయ ప్రమేయంతోపాటు ఇతర అనైతిక ప్రభావం పెరుగుతుందని, రూల్ ఆఫ్ లా రిజర్వేషన్ సరిగ్గా అమలు కాదన్నారు. గతంలో ప్రైవేట్ ఏజెన్సీలు అవుట్‌సోర్సింగ్ నియామకాలపై అవినీతి, అక్రమాలకు పాల్పడిన చరిత్ర ఉందన్నారు. పెద్దయెత్తున నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసే దళారులు తయారయ్యారన్నారు. నియామకాల్లో పారదర్శకత, సామాజిక న్యాయాన్ని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని, ప్రభుత్వం తప్పుకోవడం ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి పరాకాష్ట అని అన్నారు. ప్రభుత్వ నిర్వహణలో నడుస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్పొరేషన్‌ను మళ్లీ ఏజెన్సీలకు ఇవ్వాలని నిర్ణయించడమంటే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు అన్యాయం చేయడమేనన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల రిక్రూట్‌మెంట్ నేరుగా డిపార్టుమెంట్ కాంట్రాక్టు పద్ధతిలో నింపి నేరుగా జీతాలివ్వాలని జెఎసి డిమాండ్ చేసింది.

కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి : సిఐటియు

అవుట్‌సోర్సింగ్ కార్మికుల కోసం ఏర్పాటుచేసిన ఆప్కాస్‌ను రద్దు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయంతో కార్మికులందరిలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) పేర్కొంది. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె నాగభూషణం, కె ఉమామహేశ్వరరావు శుక్రవారం పేర్కొన్నారు. దళారీ వ్యవస్థను తెచ్చిపెట్టినట్లయితే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన, పోరాటాలకు పూనుకోవాల్సి వస్తుందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమానపనికి సమాన వేతనం, శాశ్వత సభ్యత్వం కలిగి విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ పారిశుధ్య ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన ఒప్పంద కార్మికులను ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

మాజీ ఎంపి ఎంవివికి ఇడి షాక్

- రూ.42.03 కోట్ల ఆస్తులు తాత్కాలిక జప్తు

ప్రజాశక్తి– గ్రేటర్ విశాఖ బ్యూరో

వైసిపి విశాఖ మాజీ ఎంపి ఎంవివి.సత్యనారాయణకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) షాక్ ఇచ్చింది. హయగ్రీవా ఫామ్స్‌కు చెందిన రూ.42.03 కోట్ల ఆస్తులను తాత్కాలికంగా శుక్రవారం జప్తు చేసింది. ఇందులో 14 స్థిరాస్తులు, రూ.2.71 కోట్ల విలువైన ఆరు చరాస్తులు ఉన్నాయి. విశాఖ నగరంలోని ఎండాడలోగల హయగ్రీవ ప్రాజెక్టుకు చెందిన 12.51 ఎకరాల భూమిని మోసపూరితంగా లాక్కొన్నారని గతేడాది జూన్ 22న చిలుకూరు జగదీశ్వరుడు, ఆయన భార్య రాధారాణి ఆరిలోవ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అక్కడ నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఇడి గతేడాది అక్టోబర్‌లో ఎంవివి.సత్యనారాయణ, ఆడిటర్ గన్నమనేని వెంకటేశ్వరరావు (జివి) ఇల్లు, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించింది. ఈ భూముల అమ్మకాల్లో ఎంవివి బిల్డర్స్, మెస్సర్స్ హయగ్రీవా ఇన్‌ఫ్రా టెక్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్, గద్దె బ్రహ్మాజీలు భాగస్వాములై దాదాపు రూ.150 కోట్లు ఆర్జించినట్లు గుర్తించి చర్యలకు ఉపక్రమించింది.

వాల్తేరు డివిజన్ 2ముక్కలు

- విశాఖపట్నం డివిజన్‌గా ఒకటి, రాయగడ్‌లోకి పెద్ద ముక్క
- నూతన ఆదాయపు పన్ను బిల్లుకు ఆమోదం
- కేంద్ర మంత్రివర్గ నిర్ణయాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విశాఖపట్నం కేంద్రంగా ప్రతిపాదిత సౌత్ కోస్ట్ రైల్వే జోన్ పరిధిలోని డివిజనల్ అధికార పరిధిని విభజించారు. వాల్తేరు డివిజన్‌ను రెండు ముక్కలుగా చేశారు. ఇక నుంచి వాల్తేరు డివిజన్ మొత్తం విశాఖ జోన్‌లో భాగస్వామ్యం కాదు. శుక్రవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గం ఈ మేరకు నిర్ణయించింది. వాల్తేరు డివిజన్‌లోని ఒక భాగం పలాస-విశాఖపట్నం - దువ్వాడ, కూనేరు - విజయనగరం, నౌపడ జంక్షన్ - పర్లాఖిమిడి, బొబ్బిలి జంక్షన్-సాలూరు, సింహాచలం నార్త్ - దువ్వాడ బైపాస్, వడ్లపూడి - దువ్వాడ, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ - జగ్గయపాలెం (సుమారు 410 కిలోమీటర్ల) స్టేషన్లు ఉంటాయి. దీనిని కొత్త సౌత్ కోస్ట్ రైల్వే జోన్ కింద వాల్తేరు డివిజన్‌గా కొనసాగించనున్నారు.

కొత్తగా రాయగడ్ డివిజన్

వాల్తేరు డివిజన్‌లోని మరో భాగం కొత్తవలస - బచేలి, కూనేరు - తెరువాలి జంక్షన్, సింగపూర్ రోడ్ - కోరాపుట్ జంక్షన్, పర్లాఖిమిడి - గన్పూర్ (సుమారు 680 కిలోమీటర్ల) స్టేషన్ల మధ్య ఉంటాయి. దీనిని తూర్పు కోస్ట్ రైల్వే పరిధిలోని రాయగడ్‌లో ప్రధాన కార్యాలయంతో కొత్త డివిజన్‌గా మారుస్తారు. జాతీయ సఫాయి, కర్మచారి కమిషన్ (ఎన్‌సిఎస్‌కె) పదవీకాలాన్ని మూడేళ్లపాటు పొడిగిస్తూ కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. స్కిల్ ఇండియా కార్యక్రమం కొనసాగించడానికి, పునర్నిర్మాణానికి కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. 2026 వరకు 'స్కిల్ ఇండియా ప్రోగ్రామ్ (ఎస్ఐపి)' కొనసాగింపునకు ఆమోదం తెలిపినట్లు కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ తెలిపారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 (పిఎంకెవివై 4.0), ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్ (పిఎం-ఎన్ఎపిఎస్), జన్ శిక్షణా సంస్థాన్ (జెఎస్ఎస్) పథకాలు ఇప్పుడు 'స్కిల్ ఇండియా ప్రోగ్రామ్' అనే కేంద్ర పథకం కింద విలీనమయ్యాయని చెప్పారు.

నూతన ఆదాయపు పన్ను బిల్లుకు ఆమోదం

నూతన ఆదాయపు పన్ను బిల్లుకు శుక్రవారం కేంద్ర క్యాబినెట్ సమావేశం ఆమోదం తెలిపింది. 60 ఏళ్లుగా ఉన్న ఆదాయపు పన్ను చట్టాన్ని మార్పు చేస్తూ... మోడీ ప్రభుత్వం ఈ బిల్లుకు మిగతా 7లో



మహారాష్ట్రలో వయోజనుల కంటే ఓటర్లే ఎక్కువ?

- 5 నెలల్లో 39 లక్షల ఓటర్లు ఎక్కడ నుంచి వచ్చారు?
- ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శ

7

షాక్ కొడుతున్న స్మార్ట్ మీటర్లు

- పాత మీటర్ ఉన్నప్పుడు రూ.3,452
- స్మార్ట్ మీటర్ బిగించాక రూ. 41,650

3

ఆదాయం వచ్చే పంటలకే ప్రోత్సాహం

- హార్టికల్చర్, ఆక్వాకు ప్రాధాన్యం
- పిడిఎస్ కోసం ప్రజలు తినే వెరైటీల సేద్యం
- టెక్నాలజీతో సాగు కొత్త పుంతలు
- వ్యవసాయశాఖలపై సమీక్షలో నిర్ణయం

2

సొంత పద్ధతి పాటించినట్లుంది!

- తమిళనాడు గవర్నర్ చర్యలపై సుప్రీం వ్యాఖ్య
- పదవ తేదికి విచారణ వాయిదా

న్యూఢిల్లీ : రాజ్యాంగం నిర్దేశించిన తీరులో కాకుండా సొంతపద్ధతి పాటించినట్లుందని తమిళనాడు గవర్నర్‌నుఉద్దేశించి సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లుల విషయంలో గవర్నర్ ఆర్ఎస్ రవి వ్యవహరిస్తున్న తీరుపై తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను వరుసగా రెండవరోజైన గురువారం నాడు కూడా జస్టిస్ జె.బి.పార్దివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన బెంచ్ విచారించింది. ఈ సందర్భంగా బుధవారం నాటి విచారణ సందర్భంగా లేవనెత్తిన కొన్న అంశాలనే మళ్లీ బెంచ్ ప్రస్తావించింది. రాజ్యాంగంలోని 200వ అధికరణను ఈ సందర్భంగా బెంచ్ ప్రస్తావించింది. 'గవర్నర్‌కు మూడు మార్గాలు వుంటాయి. ఒకటి ఆ బిల్లులను ఆమోదించడం రెండు, వాటిని ఆమోదించకుండా వెనక్కి పంపించడం మూడు, పరిశీలించాల్సిందిగా కోరుతూ రాష్ట్రపతికి నివేదించడం. కానీ, ఇక్కడ గవర్నర్ రెండు బిల్లులను మాత్రమే రాష్ట్రపతికి నివేదించాలనుకున్నారు. మిగిలిన పదింటిని తన వద్దే ఉంచుకున్నారు.' అని జస్టిస్ పార్దివాలా పేర్కొన్నారు. 'తరువాత ఏం జరుగుతుంది?' అని ఆయన ప్రశ్నించారు. 'దీనర్థం గవర్నర్ తన సొంత పద్ధతిని రూపొందించుకుని, పాటించనట్టుంది.' అని పార్దివాలా వ్యాఖ్యానించారు. రాజ్యాంగంలోని 254వ అధికరణం ప్రకారం సమగ్రంగా లేకపోయినా, ఏదైనా సమాచారం లోపించిన సందర్భంలోనే బిల్లును రాష్ట్రపతికి పంపాలని రాష్ట్ర ప్రభుత్వం వాదించింది. దానికి భిన్నమైన సందర్భంలో గవర్నర్ బిల్లును ఆమోదించకూడదని భావిస్తే, పున:పరిశీలించాలని సూచిస్తూ వెనక్కి పంపాల్సిఉంటుందని, అలా వచ్చిన బిల్లును అసెంబ్లీ రెండవసారి కూడా ఆమోదించి పంపితే గవర్నర్‌కు దానిని ఆమోదించడం మినహా మరో మార్గం లేదని ప్రభుత్వం ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చింది. ఈ ప్రక్రియను తప్పించుకోవడానికే గవర్నర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ప్రభుత్వం వాదించింది. రాజకీయ ప్రత్యర్థి తరహాలో గవర్నర్ వైఖరి వుందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది ఇరు పక్షాల వాదనలు విన్నతరువాత విఛారణను ధర్మాసనం పదవతేదికి వాయిదా వేసింది. 2020 జనవరి, 2023 ఏప్రిల్ మధ్య కాలంలో 12 బిల్లులను తమిళనాడు రాష్ట్ర అసెంబ్లీ, గవర్నర్ ఆమోదం నిమిత్తం పంపింది. వీటిలో రాష్ట్రంలోని యూనివర్శిటీల వైస్ ఛాన్సలర్ల నియామకాలకు సంబంధించిన బిల్లులే ఎక్కువగా వున్నాయి.

ఎట్టకేలకు పావు శాతం వడ్డీ కోత

- రెపోరేటును తగ్గించిన ఆర్‌బిఐ
- ఐదేళ్లలో తొలిసారి
- ముగిసిన ఎంపిసి భేటీ
- 6.4 శాతం వృద్ధి అంచనా
- నూతన గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడి



ముంబయి : అధిక వడ్డీ రేట్లతో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్న రుణగ్రహీతలకు ఆర్‌బిఐ స్వల్ప ఊరట కల్పించింది. ఐదేళ్లలో తొలిసారి కీలక వడ్డీ రేటును పావు శాతం తగ్గించింది. మూడు రోజుల పాటు సాగిన ఆర్‌బిఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపిసి) శుక్రవారం ముగిసింది. గతేడాది డిసెంబర్‌లో రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) నూతన గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన సంజయ్ మల్హోత్రా ఆధ్వర్యంలో జరిగిన ద్రవ్య పరపతి విధాన సమీక్షలో రెపోరేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 6.25 శాతంగా ప్రకటించారు. చివరి సారిగా 2020 మేలో ఆర్‌బిఐ వడ్డీ రేట్లను తగ్గించింది. ఆ తర్వాత క్రమంగా 2.50 శాతం మేర పెంచి 6.5 శాతానికి చేర్చింది. గడిచిన రెండేళ్ల నుంచి లేదా వరుసగా 11 ఎంపిసి భేటీల్లోనూ యథాతథంగా ప్రకటించింది. పెరిగిన వడ్డీ రేట్లతో రుణ గ్రహీతలపై తీవ్ర భారం పడుతోంది. అధిక వడ్డీ రేట్లు, జిఎస్‌టి పన్నులు, ఆదాయపు పన్నులు, హెచ్చు ధరల భారాలతో ప్రజల కొనుగోళుశక్తి హరించుకుపోయింది. దీంతో మార్కెట్‌లో వినిమయం పడిపోవడంతో.. కార్పొరేట్ల ఆదాయాలపైనా తీవ్ర ప్రభావం పడింది. ఈ నేపథ్యంలోనే పారిశ్రామిక వర్గాలు ప్రభుత్వంపై తెచ్చిన ఒత్తిడితోనే ఇటీవల ఆదాయపు పన్ను పరిమితిని రూ.12 లక్షలకు పెంచినట్లు రిపోర్టులు వచ్చాయి. తాజాగా వడ్డీ రేట్లను తగ్గించడం ద్వారా మార్కెట్‌లో నగదు ప్రవాహం పెరిగి.. సరుకులకు, రుణాలకు డిమాండ్ పెరుగుతుందని ప్రభుత్వ వర్గాలు ఆశతో ఉన్నాయి.

ఆర్‌బిఐ తాజా ఎంపిసి భేటీలో రెపో రేటును 0.25 శాతం మేర తగ్గించినట్లు మీడియాతో గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. దీంతో రెపో రేటు 6.50 శాతం నుంచి6.25 శాతానికి తగ్గనుందన్నారు. చివరి సారిగా కరోనా పరిణామాలతో 2020 మే నెలలో రెపో రేటును 40 బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది. ఆ తర్వాత రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, దేశీయంగా ద్రవ్యోల్బణం ఎగిసిపడటంతో రెండేళ్ల పాటు వడ్డీ రేట్లను క్రమంగా పెంచింది. తాజా తగ్గింపుతో గృహ, వాహన రుణాలపై వడ్డీ రేట్లు తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25లో భారత జిడిపి 6.4 శాతంగా ఉండొచ్చని మల్హోత్రా అన్నారు. వచ్చే 2025-26లో 6.7 శాతంగా అంచనా వేశామన్నారు. 2024-25లో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ 4.8 శాతంగా నమోదయ్యే అవకాశాలున్నాయన్నారు. 2025-26లో ద్రవ్యోల్బణం 4.2 శాతానికి తగ్గొచ్చన్నారు. వాణిజ్య బ్యాంకుల ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉందన్నారు. బ్యాంక్‌ల వద్ద సరిపడా ద్రవ్య లభ్యత ఉందన్నారు. దేశంలో సైబర్ నేరాలు పెరుగుతున్న క్రమంలో వీటిని అరికట్టేందుకు ప్రత్యేకంగా బ్యాంక్.ఇన్ డొమైన్‌ను తీసుకురానున్నట్లు గవర్నర్ తెలిపారు.

వాట్సాప్‌లో ఇంటర్ ప్రాక్టికల్ హాల్ టిక్కెట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్‌కు హాజరయ్యే విద్యార్థుల హాల్ టిక్కెట్లను ఇంటర్మీడియట్ బోర్డు వాట్సాప్ ద్వారా అందించనుంది. వాట్సాప్ గవర్నెన్స్‌లో భాగంగా ప్రవేశపెట్టిన మనమిత్ర ద్వారా హాల్ టిక్కెట్ పొందవచ్చని ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా శుక్రవారం ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. 955230009 నెంబర్‌కు ప్రథమ సంవత్సరం హాల్ టిక్కెట్ నెంబర్ గానీ, లేదా విద్యార్థి ఆధార్ నెంబర్, పుట్టిన తేదీ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని తెలిపారు. బోర్డు వెబ్‌సైట్ bie.ap.gov.in ద్వారా కూడా ఇలానే డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి ఎంపిసి, బైపిసి ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

వంశీ పిటిషన్‌పై తీర్పు వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

గన్నవరం టిడిపి ఆఫీసుపై దాడి ఘటనకు సంబంధించి పోలీసులు పెట్టిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ వేసిన పిటిషన్‌లో హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. ఇరుపక్షాల వాదనలు శుక్రవారం ముగియడంతో తీర్పును ఈ నెల 20న వెలువరిస్తామని జస్టిస్ విఆర్‌కె కృపాసాగర్ ఉత్తర్వులు జారీ చేశారు. న్యాయవాది వి దేవి సత్యశ్రీ వాదిస్తూ, పిటిషనర్‌పై ఎస్‌సి, ఎస్‌టి చట్టం కింద కేసు నమోదు చెల్లదని, కాబట్టి ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరారు. పోలీసుల తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా ప్రతివాదన చేస్తూ, ఎస్‌సి, ఎస్‌టి చట్టం కింద కేసు నమోదైనప్పుడు ముందస్తు బెయిల్ హైకోర్టు ఇవ్వడానికి వీల్లేదన్నారు. ప్రత్యేక కోర్టు ఇచ్చే ఉత్తర్వులపై దాఖలయ్యే అప్పీళ్లపై మాత్రమే హైకోర్టు జోక్యం చేసుకోవచ్చునని చెప్పారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

ఆదాయం వచ్చే పంటలకే ప్రోత్సాహం

- హార్టికల్చర్, ఆక్వాకు ప్రాధాన్యం
- పిడిఎస్ కోసం ప్రజలు తినే వెరైటీల సేద్యం
- టెక్నాలజీతో సాగు కొత్త పుంతలు
- వ్యవసాయశాఖలపై సిఎం సమీక్షలో నిర్ణయం



సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

రైతులకు ఆదాయం వచ్చే పంటలనే ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం 'అగ్రివాచ్'తో ఎప్పటికప్పుడు అధ్యయనం చేయించి రైతులకు సలహాలు సూచనలు ఇవ్వాలని అధికారులను కోరింది. రైతులు ఇష్టానుసారం పంటలు సాగు చేస్తున్నారని, ఈ పాత పద్ధతులు మారాలని సూచించింది. ఉద్యానవన పంటలను, ప్రకృతి సేద్యాన్ని పెంచాలని ఆదేశించింది. వ్యవసాయ, అనుబంధ రంగాల వృద్ధి రేటును తప్పనిసరిగా 20 శాతానికి పెంచాలని, రాబోయే ఐదేళ్లలో వృద్ధి రేటును 30 శాతానికి తీసికెళ్లాలని, అందుకనుగుణంగా ప్రణాళికలు, లక్ష్యాలు నిర్ణయించాలని కోరింది. వ్యవసాయ అనుబంధ రంగాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం సమీక్షించారు. ఆ వివరాలను వ్యవసాయ మంత్రి కె అచ్చెన్నాయుడు మీడియాకు వివరించారు... ప్రస్తుతం వ్యవసాయ, అనుబంధ రంగాల వృద్ధి రేటు 15.86 శాతంగా ఉందని. ఎట్టి పరిస్థితుల్లో 20 శాతానికి తక్షణం పెంచాలన్నారు. వ్యవసాయ పంటల కంటే హార్టికల్చర్ పంటలపై రైతులకు ఆదాయం రావట్లేదన్నారు. '18 లక్షల హెక్టార్లలో హార్టికల్చర్ వలన స్థూల ఆదాయం 1.52 లక్షల కోట్లు కాగా, వ్యవసాయ పంటలు ఖరీఫ్, రబీ కలుపుకొని 52 లక్షల హెక్టార్ల సాగు ద్వారా 57 వేల కోట్ల ఆదాయం వస్తోంది. అందుకే పామాయిల్, డ్రాగన్ ఫ్రూట్స్ వంటి వాటిని సర్కారు ప్రోత్సహిస్తుంది' అని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. పామాయిల్ పరిశ్రమలను పిపిపి పద్ధతిలో నెలకొల్పుతామని. తక్షణం 50 వేల ఎకరాల్లో సూక్ష్మ సేద్యాన్ని అదనంగా ప్రవేశపెడతామన్నారు. సబ్సిడీలిస్తామని చెప్పారు. కుప్పంలో హార్టికల్చర్ పంటలను నిల్వ చేసేందుకు కూలర్లు ఏర్పాటు చేయడంతో. ఆ ప్రయోగం విజయవంతమైందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 శాతం సబ్సిడీ ఇచ్చి ఈ విధానాన్ని అమలు చేస్తామని చెప్పారు. 'అనంతపురంలో పైలెట్ ప్రాజెక్టు కింద హార్టికల్చర్ హబ్‌గా నిర్ణయించాం... అటువంటి వాటిని రాష్ట్ర వ్యాప్తంగా, జిల్లాల వారీగా నిర్వహిస్తాం. హార్టికల్చర్ కోసం గ్రామీణ ఉపాధి హామీ నిధుల వాడకాన్ని రూ.200 కోట్ల వరకు పెంచుతాం. పురుగుమందులు, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించేందుకు ప్రకృతి సేద్యాన్ని పెద్ద ఎత్తున ప్రవేశపెడతాం. అందుకోసం అదనంగా కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తాం. ఒకప్పుడు ధాన్యం పండించిన రైతులు ధనవంతులుగా ఉండేవారు. ప్రస్తుతం పరిస్థితి రివర్స్ అయింది. హార్టికల్చర్ పంటలు పండించే రైతులు ధనవంతులవుతున్నారు. ఆక్వానూ ప్రోత్సహిస్తాం. తృణ ధాన్యాలను ప్రోత్సహిస్తాం. పిడిఎస్ బియ్యం రీసైక్లింగ్ అవుతోంది. అందుకోసం ప్రజలు ఏ రకాలను ఇష్టపడతారో వాటినే రైతులు పండించేలా చర్యలు చేపడతాం...' అని మంత్రి తెలిపారు.

టీమ్ స్పిరిట్ కోసమే ర్యాంకులు : చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రతి ఒక్కరూ టీమ్ స్పిరిట్‌తో పనితీరుపై సమీక్షించుకుని పనిచేయాలన్నదే తమ ఆలోచన అని, అందులో భాగంగానే దస్త్రాల పరిష్కారంలో మంత్రులకు ర్యాంకులు ఇచ్చామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. గురువారం విడుదల చేసిన ర్యాంకులు ఎవరినీ ఎక్కువ చేయడానికి, ఎవరినీ తక్కువ చేయడానికి కాదని శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఎవరు ఏ స్థానంలో ఉన్నారనేది చెప్పడం ద్వారా తమతో తాము పోటీ పడటంతోపాటు, ఒకరితో ఒకరు పోటీ పడి పనిచేయడానికి, పాలనలో వేగం పెంచేందుకు చేసిన ప్రయత్నం అని వివరించారు. దస్త్రాల పరిష్కారంలో తాను కూడా తన స్థానాన్ని మరింత మెరుగుపరుచుకోవాల్సి ఉందని పేర్కొన్నారు.

'పీపుల్ ఫస్ట్' విధానంతో తాను, తన సహచర మంత్రులంతా పనిచేస్తున్నామని తెలిపారు. లక్ష్యాల సాధనకు అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనలో విధ్వంసమైన వ్యవస్థలను గాడిలో పెట్టేందుకు శాయశక్తులా కష్టపడుతున్నామని తెలిపారు. సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని సుపరిపాలనతో సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తామని, ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని తెలిపారు. ఈ లక్ష్యాలను వేగంగా చేరుకోవాలంటే ప్రభుత్వంలో ఉన్న ప్రతి ఒక్కరూ కష్టపడాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలి

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1457వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఐఎన్‌టియుసి నాయకులు, కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు బొగ్గు సరఫరా కోసం కేంద్రం ఎన్‌ఎండిసితో చేసుకున్న ఒప్పందం కార్మికుల్లో ఆశలు చిగురింపజేస్తోందన్నారు. మోడీ సర్కారు చిత్తశుద్ధితో ప్లాంట్ పరిరక్షణకు ఇటువంటి మరిన్ని చర్యలు చేపట్టాలని, సొంత గనులు కేటాయించాలని కోరారు. కార్మికులకు పెండింగ్ జీతాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులను తొలగించే చర్యలను ఉపసంహరించుకోవాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ జరగడం లేదని కేంద్రం ప్రకటించే వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

విశాఖ ఉక్కు పరిరక్షణకు ఉద్యమం

- కార్మిక సంఘాల నిర్ణయం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖపట్నం, కడప స్టీల్‌ప్లాంట్ల పరిరక్షణ కోసం ఉద్యమం చేపట్టాలని కార్మిక సంఘాలు నిర్ణయించాయి. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో పలు కార్మిక సంఘాల నాయకులు శుక్రవారం సమావేశమయ్యారు. కేంద్ర కార్మిక సంఘాలతో పాటు రాష్ట్రంలో కలిసొచ్చే అన్ని కార్మిక సంఘాలనూ కలుపుకుని పెద్దయెత్తున ఉద్యమ రూపకల్పన చేయాలని నిర్ణయం తీసుకున్నారు. విశాఖ, కడప స్టీల్‌ప్లాంట్ల పరిరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ఈ ప్లాంట్లు పట్టుకొమ్మలని, ఉద్యోగ, ఉపాధి కల్పనకు, లక్షలాది కుటుంబాల జీవనోపాధికి కారణమయ్యే వాటిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాలని కోరారు. మౌలిక వసతులు, ఇనుము, బొగ్గు, ఇతర వనరులను ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల జీతాలు, కాంట్రాక్టు కార్మికుల వేతనాలను తక్షణమే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ప్లాంట్ల పరిరక్షణ కోసం తొలిదశగా ఈ నెల 19న అన్ని కలిసొచ్చే శక్తులు, వ్యక్తులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. తద్వారా ఉద్యమ రూపకల్పనకు సభలు, సమావేశాలు, సదస్సులను అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహించాలని నిర్ణయిస్తామని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల అభివృద్ధికి, ఉపాధికి ఈ రెండు ప్లాంట్లు ప్రభుత్వాల ఆధీనంలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కులలానే, రాయలసీమ ప్రాంతవాసుల హక్కుగా కడప ప్లాంట్ పరిరక్షణ కోసం మరో ప్రజా ఉద్యమ రూపాన్ని తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్లాంట్ పరిరక్షణ ఐక్యవేదిక ఉద్యమ కన్వీనర్ వి ఉమామహేశ్వరరావు, సిఐటియు రాష్ట్ర నాయకులు కె ఉమామహేశ్వరరావు, నరసింహారావు, ఎఐటియుసి డిప్యూటీ కార్యదర్శి ఎస్ వెంకటసుబ్బయ్య, ఐఎఫ్‌టియు ప్రధాన కార్యదర్శి ఎం రామకృష్ణ, ఎఐయుటియుసి రాష్ట్ర అధ్యక్షులు సుధీర్, టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు మరీదుప్రసాద్ బాబు పాల్గొన్నారు.

చిత్తూరు మేయర్ దంపతుల హత్య కేసులో
ప్రధాన నిందితుడు శ్రీరామ్‌కు బెయిల్

ప్రజాశక్తి-అమరావతి

చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా ఉండగా కఠారి అనురాధ, ఆమె భర్త కఠారి మోహన్‌ను దారుణ హత్య కేసులో ప్రధాన నిందితుడు శ్రీరామ్ చంద్రశేఖర్ అలియాస్ చింటూకు హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. 'రూ.లక్ష చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలి. కోర్టు విచారణకు రావాల్సిన తేదీల్లో తప్ప మిగిలిన రోజుల్లో చిత్తూరులోకి అడుగుపెట్టకూడదు. రాకపోకలను జిల్లా ఎస్‌పికి తెలియజేయాలి. ఫోన్ నెంబర్, లైవ్ లొకేషన్లను ఎస్‌పికి ఇవ్వాలి. సాక్షులను బెదిరించరాదు. సాక్షులను ప్రభావితం చేయరాదు' వంటి షరతులను జస్టిస్ సుబ్బారెడ్డి విధిస్తూ శుక్రవారం తీర్పు ఇచ్చారు. చింటూ గత తొమ్మిదేళ్లుగా జైల్లో ఉన్నాడు. కఠారి మోహన్ మేనల్లుడైన శ్రీరామ్ చంద్రశేఖర్ అలియాస్ చింటూ, ఇతరులు 2015 నవంబర్ 15న చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీసులో మేయర్ అనురాధ, కఠారి మోహన్ హత్యకు గురయ్యారు. ఈ కేసులో పోలీసులకు చింటూ లొంగిపోయాడు. అప్పటి నుంచి జైల్లో ఉన్న ఆయనకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది.

అబద్ధాలు, అసత్యాలే జగన్ అజెండా

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అబద్ధాలు, అసత్యాలే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అజెండా అని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. జగన్ హయాంలో ప్రజాస్వామ్యబద్ధంగా పాలన నడిపించలేదన్నారు. టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజాతీర్పును అపహస్యం చేసేలా అసెంబ్లీకి రానని అంటున్నారని తెలిపారు. నిజమైన ప్రజానాయకుడు ప్రజలిచ్చిన తీర్పును గౌరవించాలని చెప్పారు. అసెంబ్లీకి రాకుండా మీడియా ముఖంగానే మాట్లాడతానని చెప్పటం ప్రజాతీర్పును అగౌరవపరచడమేనని అన్నారు.

అప్పులతో జగన్ ఏం చేశారు : మంత్రి సంధ్యారాణి

ఎన్నికల కోడ్ సమయంలో తెచ్చిన అప్పులను వైఎస్ జగన్ ఏం చేశారని గిరిజనశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మరో సమావేశంలో ప్రశ్నించారు. జగన్ తన పాలనలో రాష్ట్రాన్ని 20 ఏళ్లు వెనక్కి నెట్టి రూ.8 లక్షల కోట్ల రాష్ట్ర సంపదను దోచుకున్నారని విమర్శించారు. వైసిపి ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై సభలో చర్చించకపోతే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సంధ్యారాణి, పల్లా శ్రీనివాస్ కలిసి టిడిపి కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రజల వినతులను స్వీకరించారు.



శైలజానాథ్‌కి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన వైస్ జగన్

ప్రభుత్వ ఉద్యోగుల హౌస్ హోల్డ్ మ్యాపింగ్ తప్పని సరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల ద్వారా చేపట్టిన హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో వేలాదిమంది ప్రభుత్వ ఉద్యోగుల ఆచూకీ లభ్యం కావడం లేదు. దీంతో ఈ విషయాన్ని ప్రభుత్వ పెద్దలు సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం. ఎట్టిపరిస్థితుల్లోనూ హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో నమోదు కాని ప్రభుత్వ ఉద్యోగుల సమాచారాన్ని సేకరించి తప్పనిసరిగానమోదు చేయాల్సిందేనంటూ సర్వే బృందాలను ఆదేశిస్తున్నారు. ఈనెల 3వ తేదీ నాటికి వీరిలో 85,169మంది ఉద్యోగుల వివరాలు హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో జియో ట్యాగింగ్ కాగా, మిగిలిన 63,001 ఉద్యోగుల మ్యాపింగ్‌కు వారి చిరునామాలు సర్వే బృందాలకు దొరకని పరిస్థితి. దీంతో ఆయా ఉద్యోగులు రాష్ట్రంలో నివాసంఉండకుండా తెలంగాణలో నివాసం ఉంటూ, రాక పోకలు సాగిస్తున్నారా? లేక పనిచేసే ప్రదేశంలో ఆయా ఉద్యోగులు నివాసం ఉండకుండా వారి స్వగ్రామాల్లో కుటుంబ సభ్యులజాబితాలో వీరి పేర్లు ఉన్నాయా? లేక వారి కుటుంబ సభ్యులకు ఏమైనా ప్రభుత్వ పథకాలు అందుతుంటే అవి నిలిచిపోతాయనే ఆందోళనతో హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌కు ఆయా ఉద్యోగులు ముందుకు రావడం లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌ను ఈనెల 15లోగా పూర్తి చేయాలని గ్రామ వార్డు సచివాలయాలశాఖ ఉద్యోగులపై వత్తిడి పెంచుతోంది.

కృష్ణానదిపై తొమ్మిది వంతెనలు

- కేంద్రం వద్దకు రాష్ట్ర ప్రతిపాదనలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



అమరావతి రాజధానికి అనుసంధానంగా కృష్ణానదిపై మొత్తం తొమ్మిది వంతెనలు నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. అదే జరిగితే కృష్ణా, గుంటూరు, పల్నాడు, ఎన్‌టిఆర్, బాపట్ల జిల్లాలో కొంతభాగం కలిపి అతి పెద్దనగరంగా అమరావతి రూపొందుతుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అమరావతి కొత్త రైల్వేలైన్‌తో సమానంగా వీటిని కూడా పూర్తిచేయాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. దీనిని దృష్టిలో ఉంచుకురనే ఈ వంతెనలకు సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం పంపినట్లు తెలిసింది.

ఎక్కడెక్కడ...!

ప్రసుతం కృష్ణానదిపై కృష్ణా, గుంటూరు జిల్లాల మధ్యలో ప్రకాశం బ్యారేజీ, కనకదుర్గ వారధి ఉన్నాయి. కృష్ణా, బాపట్ల జిల్లాలను కలుపుతూ పెనుమూడి వారధి ఉంది. వీటికితోడు త్వరలో రాజధానిలో నుండి వెళ్లే పశ్చిమ జాతీయ రహదారి వంతెన అందుబాటులోకి రానుంది. ఇవి కాకుండా మరో ఆరు వంతెనలు ఏర్పాటు చేయనున్నారు. ఔటర్‌రింగురోడ్డుకు అనుసంధానంగా అమరావతి పశ్చిమ ప్రాంతంలో అమరావతి, మున్నలూరు మధ్య అతిపెద్ద వంతెన నిర్మించనున్నారు. వైకుంఠపురం కేతనకొండ మధ్యలో ఇన్నర్‌రింగురోడ్డుపై మరో వంతెన నిర్మిస్తారు. ఉద్దండ్రాయునిపాలెం, ఇబ్రహీంపట్నం మధ్య రాజధాని ఐకానిక్ బ్రిడ్జి కట్టనున్నారు. వీటితోపాటు వెంకటపాలెం, సూరాయపాలెం మధ్యలో పశ్చిమ జాతీయ రహదారి వంతెన పూర్తవుతోంది. మొత్తం నాలుగు వంతెనలు అమరావతి నూతన నగరంతో కలిసే విధంగా నిర్మించనున్నారు. ఇవి కాకుండా రాజధాని తూర్పుభాగంలో పెనమలూరు మండలం చోడవరం గుంటూరు జిల్లా రామచంద్రాపురం దగ్గర్లో ఇన్నర్‌రింగురోడ్డు వంతెన కట్టనున్నారు. కృష్ణా జిల్లా కాసరనేనివారిపాలెం గుంటూరు జిల్లా పెదకొండూరు మధ్య తూర్పు జాతీయ రహదారి బ్రిడ్జి రానుంది. వల్లూరుపాలెం మున్నంగి మధ్యలో జాతీయ రహదారి వస్తుంది. వీటికి దిగువలో పెనుమూడి వారధి కూడా ఉంది. కృష్ణానదిపై కొత్తగా నిర్మించే వంతెనలన్నీ ఒక్కోదానికి 10 లేదా 15 కిలోమీటర్ల దూరం మాత్రమే ఉండనుంది. దీంతో ఈ ప్రాంతం మొత్తం అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వం చెబుతోంది.

కృష్ణానదిలో పర్యాటకానికి ప్రణాళిక

కొత్తగా నిర్మించబోయే వంతెనలతోపాటు ఒకటీ రెండు బ్యారేజీలు నిర్మించడం ద్వారా నీటిని నిల్వచేసి కృష్ణానదిలో వాటర్ ఎమ్యూజ్‌మెంట్ ఏర్పాటు చేయాలంటూ గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా విడుదల చేసిన విజన్ 2020-21 డాక్యుమెంటులో ప్రస్తావించారు. దీనిలో భాగంగానే ప్రకాశం బ్యారేజీ నుండి అటు కృష్ణాజిల్లా(ప్రస్తుత ఎన్‌టిఆర్), గుంటూరు జిల్లావైపు తాడేపల్లి దగ్గర రిటైనింగ్ వాల్స్ నిర్మించి పర్యాటకం, నీటిలో బోటు షికార్లు ఏర్పాటు చేయాలనేది గతంలో ఉన్న ప్లాను. దీన్ని ప్రస్తుతం అమలు చేసేందుకు వీలుగా ప్రకాశం బ్యారేజీ నుండి దిగువకు రిటైనింగ్ వాల్స్ చేపడుతున్నారు.

ఎన్‌టిఆర్ జిల్లావైపు గోడ నిర్మాణం ఇప్పటికే పూర్తయ్యింది. గుంటూరు జిల్లావైపు నిర్మాణానికి ఇటీవల రూ.294 కోట్లు కేటాయించారు. దీనిలో భాగంగానే పెదపులిపాక సమీపంలో బ్యారేజీ నిర్మాణం చేపట్టాలనేది గత ప్లాను. ఇటీవల ఇచ్చిన మాస్టర్‌ప్లానులో దీన్ని కూడా చూపించారు.

ప్రజల పక్షాన పోరాడుతాం

- వైసిపిలో చేరిన అనంతరం సాకే శైలజానాథ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్‌డిఎ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు విసిగిపోయారని, వారి తరపున పోరాడేందుకే వైసిపిలో చేరానని పిసిసి మాజీ అధ్యక్షులు సాకే శైలజానాథ్ తెలిపారు. శుక్రవారం ఉదయం తాడేపల్లిలోని వైసిపి క్యాంపు కార్యాలయంలో పార్టీ అధ్యక్షులు జగన్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం శైలజానాథ్ మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయడం లేదని అన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను నిర్వీర్యం చేయడం ద్వారా పేదలకు విద్యను దూరం చేశారన్నారు. విద్యారంగంలో జగన్ చేసిన సంస్కరణలను పక్కనబెట్టారని, ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేశారని విమర్శించారు. రాయలసీమలో రైతుల కష్టాలను చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. వైసిపి సీనియర్ నాయకులు అనంతవెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. శైలజానాథ్ పార్టీలో చేరడాన్ని ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వ వైఖరిపై ప్రజల్లో పెద్దయెత్తున చర్చ సాగుతోందని పేర్కొన్నారు. రాయలసీమకు కృష్ణా జలాలు తీసుకొస్తానని చెబుతున్నది అబద్ధమన్నారు. రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించిన ప్రాజెక్టులు పూర్తి చేయకుండా ఆ ప్రాంతానికి మోసం చేశారని విమర్శించారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశ్రమల, వాణిజ్య శాఖల కార్యదర్శి ఎన్. యువరాజ్

ఫోన్‌లోనే అన్ని ధ్రువపత్రాలు

- డేటా అనుసంధానంతో మెరుగైన సేవలు
- ఐటి, ఆర్‌టిజిఎస్ కార్యదర్శి కాటంనేని భాస్కర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాబోయే రోజుల్లో పౌరులు తమకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలేవీ భౌతికంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉండబోదని తమ ఫోన్‌లోనే అన్ని పత్రాలు డిజిటల్ రూపేణా పొందుపరిచే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని ఐటి, ఆర్‌టిజిఎస్ కార్యదర్శి కాటంనేని భాస్కర్ తెలిపారు. వివిధ శాఖల మధ్య డేటా అనుసంధాన ప్రక్రియ గురించి అన్ని శాఖలు, విభాగాధిపతులతో రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టిజిఎస్) శుక్రవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికీ ఒక సింగిల్ సోర్స్ ఆఫ్ డేటా అనేది లేదన్నారు. ఆయా శాఖల్లో చాలా డేటా ఉన్నప్పటికీ నేటికీ ఒకచోట అనుసంధానం కాలేదన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో పౌరులకు, ప్రభుత్వం అందించే సేవలు మరింత సమర్థవంతంగా అందించడానికి సాంకేతిక అవరోధాలు ఏర్పడుతున్నాయన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఆర్‌టిజిఎస్ ఒక పెద్ద డేటా లేక్‌ను ఏర్పాటు చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని శాఖల్లో ఉన్న డేటాను ఈ డేటా లేక్‌తో అనుసంధానం చేయడం ద్వారా పౌరులకు డిజిటల్ సేవలు మరింత మెరుగ్గా అందించే సదుపాయం కల్పిస్తామన్నారు. ఫోన్ ద్వారానే తమకు కావాల్సిన సర్టిఫికెట్లు పొందేందుకు వీలుగా మెటా సంస్థతో ప్రభుత్వం అవగాహన ఒప్పందం చేసుకుందన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 161 రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని భాస్కర్ తెలిపారు. వాట్సాప్ సేవలను తెలుగు, ఇంగ్లీషు భాషల్లో అందిస్తున్నామని, అయితే సరిహద్దు రాష్ట్రాల్లోని జిల్లాల్లో ప్రజల సౌకర్యం కోసం ప్రాంతీయ భాషలైన తమిళం, ఒరియా, కన్నడ భాషల్లోనూ అందించే ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

ప్రతి శాఖలోనూ సిడిటిఒ

ప్రతి శాఖలోనూ ఒక చీఫ్ డేటా టెక్నికల్ ఆఫీసరు (సిడిటిఒ)ను నియమించుకోవాలని అధికారులకు కాటంనేని భాస్కర్ సూచించారు. తమ శాఖలో అలాంటి వ్యక్తిని రెండు రోజుల్లో గుర్తించి వారికి ఈ బాధ్యతలు అప్పజెప్పాలన్నారు. అలాగే ఆర్‌టిజిఎస్ డేటా లేక్‌తో ఆయా శాఖలు తమవద్ద ఉన్న డేటాను షేర్ చేసుకునే ప్రక్రియ వారం రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ ముఖ్య కార్యనిర్వహణాధికారి కె దినేష్‌కుమార్, డిప్యూటీ సిఇఒ మాధురి, పౌరసరఫరాలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సౌరవ్‌గౌర్, ఐజి టెక్నికల్ సర్వీస్ శ్రీకాంత్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనరు వీరపాండియన్, జిఎస్‌డబ్ల్యు డైరెక్టర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్‌టిజిఎస్ పనితీరు ఆదర్శనీయం : ఒసిమా దబుత

ఆర్‌టిజిఎస్ పనితీరు ఆదర్శనీయమని ఆఫ్రికా దేశాల్లో ఒకటైన బోత్సవానా దేశ ప్రతినిధులు ప్రశంసించారు. బోత్సవానా దేశ ప్రభుత్వ సలహాదారు అర్బన్‌ఒసిమా దబుత్ శుక్రవారం సచివాలయంలోని ఆర్‌టిజిఎస్ కేంద్రాన్ని సందర్శించారు. తమ దేశంలో కూడా ఈ తరహా వ్యవస్థ ఏర్పాటు చేసుకునే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్‌టిజిఎస్ డిప్యూటీ సిఇఒ మాధురి పాల్గొన్నారు.

తిరుమలలో దంపతుల ఆత్మహత్య

- నందకం అతిథిగృహంలో ఘటన

ప్రజాశక్తి- తిరుమల



శ్రీనివాసులు నాయుడు, అరుణ (ఫైల్ ఫొటో)

తిరుమలలో విషాదం చోటుచేసుకుంది. నందకం అతిథి గృహంలో దంపతులు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతి అబ్బన్న కాలనీకి చెందిన రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు నాయుడు (59), తన భార్య అరుణ(55)తో కలిసి గురువారం రాత్రి తిరుమలకు వచ్చారు. నందకం అతిథి గృహంలోని 203 గదిలో బస చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం తన కుమార్తె, అల్లుడితో ఫోన్‌లో మాట్లాడారు. గది తీసుకున్న సమయం అయిపోయినా బయటకు రాకపోవడంతో శుక్రవారం మధ్యాహ్నం టిటిడి సిబ్బందికి అనుమానం వచ్చి కిటికీలు తెరిచి చూడగా వారు ఫ్యానుకు వేలాడుతూ కనిపించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. వారి బంధువులకు సమాచారం అందించారు. శ్రీనివాసులు నాయుడు తిరుమల క్రైమ్ హెడ్ కానిస్టేబుల్‌గా, కోర్టు కానిస్టేబుల్‌గా పని చేసి రిటైర్డ్ అయ్యారు. తిరుమల టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పరిశ్రమల స్థాపనకు భూముల పరిశీలన

ప్రజాశక్తి-గుడ్లూరు

నెల్లూరు జిల్లా రామాయపట్నం పోర్టు ఆధారిత పరిశ్రమల స్థాపనకు చెందిన భూములను రాష్ట్ర పరిశ్రమల, వాణిజ్య శాఖల కార్యదర్శి ఎన్ యువరాజ్ పోర్టు పరిసర ప్రాంతాల్లోని భూములను కలెక్టర్ ఒ ఆనంద్‌తో కలసి శుక్రవారం పరిశీలించారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన యువరాజ్‌కు కలెక్టర్ స్వాగతం పలికారు. అనంతరం అలగాయపాలెం వ్యవసాయ భూములను వారు పరిశీలించారు. కరేడు చెరువును పరిశీలించి ఆయకట్టు వివరాలను తెలుసుకున్నారు. చెరువులో నీరు సమృద్ధిగా ఉండడం చూసి వర్షాధారం లేక ప్రాజెక్ట్ ద్వారా నీరు నింపారా అని యువరాజ్ ఆరాతీశారు. టెంకాయచెట్లపాలెం, కావలి రూరల్ అనెమడుగు గ్రామ పంచాయతీలోని సర్వాయపాలెం, అనెమడుగు గ్రామం, చెన్నాయపాలెం భూములను పరిశీలించారు. అనంతరం రామాయపట్నం పోర్టుకు చేరుకున్నారు. పోర్టు పరిధిలో నిర్మాణంలోని ఇండోసోల్ సోలార్ ఎనర్జీ ప్లాంటును సందర్శించారు. ప్లాంటులో కలియతిరిగి పనుల పురోగతి గురించి కంపెనీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మారిటైమ్ బోర్డు సిఇఒ ప్రవీణ్ ఆదిత్య, కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ, కావలి ఆర్‌డిఒ వంశీకృష్ణ, రామాయపట్నం రాజశేఖర్, తహశీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో పోస్టులు వ్యవస్థీకృత నేరాల కిందకు రావు

- హైకోర్టులో వాదనలు

ప్రజాశక్తి-అమరావతి

సోషల్ మీడియా పోస్టులను వ్యవస్థీకృత నేరంగా పరిగణిస్తూ పోలీసులు కేసులు నమోదు చేయడం చెల్లదని శుక్రవారం హైకోర్టులో వాదనలు జరిగాయి. సోషల్ మీడియా పోస్టులు బిఎన్ఎస్ సెక్షన్ 111 కింద వ్యవస్థీకృత నేరం కిందకు రావని సీనియర్ న్యాయవాదులు మనోహర్‌రెడ్డి, పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదించారు. ఆ సెక్షన్ కింద కేసు నమోదు చేయాలంటే గత పదేళ్లలో ఒకటి కంటే ఎక్కువ చార్జిషీట్లు దాఖలు కావాలన్నారు. సోషల్ మీడియాలో పోస్టులకు సంబంధించి భార్గవ్ రెడ్డిపై పలు జిల్లాల పోలీసులు వేర్వేరుగా కేసులు నమోదు చేయడం చెల్లదన్నారు. ఎస్‌సి, ఎస్‌టి చట్టం కింద కూడా కేసు నమోదు చట్ట వ్యతిరేకమని ప్రకటించాలని కోరారు. తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని భార్గవ్‌రెడ్డి, సోషల్ మీడియా పోస్టుల వ్యవహారంపై నమోదైన కేసుల్లో తమకు కూడా ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ కడపకు చెందిన సరిగిరెడ్డి అర్జున్‌రెడ్డి, పిడి టివికి చెందిన షేక్ జానీ బాషా తదితరుల పిటిషన్లను శుక్రవారం జస్టిస్ న్యాపతి విజయ్ విచారించారు. తదుపరి విచారణను ఈ నెల 13కు వాయిదా వేశారు.

ద్విచక్రవాహనాల దొంగలు అరెస్టు

- 56 బైక్‌లు స్వాధీనం

ప్రజాశక్తి-నెల్లూరు


రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో ద్విచక్ర వాహనాలను అపహరిస్తున్న దొంగలను నెల్లూరు జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 56 బైకులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులకు సంబంధించిన వివరాలను నెల్లూరులోని ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్‌పి జి.కృష్ణకాంత్ వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఇటీవల కాలంలో పలు ద్విచక్ర వాహనాలు అపహరణకు గురవ్వడంతో బాధితులు ఫిర్యాదు చేశారు. దీంతో, జిల్లా వ్యాప్తంగా పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో గురువారం కొడవలూరు మండలం, పద్మనాభసత్రం ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా పొంతన లేని సమాధానాలు చెబుతున్న ఆవల శివ, కామంచి నాని, శ్రీరామ్ రవి, నల్లగుండ్ల హోసన్నలను అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం బయటపడింది. ఆవల శివ 2017లో ఓ హత్య కేసులో బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత తన చిన్నమ్మ కుమారుడు శ్రీరామ్‌రవితో కలిసి 25 మోటరు బైక్‌లను చోరీ చేశాడు. వీరికి కామంచి నాని, నల్లగండ్ల హోసన్న పరిచయం కావడంతో నలుగురు కలిసి ఒక గ్రూపుగా ఏర్పడి నెల్లూరులో 24, తిరుపతిలో 21, ప్రకాశంలో ఎనిమిది, బాపట్ల, కడప, తూర్పుగోదావరి జిల్లాల్లో ఒక్కొక్క మోటారు సైకిల్‌ను దొంగతనం చేశారు. నలుగురు నిందితులూ నెల్లూరు జిల్లా అల్లూరు మండలానికి చెందిన వారని ఆయన చెప్పారు.

షాక్ కొడుతున్న స్మార్ట్ మీటర్లు

- పాత మీటర్ ఉన్నప్పుడు రూ.3,452
- స్మార్ట్ మీటర్ బిగించాక రూ. 41,650
- బిల్లును చూసి ఖంగుతిన్న వెల్డింగ్ షాపు నిర్వాహకుడు

ప్రజాశక్తి - తుగ్గలి (కర్నూలు)

కర్నూలు జిల్లా తుగ్గలి మండల కేంద్రంలో చిన్న వెల్డింగ్ షాపుకు స్మార్ట్ మీటరు బిగించిన తర్వాత మొదటి బిల్లు రూ. 24 వేలు, రెండో నెల విద్యుత్ బిల్లు రూ.41,650 వచ్చింది. ఈ బిల్లును చూసి షాపు నిర్వాహకుడు కృష్ణ ఖంగుతిన్నాడు. ఆయన స్వగ్రామం పత్తికొండ మండలం నరశ్యామల గ్రామం. పది సంవత్సరాల క్రితం బతుకు తెరువు కోసం తుగ్గలి మండల కేంద్రానికి వచ్చారు. చిన్న వెల్డింగ్ షాప్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. షాపునకు ప్రతి నెలా రూ. మూడు వేల నుండి రూ. ఐదు వేల లోపు కరెంటు బిల్లు వచ్చేది. గతేడాది 2024 జులైలో రూ.3,800, నవంబర్‌లో రూ.3,452 బిల్లు వచ్చింది. డిసెంబర్‌లో స్మార్ట్ మీటర్ బిగించిన తర్వాత మొదటి బిల్లు రూ. 24 వేలు వచ్చిందని విద్యుత్ అధికారులు కృష్ణకు తెలిపారు. అయితే, బిల్లు మాత్రం ఇవ్వలేదు. ఇంత బిల్లు కట్టలేనని అధికారులకు ఆయన చెప్పడంతో రూ.10 వేలు కట్టించుకున్నారు. ఈ నెల



జులై, నవంబర్, జనవరి బిల్లులు

రెండవ తేదీన విద్యుత్ బిల్లు రూ. 41,650 ఇచ్చారు.357 యూనిట్లకు అన్ని కలిపి రూ.41,650 బిల్లు వచ్చింది. ఈ బిల్లులో ఎనర్జీ ఛార్జీ రూ. 28,186, ఫిక్స్‌డ్ ఛార్జీ రూ.1050, కస్టమర్ ఛార్జీ రూ.45, ఎలక్ట్రిసిటీ డ్యూటీ రూ.357, ఎఫ్‌పిపిసిఎ (2022-06) రూ.401, ఎఫ్‌పిపిసిఎ (2023-05) రూ. 193, ఎఫ్‌పిపిసిఎ (2025-01) రూ. 747, ఇంట్రెస్ట్ అన్ డీడ్ రూ. 2.20, సర్ ఛార్జీ రూ. 150, ట్రూ అప్ ఛార్జీ రూ.94.91 ఇలా అన్ని కలిపి రూ. 41,650 బిల్లు వేశారు. బిల్లు ఇచ్చిన మరుసటి రోజే విద్యుత్ కనెక్షన్‌ను అధికారులు తొలగించారు. నెల అంతా కష్టపడి పని చేసినా తనకు 40 వేల రూపాయలు ఆదాయం రాదని, ఈ కరెంటు బిల్లు తాను కట్టలేనని షాప్ నిర్వాహకుడు ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రోజుల నుండి పని లేక ఖాళీగా ఉన్నానని, స్మార్ట్ మీటర్ తొలగించి పాత మీటర్‌నే బిగించాలని అధికారులను కోరుతున్నారు.

కెపాసిటర్ ఉండడం వల్లే అధిక బిల్లు

వెల్డింగ్ షాప్‌లో కెపాసిటర్ హెవీ పెట్టుకోవడం వల్ల బిల్లు ఎక్కువగా వచ్చింది. మోటర్ ఆఫ్ చేసిన తర్వాత కెపాసిటర్ కూడా ఆఫ్ చేయాలి. అలా ఆఫ్ చేయని పక్షాన కరెంట్ రన్ అవుతూనే ఉంటుంది. అందువల్ల కరెంటు బిల్లు ఎక్కువగా వచ్చింది. బిల్లు కట్టాల్సిందే. కరెంట్ బిల్లులు ఎక్కువగా రాకుండా విద్యుత్ ఎలా వినియోగించుకోవాలో స్మార్ట్ మీటర్లు బిగించేటప్పుడే ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

- తుగ్గలి విద్యుత్ శాఖ ఏఈ మహేశ్వర్ రెడ్డి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎపిజిబిని కడపలోనే కొనసాగించాలి

- రాయలసీమ అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో పోస్టర్ విడుదల

ప్రజాశక్తి-కడప అర్బన్

రైతులకు, మధ్య తరగతి వారికి, వ్యాపార వర్గాలకు ఎంతో ఉపయుక్తంగా ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు (ఎపిజిబి) ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని రాయలసీమ అభివృద్ధి వేదిక కన్వీనర్ డాక్టర్ ఓబుల్‌రెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజ డిమాండ్ చేశారు. కడప జిల్లాలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో ఇందుకు సంబంధించి శుక్రవారం పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఓబుల్‌రెడ్డి, లక్ష్మిరాజ మాట్లాడుతూ రాష్ట్రంలోని అతి పెద్దదైన ఎపిజిబిలో మిగిలిన గ్రామీణ బ్యాంకులు విలీనం అవుతున్న నేపథ్యంలో ఇక్కడి ప్రధాన కార్యాలయాన్ని ఇక్కడే కొనసాగించాలని, అమరావతికి తరలించాలనే ప్రయత్నం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యాలయాన్ని తరలించాలని చూడడం పాలకవర్గ పార్టీలకు రాయలసీమ పట్ల ఉన్న వివక్షకు నిదర్శనమని విమర్శించారు. రాయలసీమ ప్రజలు రాజకీయాలకు అతీతంగా ఎపిజిబి ప్రధాన కార్యాలయాన్ని విలీనం తర్వాత కూడా కడపలోనే కొనసాగించాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. వ్యాపారంలో, లాభాల్లో, మౌలిక సదుపాయాలు కలిగి ఉండడంలో, సాంకేతికత, కరెన్సీ చెస్ట్ ఇలా అన్నింటా ఎపిజిబి దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. అలాంటి బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించడమంటే వెనకబడిన ప్రాంతాల పట్ల కక్ష పూరిత వైఖరి ప్రదర్శించ డమేనన్నారు. ఇప్పటికే లోకాయుక్త, ఎంఎస్ఎంఇ ట్రైనింగ్ సెంటర్‌ను, న్యాయ విశ్వవిద్యాలయాన్ని, హైకోర్టును, నార్కోటిక్స్ కోర్టులను రాయలసీమకు లేకుండా చేశారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం, సాంప్రదాయం ప్రకారం కడపలోనే ఎపిజిబి హెడ్ క్వార్టర్‌ను కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాజకీయాలకతీతంగా అన్ని పక్షాలను, ప్రజాసంఘాలను, మధ్యతరగతి ఉద్యోగులు, ఉపాధ్యాయులను, ప్రజలను, బ్యాంకు అకౌంట్ హోల్డర్స్‌ను సమీకరించి పోరాడతాయని హెచ్చరించారు.

వెల్లివిరిసిన సృజనాత్మకత

- కన్నులపండువగా ముగిసిన కర్నూలు బాలోత్సవం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్/క్రైం

విద్యార్థులను సృజనాత్మకంగా తీర్చిదిద్దేందుకు కర్నూలులోని మాంటిస్సోరి ఇండస్ పాఠశాల వేదికగా రెండురోజులపాటు జరిగిన 4వ కర్నూలు బాలోత్సవం శుక్రవారం కన్నులపండువగా ముగిసింది. బాలోత్సవంలో విద్యార్థులు తమ నైపుణ్యాలను చక్కగా ప్రదర్శించి అబ్బురపరిచారు. రెండో రోజు 27 అంశాల్లో పోటీలు నిర్వహించారు. మొత్తం మూడు వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. రెండో రోజు జానపద నృత్యం, విచిత్ర వేషధారణ, ఏకపాత్రాభినయం, కోలాటం నిర్వహించారు. మధ్యాహ్నం బాలోత్సవం అధ్యక్షులు బడే సాహెబ్ అధ్యక్షతన ముగింపు సభ జరిగింది. తొలుత ఢీ టైటిల్ విన్నర్ హేమంత్ తన నృత్య ప్రదర్శనతో అలరించారు. డిఇఒ శామ్యూల్ పాల్ మాట్లాడుతూ ఇంతమంది విద్యార్థులు బాలోత్సవంలో పాల్గొనడం జిల్లా విద్యాశాఖకే గర్వకారణమని అన్నారు. పిల్లలను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. పిల్లల్లోని సృజనాత్మకత, శాస్త్రీయ దక్పథాన్ని బయటకు తీయడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ బి.శంకర శర్మ, ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ భరత్, ఎపిఎస్‌పి బెటాలియన్ డిఎస్‌పి మహబూబ్ బాషా, బాలోత్సవం కమిటీ రాష్ట్ర నాయకులు రామరాజు, మాంటిస్సోరి విద్యాసంస్థల సిఇఒ విల్సన్, ప్రిన్సిపల్ మీనాక్షి విల్సన్, యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్, కర్నూలు బాలోత్సవం కన్వీనర్ ధనుంజయ, ప్రధాన కార్యదర్శి జెఎన్ శేషయ్య, ప్లానింగ్ కన్వీనర్ కెంగార మోహన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శనలో విద్యార్థినులు

ఎవరెవరు బెదిరించారు?

- దస్తగిరిని ప్రశ్నించిన విచారణాధికారి
- విచారణకు నలుగురు నిందితులు గైర్హాజరు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఎవరెవరు బెదిరించారు? ఏమని బెదిరింపులకు పాల్పడ్డారు? అనే కోణంలో మాజీ మంత్రి వైఎస్.వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరిని విచారణాధికారి విచారించినట్లు తెలుస్తోంది. గతేడాది కడప సెంట్రల్ జైలులో వైద్య శిబిరం పేరుతో వెళ్లిన డాక్టర్ చైతన్యరెడ్డి తనను కలిసి ప్రలోభాలకు గురిచేయడంతో పాటు బెదిరింపులకు పాల్పడ్డారని దస్తగిరి ఫిర్యాదు చేయడంతో చైతన్యరెడ్డి, అప్పటి జైలు సూపరింటెండెంట్ ప్రకాష్, డిఎస్‌పి నాగరాజు, సిఐ ఈశ్వరయ్యపై గురువారం కేసు నమోదు చేశారు. శుక్రవారం విచారణకు హాజరు కావాలని వారికి నోటీసులు జారీ చేశారు. ఈ కేసు విచారణాధికారిగా రాజమండ్రి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రాహుల్‌ను ప్రభుత్వం నియమించింది. రెండురోజుల విచారణలో భాగంగా మొదటి రోజైన శుక్రవారం దస్తగిరి ఒక్కరే విచారణకు హాజరయ్యారు. బెదిరింపులకు సంబంధించి అంశాలపై దస్తగిరిని ప్రశ్నించినట్లు సమాచారం. విచారణ అనంతరం మీడియాతో దస్తగిరి మాట్లాడుతూ.. త్వరలోనే నిజానిజాలు బయట పడతాయని, అసలైన దోషులెవరో తేలిపోతుందని చెప్పారు. దీనిపై చంద్రబాబు, పవన్, లోకేష్, ప్రధాని మోడీ, అమిత్‌షా క్షుణ్ణంగా పరిశీలించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న నలుగురు నిందితులు హాజరు కాలేదు.

జగన్ మాటలు ఈ శతాబ్దపు విడ్డూరం

- మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జగన్ విధ్వంసం గురించి చెప్పడం ఈ శతాబ్దపు విడ్డూరమని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. విజయవాడలోని జలవనరులశాఖ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ తీసుకున్న పిచ్చి నిర్ణయాలతో ఆయన కంటే తుగ్లక్ మేలనే విధంగా ప్రజలు అభిప్రాయపడ్డారన్నారు. భవిష్యత్‌లో తుగ్లక్ బదులు జగన్ పేరును వాడుకునే విధంగా పాలన చేశారని విమర్శించారు. అభివృద్ధిని ఆపేసి ఏకపక్ష నిర్ణయాలతో ప్రజలను పీల్చిపిప్పిచేశారని, ప్రశ్నిస్తే హత్యలకు పాల్పడ్డారని అన్నారు. కీలకమైన పోలవరం ప్రాజెక్టును ముంచేశారని, గత ఐదేళ్లలో అన్ని రంగాలూ పూర్తిగా దెబ్బతినిపోయాయని పేర్కొన్నారు. ప్రజల జీవన స్థితిగతులను అస్తవ్యస్తం చేసిన జగన్‌ను తెలుగు ప్రజలు క్షమించరని పేర్కొన్నారు. అటువంటి జగన్ ఇప్పుడు నీతి వాఖ్యాలు చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

ఈ జోన్‌లోనే మొత్తం వాల్తేరు డివిజన్

- సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు డిమాండ్
- సౌత్ కోస్ట్ రైల్వే జోన్ సాధన ప్రజాపోరాట విజయం


ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖపట్నం కేంద్రంగా వాల్తేర్ డివిజన్‌తో కూడిన సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటుకు కేంద్రం నిర్ణయం తీసుకోవడాన్ని సిపిఎం విశాఖ జిల్లా కమిటీ స్వాగతిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తెలిపారు. జోన్ సాధన ప్రజాపోరాట విజయమన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.పద్మ, వి.కృష్ణారావులతో కలిసి శుక్రవారం జగదాంబ వద్ద గల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సిపిఎం, వివిధ ప్రజా సంఘాలు, రైల్వే ఉద్యోగ సంఘాలు, ప్రజలు సుదీర్ఘకాలం చేసిన పోరాటం, ప్రజాప్రతినిధుల కృషి ఫలితంగా జోన్ వచ్చిందన్నారు. అయితే, కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విశాఖకు, ఉత్తరాంధ్రకు నష్టం చేసే చర్యలను, వివక్షను కొనసాగిస్తోందని విమర్శించారు. 1090 కిలోమీటర్ల పరిధి గల వాల్తేరు డివిజన్‌లో 680 కిలోమీటర్ల పరిధిని ఒడిశా రాష్ట్రం రాయగడ డివిజన్‌లో కలిపారని తెలిపారు. అత్యంత కీలకమైన కొత్తవలస - కిరండోల్ (కెకె లైన్) రైలు మార్గం రాయగడకు కేటాయించిన భాగంలో ఉండిపోయిందని అన్నారు. విశాఖలో స్టీల్‌ప్లాంట్, పోర్టు, హెచ్‌సిఎల్ మొదలగు భారీ ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేట్ సంస్థలకు ముడిసరుకు రవాణా, ఎగుమతులు దిగుమతులలో కెకె లైన్ అత్యంత కీలకమైనదని గుర్తుచేశారు. వాల్తేర్ రైల్వే డివిజన్ సాలీనా రూ.10,500 కోట్ల ఆదాయం పొందుతుందంటే దానికి కారణం సరుకు రవాణా, కెకె లైన్ అని తెలిపారు. అటువంటి కెకె లైన్‌ను విశాఖ నుంచి తొలగించి ఒడిశాలో కలపడమంటే విశాఖపట్నం, ఉత్తరాంధ్ర, ఆంధ్ర రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీయడమేనన్నారు. దీనివల్ల ఆర్థిక నష్టంతో పాటు రాబోయే కాలంలో స్టీల్‌ప్లాంట్, విశాఖ పోర్టు తదితర ప్రభుత్వ రంగ సంస్థలకు రైల్వే ర్యాకులు కేటాయింపులో కష్టాలు ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు. కేంద్ర నిర్ణయం వల్ల ఆంధ్ర ఊటీగా ప్రఖ్యాతిగాంచిన అరకు రాయగడ డివిజన్‌కు వెళ్తుందని చెప్పారు. అరకు అభివృద్ధి ఒడిశా ప్రభుత్వం మీద ఆధారపడి ఉంటుందన్నారు. ఈ చర్య రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధికి, ఉపాధికి తీవ్ర విఘాతం కలిగిస్తుందని చెప్పారు. కెకె లైన్‌తో సహా మొత్తం వాల్తేరు డివిజన్‌ను విశాఖపట్నం కేంద్రంగాగల సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌లో కొనసాగించాలని డిమాండ్ చేశారు. విశాఖ రైల్వే జోన్ సాధన తమ విజయంగా టిడిపి కూటమి నేతలు ప్రకటిస్తున్నారని, కానీ కేంద్రం ఉత్తరాంధ్రకు చేస్తున్న నష్టం, వివక్షతపైనా, కెకె లైన్‌ను రాయగడలో కలపడంపైనా మాట్లాడకపోవడం సరికాదన్నారు. టిడిపి కూటమి నేతలు ఈ అంశంపై వెంటనే స్పందించాలని కోరారు. కేంద్రంపై ఒత్తిడి తేవాలని, నష్ట నివారణ చర్యలను చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కెకె లైన్‌తో సహా వాల్తేరు డివిజన్ మొత్తాన్ని సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌లో కొనసాగించే నిర్ణయం చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం విశాఖ రైల్వే స్టేషన్ వద్ద నిరసన చేపట్టాలని సిపిఎం నిర్ణయించిందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

సైబర్ మోసాలపై ఆర్‌బిఐ దృష్టి

- ప్రత్యేకంగా బ్యాంక్.ఇన్ డొమైన్

ముంబయి : దేశంలో రోజు రోజుకు అడ్డగోలుగా పెరుగుతోన్న సైబర్ మోసాలను నియంత్రించడంపై ఆర్‌బిఐ దృష్టి పెట్టింది. బ్యాంకుల కోసం ప్రత్యేకంగా బ్యాంక్.ఇన్ డొమైన్‌ను తీసుకురానున్నట్లు శుక్రవారం ప్రకటించింది. అదే విధంగా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థల కోసం ఫిన్.ఇన్ డొమైన్‌ను కేటాయించనున్నట్లు తెలిపింది. దీని ద్వారా అసలైన బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలను గుర్తించడం చాలా సులభం అవుతుందని వెల్లడించింది. 2025 ఏప్రిల్ నుంచి బ్యాంక్.ఇన్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం అవుతాయని ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. సైబర్ మోసగాళ్లు నకిలీ బ్యాంక్ లింకులు పంపించి క్షణాల్లో ఖాతాలు ఖాళీ చేస్తున్నారు. ఏది అసలైన బ్యాంక్ లింకో, ఏది నకిలీదో తెలుసుకోవడం కష్టతరంగా మారింది. వీటన్నింటిని అరికట్టేందుకు ప్రత్యేకంగా బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల కోసమే ప్రత్యేక డొమైన్లను తీసుకొస్తున్నట్లు మల్హోత్ర తెలిపారు. ఈ డొమైన్లతో అసలు బ్యాంకు లింక్స్ ఏవో సులభంగా గుర్తించవచ్చన్నారు. డిజిటల్ చెల్లింపుల్లో మోసాలు పెరుగుతున్న క్రమంలో బ్యాంకులు, ఆర్థిక సంస్థలపై నమ్మకాన్ని పెంచే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మల్హోత్ర తెలిపారు. దీనికి ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ ఇన్ బ్యాంకింగ్ టెక్నాలజీ దీనికి రిజిస్ట్రార్‌గా వ్యవహరించనుందన్నారు. అదే విధంగా దేశంలో జారీ అయిన కార్డుల ద్వారా ఇతర దేశాల్లో జరిగే లావాదేవీలకు అడిషనల్ ఫ్యాక్టర్ ఆఫ్ అథంటికేషన్‌ను జోడించనున్నట్లు మల్హోత్ర తెలిపారు. ఇతర దేశాల్లో వ్యాపారస్తుడు ఉన్నప్పుడు సురక్షిత లావాదేవీలు నిర్వహించాలన్న ఉద్దేశంతో దీన్ని అందుబాటులోకి తెస్తోన్నామన్నారు. త్వరలోనే పూర్తి వివరాలతో కూడిన ముసాయిదాను విడుదల చేస్తామని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు మాసాల్లోనే దేశంలో సైబర్ నేరాలు 27 శాతం పెరిగి 18,461 కేసులుగా నమోదయ్యాయి. ఈ ఆర్థిక మోసాల విలువ రూ.21,367 కోట్లుగా ఉంది. ఏడాది క్రితం ఇదే సమయంలోని రూ.2,623 కోట్ల విలువ చేసే మోసాలతో పోల్చితే.. సైబర్ ఆర్థిక వంచనలు ఎనిమిది రెట్లు పెరిగాయి.



ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ లాభాల్లో 17 శాతం వృద్ధి

కోల్‌కత్తా : ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ 2024 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో 17 శాతం వృద్ధితో రూ.239 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.203 కోట్ల లాభాలు ఆర్జించింది. 2024-25 డిసెంబర్ త్రైమాసికంలో సంస్థ మొత్తం ఆదాయం 19 శాతం పెరిగి రూ.785 కోట్లకు చేరింది. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో ఆదాయపు పన్ను పరిమితి పెంచడం, తాజా ఆర్‌బిఐ ఎంపిసి సమీక్షాలో కీలక వడ్డీ రేట్లను పావు శాతం తగ్గించడంతో గృహ రుణాలకు డిమాండ్ పెరగొచ్చని ఆ సంస్థ ఎండి రిషి ఆనంద్ పేర్కొన్నారు.

జాగల్ రెవెన్యూలో 69 శాతం వృద్ధి

హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ఫిన్‌టెక్ కంపెనీ జాగల్ నికర లాభాలు 30 శాతం పెరిగి రూ.19.74 కోట్లకు చేరాయి. 2023-24 ఇదే క్యూ3లో రూ.15.22 కోట్ల లాభాలు ప్రకటించింది. ఇదే సమయంలో రూ.199.51 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన క్యూ3లో 69 శాతం పెరిగి రూ.336.89 కోట్లుగా నమోదయ్యింది. ఇదే సమయంలో మొత్తం వ్యయం 72 శాతం పెరిగి రూ.314.15 కోట్లుగా చోటు చేసుకుంది.


ఇన్ఫోసిస్‌లో ట్రైనీలపై వేటు

బెంగళూరు : దేశంలోనే రెండో అతిపెద్ద ఐటి కంపెనీ ఇన్ఫోసిస్ వందలాది ట్రైనీ ఉద్యోగులపై వేటు వేసిందని సమాచారం. మైసూరు క్యాంపస్‌లో శిక్షణ పొందుతున్న దాదాపు 400 మందిని ఇంటికి పంపిస్తోందని తెలుస్తోంది. వరుసగా మూడు సార్లు అంచనా పరీక్షల్లో విఫలమైన కారణంగా వారిని తొలగిస్తున్నట్లు ఆ సంస్థ వర్గాలు పేర్కొనట్లు మీడియాలో రిపోర్టులు వస్తోన్నాయి. ఉన్నఫలంగా సాయంత్రం ఆరు గంటల్లోపే ట్రైనీలంతా క్యాంపస్‌ను వదిలి వెళ్లాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. కాగా.. ఎన్నో ఆశలతో అడుగుపెట్టిన తమను ఇన్ఫోసిస్ అత్యంత బాధాకరంగా తొలగిస్తోందని వారు ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. తాము కావాలనే ఫెయిల్ అయ్యేలా పరీక్షలను చాలా కఠినంగా పెట్టారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఖాతాదారుల భద్రత మరింత బలోపేతం

- ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్ వెల్లడి

న్యూఢిల్లీ : ఖాతాదారుల భద్రతను బలోపేతం చేసేందుకు 14సి రియల్ టైమ్ అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేస్ (ఎపిఐ)తో లైవ్ అవుతున్న మొదటి చెల్లింపుల బ్యాంకుగా తమ సంస్థ నిలిచిందని ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ తెలిపింది. కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేస్ (ఎపిఐ) ద్వారా ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (14సి) నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్, సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌తో తమ వ్యవస్థలను విజయవంతంగా అనుసంధానించినట్లు పేర్కొంది. ఈ సేవలు అందిస్తోన్న నాలుగు బ్యాంక్‌ల్లో తమదొక్కటని తెలిపింది.





ఎల్ఐసి లాభాల్లో 17 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద జీవిత బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 17 శాతం వృద్ధితో రూ.11,056 కోట్ల నికర లాభాలు సాధించింది. ఈ ప్రభుత్వ రంగ సంస్థ 2023-24 ఇదే త్రైమాసికంలో రూ. 9,444 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.1,17,017 కోట్ల నికర ప్రీమియం వసూళ్లు చేయగా.. గడిచిన క్యూ3లో 8.6 శాతం తగ్గి రూ.1,06,891 కోట్లుగా చోటు చేసుకుంది. అయినప్పటికీ లాభాల్లో మెరుగైన వృద్ధిని కనబర్చడం విశేషం. గడిచిన డిసెంబర్ త్రైమాసికంలో సంస్థ మొత్తం ఆదాయం రూ.2,01,994 కోట్లుగా నమోదయ్యింది. ఇంతక్రితం ఏడాది త్రైమాసికంలో రూ.2,12,447 కోట్ల ఆదాయం ఆర్జించింది. ఎల్ఐసి మొత్తం ఆస్తుల విలువ 10.29 శాతం పెరిగి రూ.54,77,651 కోట్లకు చేరింది. 2024-25 డిసెంబర్‌తో ముగిసిన తొమ్మిది మాసాల కాలంలో ఎల్ఐసి లాభాలు 8.27 శాతం పెరిగి రూ.29,138 కోట్లుగా నమోదయ్యింది.

సచివాలయ వ్యవస్థ నిర్వీర్యం

- ప్రభుత్వ మాజీ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సచివాలయ వ్యవస్థను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ప్రభుత్వ మాజీ సలహాదారు నలమారు చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సచివాలయ ఉద్యోగులపై ఏకపక్ష నిర్ణయం తగదని, రేషనలైజేషన్‌పై పునరాలోచన చేయాలని కోరారు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో చర్చించాకే నిర్ణయించాలని, ఉద్యోగ సంఘాల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సిబ్బంది తగ్గింపు వల్ల ఉద్యోగులపై మరింత పనిభారం పెరుగుతుందని, జాబ్‌చార్ట్ మార్చడం వల్ల వారిలో ఆందోళన మొదలైందని వివరించారు. ఉద్యోగులకు ప్రభుత్వ బకాయిలు రూ.30 వేలకోట్లు ఉన్నాయని, వాటిని ఇంత ఆపిన ప్రభుత్వం మరొకటి లేదని పేర్కొన్నారు. తొమ్మిది నెలలైనా ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 15,004 సచివాలయాల్లో 1.35 లక్షల మందిని వైసిపి ప్రభుత్వంలో ఉద్యోగాల్లో నియమించారని, ఈ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుతం సచివాలయాల్లో 1,27,175 మంది పనిచేస్తుంటే అంత మంది అవసరం లేదని 15,496 మందిని ఇతర శాఖల్లో సర్దుబాటు చేసే విధంగా జనవరి 25న జిఓ నెంబరు ఒకటి జారీ చేశారని పేర్కొన్నారు. దీనివల్ల మిగిలిన సిబ్బందిపై పనిభారం పెరుగుతుందన్నారు.

పోలీసుల విచారణకు రామ్‌గోపాల్‌వర్మ

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్ ఫొటోల మార్ఫింగ్ కేసులో దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ ఎట్టకేలకు శుక్రవారం పోలీసుల విచారణకు హాజరయ్యారు. ప్రకాశం జిల్లా ఒంగోలు రూరల్ పోలీసు స్టేషన్‌లో సిఐ శ్రీకాంత్ విచారణ చేపట్టారు. గత ఎన్నికల సందర్భంగా చంద్రబాబు, లోకేష్, పవన్ వ్యక్తిత్వాలను కించపరిచేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఓ టిడిపి కార్యకర్త మద్దిపాడు పోలీసుస్టేషన్‌లో వర్మపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా గతంలో హైదరాబాద్‌కు వెళ్లి నోటీసులు ఇచ్చినా రామ్‌గోపాల్‌వర్మ గైర్హాజరయ్యారు. దీంతో ఆయన్ను అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించగా కొన్నాళ్లపాటు అజ్ఞాతంలోకి వెళ్లారు. హైదరాబాద్‌లోని ఆయన ఇంటి వద్ద పోలీసులు నిఘా పెట్టారు. అయితే, వర్మ కోర్టును ఆశ్రయించిన బెయిల్ పొందారు. కోర్టు ఆయనకు బెయిల్ ఇవ్వడంతోపాటు విచారణకు సహకరించాలని సూచించింది. ఈ నేపథ్యంలో మరోసారి పోలీసులు నోటీసులు ఇవ్వడంతో న్యాయవాదితో కలిసి రామ్‌గోపాల్‌వర్మ విచారణకు హాజరయ్యారు. విచారణకు ముందు వెల్లంపల్లిలో ఓ హోటల్ వర్మను వైసిపి నేతలు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కలిసి మంతనాలు జరిపారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చినట్లు సమాచారం.



విచారణకు హాజరవుతున్న రామ్‌గోపాల్ వర్మ

గుంటూరు జిజిహెచ్ సూపరింటెండెంట్ విచారణ

డిప్యూటీ స్పీకర్, అప్పటి ఎంపి రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో ఉన్న గుంటూరు జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ పద్మావతి కూడా శుక్రవారం జిల్లా ఎస్‌పి దామోదర్ ఎదుట విచారణకు హాజరయ్యారు. రఘురామకృష్ణరాజుపై ఎటువంటి టార్చర్ జరగలేదని సూపరింటెండెంట్ సర్టిఫికెట్ ఇవ్వడం అప్పట్లో దుమారం రేగింది. కేంద్రం జోక్యంతో రఘురామకృష్ణరాజును ఆర్మీ ఆస్పత్రికి పంపగా అక్కడ పరీక్షల్లో టార్చర్ జరిగినట్లు తేలింది. కాళ్లలో వాపులు గుర్తించారు. ఇప్పటికే ఈ కేసులో సిఐడి మాజీ అధికారి విజయపాల్, తులసీబాబును విచారించి అరెస్టు చేశారు. ఇప్పుడు పద్మావతిని విచారిస్తున్నారు. అయితే, ఆమెకు హైకోర్టులో ఊరట లభించింది. అరెస్టుకు అవకాశం లేనందున విచారణకు హాజరయ్యారు.

సంపాదకీయం

రాజ్యాంగ ఉల్లంఘనులు


రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాల్సిన గవర్నర్లు... రాజ్యాంగేతర శక్తుల్లా మారి సొంత పద్ధతులు అనుసరిస్తూ... ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలకు అడుగడుగునా అడ్డుపడుతూ... వీటో చేస్తుండటం దారుణం. బిజెపియేతర పార్టీలు అధికారంలో ఉన్నచోట ఆయా చట్టసభలు చేసిన బిల్లులను గవర్నర్ల ద్వారా తొక్కిపెట్టడం అక్కడి పరిపాలనా వ్యవహారాలను స్తంభింపజేయడం రాజ్‌భవన్‌ల ద్వారా ఆధిపత్యం చెలాయించాలన్న కుట్రే!

రాజ్యాంగ పద్ధతులను అనుసరించాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను ఆమోదించాలని సుప్రీంకోర్టు ఆదేశించినా... కేరళ గత గవర్నర్ ఆరిఫ్‌ఖాన్, తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి పెడచెవినపెట్టారు. 2020 జనవరి 2023 ఏప్రిల్ మధ్య కాలంలో 12 బిల్లులను గవర్నర్ ఆమోదం కోసం తమిళనాడు రాష్ట్ర అసెంబ్లీ పంపించింది. యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్లు సహా పలు బిల్లులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచడం, ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో 2023 నవంబర్‌లో సుప్రీంకోర్టును రాష్ట్ర ప్రభుత్వం ఆశ్రయించింది. ఈ పరిణామాలతో రెండు బిల్లులను రాష్ట్రపతికి పంపించి, పది బిల్లులకు ఆమోదం తెలపకుండా తొక్కిపెట్టారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశమై ఆ పది బిల్లులను మరోసారి ఆమోదించి, గవర్నర్‌కు పంపగా, పరిశీలన కోసం రాష్ట్రపతికి పంపించారు. రాష్ట్రపతి ఒక బిల్లును ఆమోదించి, ఏడు బిల్లులు తిరస్కరించారు. మిగిలిన రెండు బిల్లులను పరిశీలించనే లేదు.

రాజ్యాంగంలోని 200వ అధికరణ (బిల్లులకు గవర్నర్ అనుమతి)లోని మొదటి నిబంధన ప్రకారం బిల్లులు తన ఆమోదానికి వచ్చినప్పుడు గవర్నర్ అనుసరించాల్సిన మూడు పద్ధతులున్నాయి. ఒకటి ఆ బిల్లులను ఆమోదించడం, రెండోది వెనక్కి పంపించడం, మూడోది పరిశీలించాల్సిందిగా కోరుతూ రాష్ట్రపతికి నివేదించడం. ఒక బిల్లు ఉభయ సభల్లో రెండోసారి ఆమోదం పొందితే.. గవర్నర్ చెప్పిన మార్పులు చేసినా, చేయకపోయినా... దాన్ని ఆమోదించాల్సిందేనని, తిరస్కరించే హక్కు లేదని 200 ఆర్టికల్ నిర్దేశిస్తోంది. ఆ 10 బిల్లులకు ఆమోదం తెలపకుండా నిలుపుచేస్తున్నామని మాత్రమే గవర్నర్ చెప్పారని, వాటిని తిరిగి వెనక్కి ప్రభుత్వానికి పంపలేదని, రాష్ట్రప్రభుత్వం ఆయన ఉద్దేశాలను తప్పుగా భావించి, మరోసారి ఆమోదించి పంపిందని గవర్నర్ తరపున అటార్నీ జనరల్ సుప్రీంకోర్టులో తాజాగా వాదనలు వినిపించడం బుకాయింపు. అసెంబ్లీ ఆమోదించి పంపిన బిల్లులకు తన సమ్మతి తెలపకుండా మూడేళ్లపాటు ఎందుకు అట్టిపెట్టుకున్నారు? సరిగా లేవని కనుగొనడానికి మూడేళ్లు ఎందుకు పట్టింది? గవర్నర్ విచక్షణ నిర్దిష్ట విషయాలకు మించి ఉంటుందా? అని ప్రశ్నిస్తూనే... నిరవధికంగా అట్టిపెట్టుకోవడం తీవ్ర ఆందోళనకరమన్న సుప్రీం వ్యాఖ్యలు చీవాట్లు పెట్టడం లాంటిదే!


రాష్ట్ర రాజకీయాల్లో చీటికీ మాటికీ తలదూర్చడం, రాష్ట్ర ప్రభుత్వం సాఫీగా పనిచేయకుండా అడ్డుపడటం తమిళనాడుతోపాటు కేరళ, పంజాబ్, కర్ణాటక, తెలంగాణ, ఢిల్లీ తదితర రాష్ట్రాల్లో నిత్యకృత్యమైంది. రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసిన అంశాలను వదిలేసి తమిళనాడు, కేరళ గవర్నర్లు ప్రసంగించడం, వాకౌట్లు చేయడం, ఎన్నికైన ప్రభుత్వాలను తీవ్రంగా విమర్శించడం అందరికీ తెలిసిందే. తమిళనాడులో రాష్ట్ర ప్రభుత్వ సిఫారసు లేకుండా మంత్రిని డిస్మిస్ చేయడం, రాష్ట్రపతి పాలన విధిస్తామని పంజాబ్ గవర్నర్ బెదిరించడం రాజ్యాంగ విరుద్ధ చర్యలకు పరాకాష్ట. గవర్నర్ల తీరుపై రాజ్‌భవన్‌ల ఎదుట, ఢిల్లీలోనూ కేరళ, కర్ణాటక సిఎంలు చేపట్టిన ఆందోళనలు, విజయన్ దీక్షలో ప్రతిపక్ష పార్టీలు భాగస్వామ్యమైన పరిస్థితి మోడీ ఏలుబడిలో ప్రజాస్వామ్య దుస్థితికి అద్దం పట్టేవే! గవర్నర్లు ప్రజల చేత ఎన్నికైన వారు కాదనే విషయం గుర్తెరిగితే మంచిదని, ఏళ్ల తరబడి నాన్చొద్దని సుప్రీంకోర్టు మందలించినా... బిల్లులను నిరవధికంగా తొక్కిపెట్టే అధికారం ఎవరిచ్చారని నిలదీసినా గవర్నర్ల వైఖరిలో మార్పు రాకపోవడానికి మోడీ సర్కారు అప్రజాస్వామిక పోకడే కారణం. ప్రజాస్వామ్య వ్యవస్థలో అసలైన అధికారాలు ప్రజలెన్నుకున్న ప్రభుత్వాల చేతుల్లో ఉండాలన్న కనీస స్పృహ కొరవడి రాష్ట్ర ప్రభుత్వాలను కీలుబొమ్మలు చేయాలనుకున్న తీరుకు ఇప్పటికైనా స్వస్తిపలకాలి.

మంచి మాట



విజ్ఞానాన్ని పొందాలనుకుంటే దానికై పరిశ్రమించక తప్పదు. శ్రమపడటం అనేది జీవన సూత్రం.

- జాన్ రస్కిన్,
బ్రిటిష్ రచయిత.



వ్యాఖ్య

అణు వాణిజ్యం-విదేశీ విక్రేతలకే పరిహార బాధ్యత

అణు ఇంధనం, అణు విపత్తులకు పౌర బాధ్యతల చట్టం 2010 (సి.ఎల్.ఎన్.డి.ఎ-క్లండా)ను సవరించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. అణు ఇంధన ఉత్పత్తి రంగంలో ప్రైవేటు రంగ ప్రవేశానికి మార్గం సుగమం చేయడమే అణుశక్తి చట్టానికి సవరణ ఉద్దేశం. నిజానికి అసలే అనుచితమైన ఆలోచన అది. ఏమైనా క్లండా చట్టానికి తలపెట్టిన సవరణ మరింత ప్రమాదకరమైనది. ప్రభుత్వ రంగంలోనైనా ప్రైవేటు రంగంలోనైనా అణు ప్రమాదమే సంభవిస్తే బలైన ప్రజలకు చెల్లించాల్సిన నష్టపరిహారం మొత్తాన్ని కోత కోసేందుకు ఉద్దేశించింది ఈ సవరణ.

క్లండాను పార్లమెంటు 2010లో ఆమోదించింది. ఇండియా లోకి విదేశీ అణు రియాక్టర్లను దిగుమతి చేసుకోవాలన్నట్టయితే ఆ వాణిజ్యం సరఫరాలు జరగడానికి పౌర అణు పరిహార చట్టం తప్పనిసరి. పౌర అణు ఒప్పందంలో భాగంగా 10 వేల మెగావాట్ల అణు రియాక్టర్లను కొనుగోలు చేయడానికి యుపిఎ ప్రభుత్వం వాగ్దానం చేసింది. అయితే ఆ బిల్లును పార్లమెంటులో చర్చకు స్వీకరించినప్పుడు ఈ చట్టంలో తగిన న్యాయమైన నష్టపరిహారానికి తగిన ఏర్పాటు వుండాలనే గట్టి డిమాండు వచ్చింది. ఏదైనా అణు ప్రమాదమే జరిగితే దానికి బలైన బాధితులు త్వరితంగా తగినంతగా పరిహారం పొందడానికి అప్పుడే వీలుండాలంటే అది తప్పనిసరని కూడా డిమాండు ముందుకొచ్చింది. ఇందుకోసం 17(బి) అనే ఒక కొత్త నిబంధన అదనంగా చేర్చబడింది. ఆ రియాక్టర్ ఆపరేటర్లే గాక దాన్ని సరఫరాదార్లు కూడా పరిహారం చెల్లింపునకు బాధ్యత వహించాలని ఆ నిబంధనలో పొందుపర్చబడింది. 17(బి)ని మార్చడం ద్వారా ఈ చట్టాన్ని నీరుగార్చాలని ప్రభుత్వం ప్రయత్నించింది గానీ ప్రధానంగా వామపక్ష ఎంపీల గట్టి ప్రతిఘటన వల్ల ఆ పని చేయడంలో విఫలమైంది.



> అణు రియాక్టర్ల నిర్మాణం, నిర్వహణ చేసేందుకు ప్రైవేటు రంగాన్ని అనుమతించడమంటే అణు ప్రమాదాలకు అవకాశం మరింత పెంచుకోవడమే. ఇప్పటి వరకూ అణు రియాక్టర్లు ప్రభుత్వ రంగంలోనే భారత అణు శక్తి కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. వాటికి భద్రతా ప్రమాణాలు బాగా పాటించిన చరిత్ర వుంది. ఒకసారి గనక అణు ఇంధన ప్లాంట్లు ప్రైవేటు రంగం చేతుల్లోకి వచ్చేస్తే క్లండా చట్టం సవరణ వల్ల ఖరీదైన విదేశీ అణు రియాక్టర్ల సరఫరాకు అవకాశం కలిగిస్తుంది. అప్పుడు ప్రమాదం జరిగితే ఆ బాధ్యత మొత్తం వాటి యజమానులే చూసుకోవలసి వుంటుంది. అంతిమంగా దాని భారం, బాధ్యత భారత ప్రభుత్వంపైనే పడుతుంది. విదేశీ సరఫరాదార్లు ఎలాంటి బాధ్యత లేకుండా తప్పించుకోగలుగుతారు.

భోపాల్ విషాదం పాఠం

ఆ సమయంలో ప్రభుత్వంపై ప్రజల ఒత్తిడి పెరగడానికి దారితీసిన ముఖ్యమైన అంశం ఒకటి వుంది. భోపాల్ విష వాయు లీక్ దురంతానికి బలైన వేలాది మంది బాధితులకు యూనియన్ కార్బయిడ్ కంపెనీ నుంచి మరింత పరిహారం ఇప్పించాలంటూ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించడమే ఆ విధంగా ఒత్తిడి పెరగడానికి కారణమైంది. చట్టం ప్రకారం అలాంటి డిమాండుకు ఆస్కారమే లేదని కోర్టు అభిప్రాయపడింది. క్లండా చట్టం ఆమోదించిన తర్వాత కొద్ది నెలల్లోనే జపాన్‌లో ఫుకుషిమా అణు ప్రమాదం సంభవించింది. దాంతో కఠినమైన అణు పరిహార చట్టం అవసరం మరింతగా ముందుకొచ్చింది. 17(బి) వంటి నిర్దిష్టమైన నిబంధనలే లేకపోతే ఏదైనా ప్రమాదం లేదా నష్టం జరిగినప్పుడు విదేశాల్లోని అణు పరికరాల సరఫరాదార్లు భారం వహించేలా చేయడం సాధ్యం కాదని భావించబడింది.

నిరాకరణ, ఒత్తిడి

క్లండా చట్టం ఆమోదించిన తర్వాత విదేశాలలోని ముఖ్యంగా అమెరికాలోని అణు రియాక్టర్ల ఉత్పత్తిదార్లు వాటిని అమ్మడానికి గానీ ఈ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి గానీ తిరస్కరించారు. సరఫరాదారులే పరిహార బాధ్యత స్వీకరించాలన్న నిబంధన అంతర్జాతీయ సూత్రాలకూ కాంట్రాక్టరు బాధ్యతలకు వ్యతిరేకమని వారు వాదించారు. విదేశీ కంపెనీలు తీసుకున్న ఈ వైఖరే భారత దేశంలో విదేశీ అణు రియాక్టర్ల స్థాపన నిర్వహణకు ప్రధాన ఆటంకమైంది.

ఈ విధంగా సరఫరాదారు బాధ్యత వహించాలనే అంశాన్ని తోసిరాజనడానికి తర్వాతి సంవత్సరాలలో రకరకాల ప్రయత్నాలు జరిగాయి. 2015లో అమెరికా అధ్యక్షుడు ఒబామా భారత దేశం వచ్చినపుడు మోడీ ప్రభుత్వం క్లండా చట్టాన్ని సవరించాల్సిన అవసరం లేదనే వైఖరికే కట్టుబడింది. కావాలంటే మొత్తంగా ప్రమాద నిర్వహణ బాధ్యతలు చూడటానికి భారత అణు బీమా సమ్మిళిత నిధి ఏర్పాటు చేయవచ్చని సూచించింది. అయితే దీనికి కూడా విదేశీ అణు రియాక్టర్ల సరఫరాదారుల నుంచి సానుకూల స్పందన రాలేదు.

ఈ లొంగుబాటు పర్యవసానం?

క్లండా చట్టాన్ని సవరించవలసిందిగా అమెరికా ప్రభుత్వం నిరంతరాయంగా చేస్తున్న ఒత్తిడికి చివరకు మోడీ సర్కారు లొంగిపోయింది. అణు రియాక్టర్ల నిర్మాణం, నిర్వహణ చేసేందుకు ప్రైవేటు రంగాన్ని అనుమతించడమంటే అణు ప్రమాదాలకు అవకాశం మరింత పెంచుకోవడమే. ఇప్పటి వరకూ అణు రియాక్టర్లు ప్రభుత్వ రంగంలోనే భారత అణు శక్తి కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. వాటికి భద్రతా ప్రమాణాలు బాగా పాటించిన చరిత్ర వుంది. ఒకసారి గనక అణు ఇంధన ప్లాంట్లు ప్రైవేటు రంగం చేతుల్లోకి వచ్చేస్తే క్లండా చట్టం సవరణ వల్ల ఖరీదైన విదేశీ అణు రియాక్టర్ల సరఫరాకు అవకాశం కలిగిస్తుంది. అప్పుడు ప్రమాదం జరిగితే ఆ బాధ్యత మొత్తం వాటి యజమానులే చూసుకోవలసి వుంటుంది. అంతిమంగా దాని భారం, బాధ్యత భారత ప్రభుత్వంపైనే పడుతుంది. విదేశీ సరఫరాదార్లు ఎలాంటి బాధ్యత లేకుండా తప్పించుకోగలుగుతారు.

క్లండా బిల్లును పార్లమెంటు చర్చించినప్పుడు ప్రమాదం బాధ్యత సరఫరాదారులపై వుండాలన్న నిబంధనను బిజెపి బలపర్చింది. కానీ ఇప్పుడు ఆ పార్టీ ప్రభుత్వం ఆ వాగ్దానం నుంచి తప్పుకుంటున్నది. ఆ విధంగా చేయడం వల్ల భారతీయుల ప్రాణాలు పోయినా పట్టించుకోవలసిన అవసరం లేదనే సంకేతం పంపిస్తున్నది.

(ఫిబ్రవరి 5 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

అభిప్రాయం

ఆటల్లో 'ఆమె' విజయం

ఇటీవల జెస్సీ రాజ్, కోనేరు హంపి, ప్రియాంక ఇంగ్లే తదితర క్రీడాకారిణుల పేర్లు తరచుగా వినబడుతున్నాయి. వీరిలో కోనేరు హంపి గురించి అందరికీ తెలుసు. జెస్సీ రాజ్ చిన్నమ్మాయి. ఆమె స్కేటింగ్‌లో రాణిస్తున్నది. ప్రియాంక ప్రముఖ ఖోఖో క్రీడాకారిణి. అదే కోవలోకి తెలంగాణకు చెందిన త్రిష వస్తుంది.

ఫిబ్రవరి 2న దక్షిణాఫ్రికాతో జరిగిన ఐసిసి మహిళల అండర్ 19 టి20 వరల్డ్ కప్ ఫైనల్స్‌లో భారత్‌ని విజేతగా నిలపడంలో భద్రాచలంకు చెందిన గొంగడి త్రిష కీలక పాత్ర పోషించింది. టోర్నమెంట్ మొదటి నుండి చివరివరకు అద్భుతంగా ఆడి త్రిష "ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్" అవార్డ్ గెలుచుకుంది.

ఒక దిగువ మధ్య తరగతి కుటుంబం నుండి వచ్చిన 19 ఏళ్ల త్రిష జనవరి 28న జరిగిన అండర్ 19 వరల్డ్ కప్‌లో అద్భుతమైన సెంచరీ చేసి భారత్‌ని సెమీ ఫైనల్స్‌కి తీసుకెళ్లింది. త్రిష చేసిన సెంచరీ మహిళల అండర్ 19 టి 20 ప్రపంచ కప్ చరిత్రలోనే మొట్టమొదటిది. లెగ్ స్పిన్ ఆల్ రౌండర్ అయిన త్రిష ఈ మ్యాచ్‌లో మూడు వికెట్లు కూడా తీసింది. తన సెంచరీని కేవలం 53 బంతుల్లోనే చేసింది. మొత్తం 59 బంతుల్లో 110 పరుగులు చేసింది. జనవరి 31న జరిగిన సెమీ ఫైనల్స్‌లో భారత్ ఇంగ్లాండ్‌పై ఘన విజయం సాధించి ఫైనల్స్‌కి చేరింది. ఈ మ్యాచ్‌లో కూడా త్రిష తన బ్యాట్‌తో మంచి ప్రదర్శన చేసింది. ఫైనల్స్‌లో బ్యాట్‌తో 44 రన్స్, బాల్‌తో మూడు వికెట్లు తీసి తన ఆల్ రౌండ్ ప్రదర్శనతో సరికొత్త చరిత్ర సృష్టించింది. అంతకు మునుపు ఆసియా కప్ మ్యాచెస్ లోనూ, 2023 సీనియర్స్ ప్రపంచ కప్ టోర్నమెంట్ లోనూ ఎంతో మంచి ప్రదర్శన ఇచ్చింది.

త్రిష తండ్రి ఒక జిమ్ ట్రెయినర్. త్రిష కెరీర్ కోసం వారి కుటుంబం మొత్తం భద్రాచలం నుండి హైదరాబాద్‌కి మారింది. త్రిష అనేక ఇంటర్వ్యూలలో తన తల్లిదండ్రుల గురించి, ముఖ్యంగా తన తండ్రి గురించి చెప్పింది. వరల్డ్ కప్‌లో త్రిష సెంచరీ చేసినప్పుడు ఆమె తండ్రి కూడా ప్రేక్షకుల మధ్యలో కూర్చుని తన కుమార్తె ఘనతని స్వయంగా చూశారు. ఈ స్థాయి విజయాన్ని ఎవరైనా పురుషుల క్రికెట్‌లో అందుకుంటే, వారికి లభించే గౌరవం వేరే విధంగా ఉంటుంది.

ఇవాళ ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. అయితే వారిపై ఇంకా ఏదో ఒక రూపంలో ఆంక్షలు కొనసాగుతూనే ఉన్నాయి. వారికి చిన్న తనంలోనే వివాహాలు చేయడంతో ఉన్నత విద్యకు దూరం అవుతున్నారు. వారి లక్ష్యాలను పక్కన పెడుతున్నారు. ప్రభుత్వాల నుంచి కూడా వారికి పెద్దగా ప్రోత్సాహం లభించడం లేదు. వారిలో ఉన్న ప్రతిభకు తోడు పాలక వర్గాలు మరికొంత ప్రోత్సాహాన్ని అందిస్తే, మరింత మంది వివిధ రంగాల్లో అడుగు పెట్టి రాణించే అవకాశం ఉంటుంది.

- యం. రాం ప్రదీప్,
సెల్: 9492712836

విశ్లేషణ

ప్రజల కొనుగోలు శక్తి పెరగని బడ్జెట్ ఎవరికోసం?

కేంద్ర బడ్జెట్ ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తుందా? ఉద్యోగులకు ఇచ్చిన పన్ను రాయితీ సర్వరోగ నివారిణి అవుతుందా? దేశం ఎదుర్కొంటున్న సమస్యలేమిటి? ఆర్థిక సర్వే రిపోర్టు ఏం చెప్తున్నది? ఇదే ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది. గత ఆర్థిక సంవత్సరం భారతదేశ స్థూల జాతీయోత్పత్తి అంచనాల కన్నా తగ్గింది. ఇందుకు కారణాలను ఆర్థిక సర్వే లోతుగా విశ్లేషణ చేసింది. దేశంలో సరుకుల అమ్మకాలు తగ్గిపోయాయని, తగిన వేతనాలతో కూడిన ఉపాధి అవకాశాలు పడిపోయాయని, ద్రవ్యోల్బణం సమస్యగా మారిందని తేల్చింది. నెలసరి వేతన జీవులకు, స్వయం ఉపాధి కార్మికులకు గత ఐదేళ్లలో నిజ వేతనాలు దిగజారిపోయాయి. 22 కోట్ల ప్రజల దినసరి ఆదాయం కేవలం రూ.300. మోడీ ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం క్షేత్ర స్థాయి దినసరి కనీస వేతనం రూ.78 ఇస్తే చాలు. అంటే నెలకు రూ.4628 తో కుటుంబం బతకాలి! ఉపాధి హామీ చట్టం ప్రకారం కల్పించవలసిన వంద రోజుల పని దినాలు కూడా 2019 తర్వాత సగటున 45కు తగ్గాయి. వీటన్నింటి ఫలితంగానే దేశ ప్రజలు సరుకుల కొనుగోలుపై పెట్టే ఖర్చుగానీ, పొదుపుగానీ తగ్గిపోయాయి. ఈ పరిస్థితి మారాలంటే, కేంద్ర ప్రభుత్వం చెప్తున్న వికసిత భారత్‌ను సాధించాలంటే రానున్న పది నుంచి ఇరవై సంవత్సరాల పాటు స్థూల జాతీయోత్పత్తి ఎనిమిది శాతానికి తగ్గవద్దని ఆర్థిక సర్వే రిపోర్టు చెప్పింది. కానీ రానున్న ఆర్థిక సంవత్సరంలో స్థూల జాతీయోత్పత్తి 6.3 నుంచి 6.8 శాతం మధ్య మాత్రమే ఉండే అవకాశం ఉందని కూడా ఇదే రిపోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఇవన్నీ ప్రతిపక్షాల కుట్రలు కాదు. విదేశీ కుట్రలు అంతకంటే కాదు. దేశద్రోహుల ఆరోపణలు కూడా కాదు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ఫలితం. చెప్పింది భారతదేశ చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్. ఈ రిపోర్టును పార్లమెంటు ముందుంచింది. సాక్షాత్తూ దేశ ఆర్థిక శాఖా మంత్రి. బడ్జెట్ ప్రతిపాదనలు ఈ సమస్యల జోలికే పోలేదు. పైగా ఇప్పటిదాకా అమలు జరుపుతున్న సరళీకృత ఆర్థిక విధానాలనే మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లాలని ప్రతిపాదించారు. ఇప్పటికే కార్మిక చట్టాలు రద్దు చేశారు. వాటి స్థానంలో కోరలు లేని లేబర్ కోడ్స్ తెచ్చిపెట్టారు. రద్దయిన చట్టాల్లో వలస కార్మికుల భద్రతా చట్టం కూడా ఒకటి. ఇప్పుడు పరిశ్రమల్లోగానీ, అసంఘటిత రంగంలో గానీ దాదాపు సగం మంది వలస కార్మికులే. యూనియన్ల ఏర్పాటు కూడా కష్టంగా మారింది. ఫలితంగా సమిష్టి బేరసారాల శక్తి కూడా తగ్గింది.





ఎస్.వీరయ్య

> గత పదిహేనేళ్లుగా క్రమంగా స్థూల జాతీయోత్పత్తితో పోల్చితే బడ్జెట్ సైజు తగ్గుతూ వస్తున్నది. 18 శాతం నుంచి ఈ బడ్జెట్ 14.2 శాతానికి పడిపోయింది. ఇందులో బడా బాబులకిచ్చే రాయితీల పేరుతోనే ప్రభుత్వానికి రావలసిన ఆదాయం ఏటా రూ.1,45,000 కోట్లు కోల్పోతున్నది. మోడీ అధికారంలోకి రాగానే 2015 లోనే సంపద పన్ను రద్దు చేశారు. అభివృద్ధి చెందిన దేశాల్లో వారసత్వపు పన్ను విధిస్తున్నప్పటికీ మోడీ ప్రభుత్వం మాత్రం సిద్ధంగా లేదు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆర్థికవేత్త పికెట్టీ సూచించిన విధంగా రూ.10 కోట్లు అంతకు మించిన ఆదాయం ఉన్న ధనికుల మీద సంపద పన్ను పునరుద్ధరించి కనీసం 33శాతం వారసత్వపు పన్ను విధిస్తే కేంద్ర ప్రభుత్వానికి కావలసినంత ఆదాయం పెరుగుతుంది. తద్వారా ప్రజల కొనుగోలు శక్తి పెంచే విధంగా ప్రభుత్వ కేటాయింపులు బాగా పెంచవచ్చు. కానీ పాలకులు ఇందుకు సిద్ధంగా లేరు.

వ్యవసాయ కూలీలు, పేద రైతులు, కౌలు రైతుల ఊసెత్తడానికి కూడా పాలకులు సిద్ధంగా లేరు. రైతు పండించిన పంటకు మద్దతు ధర చట్టబద్ధం చేసేందుకు మోడీ ప్రభుత్వం నిరాకరిస్తున్నది. వీటన్నింటి ఫలితంగానే ప్రజల ఆదాయాలు పడిపోయాయి. ప్రజల అవసరాలు కూడా పెరిగాయి. మోటార్ సైకిల్, సెల్‌ఫోన్లు, ఇంటర్నెట్ సౌకర్యం నిత్య జీవితావసరాలుగా మారాయి. విద్యుత్తు వినియోగం పెరిగింది. మారుమూల గ్రామాల్లో కూడా మంచినీరు కొనుక్కోవలసి వస్తున్నది. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల ప్రజల మీద తీవ్ర ప్రభావం చూపుతున్నది. అంతిమంగా చదువు, వైద్యం కూడా ఖర్చుతో కూడినవిగా మారాయి. ఇంటి కిరాయిలూ పెరిగాయి.

జనం సమస్యలతో సతమతమవుతుంటే మోడీ ప్రభుత్వం మాత్రం బడా బాబుల పంచన చేరింది. సబ్సిడీలకు 'ఉచితాలు' అని పేరు పెట్టింది. వీటిని ప్రోత్సహించకూడదని సుప్రీంకోర్టుకు తన అభిప్రాయంగా తెలియజేసింది. బడా పెట్టుబడిదారులకు, ఫామ్‌హౌజ్‌ల యజమానులకు మాత్రం ఖజానాను దోచిపెట్టింది. 'రాయితీలు' అని ముద్దుపేరు పెట్టింది. రైతుల రుణ మాఫీకి అంగీకరించని మోడీ ప్రభుత్వం, గత పదేళ్లలో బడా బాబులు బ్యాంకులకు అప్పులు చెల్లించకుండా బకాయి పెట్టిన రూ.14.46 లక్షల కోట్లు మాఫీ చేసింది. ఎగవేతదారులకు అండగా నిలిచింది. కార్పొరేట్ సంస్థలు చెల్లించవలసిన పన్ను పదిశాతం తగ్గించింది. బడా బాబులకు పండగే కదా. ఏడాది కాలంలో దేశంలో శత కోటీశ్వరుల సంఖ్య 109 నుంచి 200కు పెరిగిందని ఫోర్బ్స్ నివేదిక బట్టబయలు చేసింది. కార్పొరేట్ సంస్థల లాభాలు 22.3 శాతం పెరిగాయని ఎకనమిక్ సర్వే రిపోర్టు తేల్చింది. అంతేనా, గత పదిహేనేళ్లలో వీరి ఆదాయం అనూహ్యంగా పెరిగిందని చెప్పింది. దేశ జనాభాలో ఒక్క శాతంగా ఉన్న ధనికుల చేతుల్లో 40.1 శాతం దేశ సంపద పోగైందని ప్రపంచ అసమానతల రిపోర్టు తేల్చింది. ఇవన్నీ దృష్టిలో పెట్టుకునే ఎకనామిక్ సర్వే రిపోర్టు, ప్రజల కొనుగోలు శక్తి మీద దృష్టి సారించింది. అంటే బడ్జెట్‌లో ప్రజల ఆదాయాలు పెంచే విధంగా ప్రతిపాదనలు వుండాలి. ప్రభుత్వం చేసే ఖర్చు పెరగాలి. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి కోసం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆర్థిక సర్వే చెప్పింది. తయారీరంగం అభివృద్ధి గురించి హెచ్చరించింది. ఆహార సరుకుల ద్రవ్యోల్బణం పెరిగిన నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లు పెంచాలన్నది. పెద్దఎత్తున నిల్వ చేయాలన్నది. కొరత సమయంలో ఆహార నిల్వలను మార్కెట్ లోకి విడుదల చేయడం ద్వారా దిగుమతులను అరికట్టాలని చెప్పింది. తగిన నెలసరి ఆదాయం ఉన్న ఉద్యోగాలు కనీసం ఏడాదికి 78.5 లక్షలు కల్పించాలన్నది. కార్మిక చట్టాల రద్దుతో 8 గంటల పనిదినం స్థానంలో ఇప్పటికే పన్నెండు గంటల పనిదినం అమలులోకి వచ్చింది. దీనివల్ల కార్మికులు, వారి కుటుంబాల ఆరోగ్యాలు దెబ్బ తింటాయని, స్థూల జాతీయోత్పత్తి మీద దాని ప్రభావం ఉంటుందని ఆర్థిక సర్వే రిపోర్టు హెచ్చరించింది. పారిశ్రామికవేత్తల సంఘాలకు మాత్రం ఇది రుచించడం లేదు. ఆర్థిక సర్వే రిపోర్టు చైనా గురించి కూడా ప్రస్తావించింది. గత పదేళ్లలో చైనా ప్రజల ఆదాయాలు పెరగడం వల్ల అంతర్గతంగా సరుకుల వినిమయం బాగా పెరిగింది. తయారీరంగం బాగా అభివృద్ధి చెందింది. ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ఉత్పత్తి కూడా శరవేగంగా పెరిగింది. మరోవైపు భారతదేశం మాత్రం ఈ కాలంలో ఇటు అభివృద్ధి చెందుతున్న దేశాలతో గానీ, అభివృద్ధి చెందిన దేశాలతోగానీ పోటీ పడగల స్థితిలో లేదని గుర్తు చేసింది. రానున్న కాలం కూడా అంత ఆశాజనకంగా ఏమీ లేదని పెదవి విరిచింది. ట్రంప్ ప్రభుత్వ టారిఫ్ విధానాలు భారతదేశం ఆశల మీద నీళ్లు చల్లుతున్నాయని ఆర్థిక సర్వే హెచ్చరించింది. అంతర్జాతీయ మార్కెట్ ఒడిదుడుకులు కూడా మనకు ఆటంకమేనన్నది. దేశంలో పారిశ్రామిక సరుకుల ధరలు కూడా సమస్యగా మారవచ్చునన్నది. ఇవన్నీ గమనించిన వారెవరికైనా మన దేశంలో ప్రజల ఆదాయాలు పెంచే చర్యలు తీసుకోవాలన్నది సులభంగానే అర్థమవుతున్నది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో లేనిది కూడా ఇదే. ఇప్పుడు మనం ఎగుమతుల మీద ఆశలు పెంచుకోవడం హాస్యాస్పదం. ఏవిధంగా చూసినా ప్రజల కొనుగోలు శక్తి పెంచడం అత్యంత కీలకం.

గతేడాది బడ్జెట్‌లోనే విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి హామీ, ఎరువులు, వంటగ్యాస్, ఆహార సబ్సిడీలకు కేటాయింపులు బాగా తగ్గించింది. ఈసారి బడ్జెట్‌లో కూడా సుమారు అవే మొత్తాలను ప్రతిపాదించింది. పెరిగిన ధరలతో పోల్చినా, బడ్జెట్‌తో లేదా స్థూల జాతీయోత్పత్తితో చూసినా వీటికి కేటాయింపులు తగ్గించింది. విద్యుత్తు రంగాన్ని ప్రైవేటుపరం చేయాలన్నది. బీమా రంగంలో నూటికి నూరు శాతం విదేశీ పెట్టుబడులకు అవకాశం కల్పించింది. నగదీకరణ పేరుతో ప్రభుత్వ ఆస్తులను అమ్మకానికి పెట్టి రూ.10 లక్షల కోట్లు సమకూర్చుకోవాలని చెప్పింది. ఇప్పటికే జీఎస్టీ పేరుతో ప్రజల మీద పన్నుల భారం పెరిగింది. నిరుద్యోగుల అప్లికేషన్ ఫారాలను కూడా వదలకుండా పద్దెనిమిది శాతం పన్ను విధించింది. దేశంలో జీఎస్టీ ద్వారా ప్రభుత్వానికి సమకూరుతున్న పన్ను ఆదాయంలో ధనికులు చెల్లిస్తున్న దానికన్నా సాధారణ ప్రజలు చెల్లిస్తున్నదే ఎక్కువ. జీఎస్టీతో సంబంధం లేని చమురు ధరల గురించి ప్రశ్నిస్తే చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్ స్పందించలేదు. ప్రజల ఆదాయాలు పెంచేందుకు తగిన కేటాయింపులు జరగాలంటే కేంద్ర ప్రభుత్వానికి ఆదాయం కూడా పెరగాలి. బడ్జెట్ సైజు పెరగాలి. కానీ గత పదిహేనేళ్లుగా క్రమంగా స్థూల జాతీయోత్పత్తితో పోల్చితే బడ్జెట్ సైజు తగ్గుతూ వస్తున్నది. 18 శాతం నుంచి ఈ బడ్జెట్ 14.2 శాతానికి పడిపోయింది. ఇందులో బడా బాబులకిచ్చే రాయితీల పేరుతోనే ప్రభుత్వానికి రావలసిన ఆదాయం ఏటా రూ.1,45,000 కోట్లు కోల్పోతున్నది. మోడీ అధికారంలోకి రాగానే 2015 లోనే సంపద పన్ను రద్దు చేశారు. అభివృద్ధి చెందిన దేశాల్లో వారసత్వపు పన్ను విధిస్తున్నప్పటికీ మోడీ ప్రభుత్వం మాత్రం సిద్ధంగా లేదు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆర్థికవేత్త పికెట్టీ సూచించిన విధంగా రూ.10 కోట్లు అంతకు మించిన ఆదాయం ఉన్న ధనికుల మీద సంపద పన్ను పునరుద్ధరించి కనీసం 33 శాతం వారసత్వపు పన్ను విధిస్తే కేంద్ర ప్రభుత్వానికి కావలసినంత ఆదాయం పెరుగుతుంది. తద్వారా ప్రజల కొనుగోలు శక్తి పెంచే విధంగా ప్రభుత్వ కేటాయింపులు బాగా పెంచవచ్చు. కానీ పాలకులు ఇందుకు సిద్ధంగా లేరు. నెల జీతం పొందుతున్న ఉద్యోగుల నుంచి ఆదాయం పన్ను రూపంలో 30 శాతానికి పైగా వసూలు చేస్తున్న కేంద్రం శత కోటీశ్వరుల నుంచి మాత్రం తక్కువ పన్ను వసూలు చేస్తున్నది. ఇప్పుడు 12 లక్షల ఆదాయం వరకు పన్ను మినహాయించి సంబరపడమంటున్నది. బడా బాబులకు ఇస్తున్న రాయితీల్లో ఉద్యోగులకిచ్చిన రాయితీ సముద్రంలో నీటి బొట్టు. సంపద పోగవుతున్న కుబేరులను నొప్పించడం పాలకులకు ఇష్టం లేదు. అందుకే ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్. కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ ఒక నిజం చెప్పారు. 'నిరుద్యోగ సమస్య పరిష్కరించడంలో గత యూపీఏ ప్రభుత్వంగానీ, ఇప్పుడు ఎన్డీయే సర్కార్ గానీ రెండూ విఫలమయ్యాయి' అన్నారు. నిజమే! బడా బాబుల మీద పన్నులు పెంచడం ద్వారా ప్రభుత్వ ఆదాయం పెంచుకోకుండా ప్రజా సమస్యల పరిష్కారం సాధ్యం కాదు గదా. ఈ మౌలిక విషయాన్ని పరిష్కరించగలిగే రాజకీయ ప్రత్యామ్నాయం అవసరం. అది ఎర్రజెండాకు మాత్రమే సాధ్యం.

/ వ్యాసకర్త సిపిఎం తెలంగాణ కార్యదర్శివర్గ సభ్యులు /

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @gmail.com

అమెరికా ఆంక్షలను ఖండించిన ఐసిసి

- బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ
- ఐసిసి ఉద్యోగుల ఆస్తులను స్తంభింపజేస్తూ ట్రంప్ ఉత్తర్వులు



ది హేగ్, వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన ఆంక్షలకు వ్యతిరేకంగా నిలబడాల్సిందిగా అంతర్జాతీయ నేర న్యాయస్థానం (ఐసిసి) తన సభ్య దేశాలకు పిలుపునిచ్చింది. తమ స్వతంత్ర, నిష్పక్షిక జ్యుడీషియల్ కార్యకలాపాలకు హాని కలిగించాలన్నదే ఈ చర్యల ఉద్దేశమని విమర్శించింది. ఐసిసిపై ఆంక్షలు విధిస్తూ అమెరికా తీసుకున్న చర్యను శుక్రవారం ఖండించింది. ప్రపంచవ్యాప్తంగా లక్షలాదిమంది బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు ఐసిసి ఒక ప్రకటన విడుదల చేసింది. న్యాయం కోసం, ప్రాథమిక మానవ హక్కుల పరిరక్షణ కోసం సమైక్యంగా నిలబడాల్సిందిగా 125 సభ్య దేశాలకు, పౌర సమాజ సంస్థలకు, అన్ని దేశాలకు పిలుపునిచ్చింది. మానవ హక్కుల గ్రూపులు అమెరికా నిర్ణయాన్ని ఖండించాయి. సామూహిక అత్యాచారాలకు పాల్పడుతున్న వారికి ఈ ఆంక్షలను ఒక బహుమతిగా అందించారంటూ విమర్శించాయి. అమెరికా, దాని మిత్రపక్షం ఇజ్రాయిల్‌ను లక్ష్యంగా చేసుకుని నిరాధారమైన దర్యాప్తులు చేపడుతున్నారంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గురువారం ఆంక్షలు విధించారు. ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహుకు అరెస్టు వారంటు జారీ చేయడం ద్వారా ఐసిసి తన అధికారాలను దుర్వినియోగం చేస్తోందని ట్రంప్ విమర్శించారు. చట్టవిరుద్ధమైన, నిరాధారమైన చర్యలకు పాల్పడుతోందంటూ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఐసిసి అధికారుల, ఉద్యోగుల, వారి కుటుంబ సభ్యుల ఆస్తులను స్తంభింపజేస్తూ, వారి ప్రయాణాలపై నిషేధం విధించారు.

బంగ్లాదేశ్‌లో హింసాకాండ

- అవామీ లీగ్ నేతల ఇళ్లపై దాడులు

ఢాకా : దేశవ్యాప్తంగా అవామీ లీగ్ నేతల ఇళ్లపై ఆందోళనకారులు దాడులు చేసి ధ్వంసం చేయడం, ఇళ్లను తగలబెట్టడం వంటి హింసాత్మక చర్యలకు పాల్పడ్డారు. దేశ వ్యవస్థాపకుడు షేక్ ముజిబుర్ రహమాన్ కుడ్య చిత్రాలను నాశనం చేశారు. దాదాపు 24 జిల్లాల్లో ఇటువంటి హింసాయుత ఘటనలు చోటుచేసుకున్నాయి. మాజీ ప్రధాని షేక్ హసీనా ఆన్‌లైన్‌లో ప్రసంగించిన తర్వాత ఈ అశాంతి పెచ్చరిల్లింది. ఢాకాలో అవామీ లీగ్ నేత షేక్ సలీమ్ ఇంటికి బుధవారం నిప్పంటించారు. షేక్ ముజిబుర్ రహమాన్ నివాసానికి నిప్పంటించిన తర్వాత ఆందోళనకారులు అవామీ లీగ్ ప్రధాన కార్యదర్శి, మాజీ రోడ్డు రవాణా మంత్రి ఇళ్లపై దాడులు చేసి, దోచుకుని, ధ్వంసం చేశారు. రాజ్‌షాహిలో ఆందోళనకారుల బృందం మాజీ మంత్రికి చెందిన మూడంతస్తుల ఇంటిని తగలబెట్టింది. వందలాదికి పైగా ఆందోళనకారులు మోటార్‌బైక్‌లపై వచ్చి ఈ ఘాతుకానికి పాల్పడ్డారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దేశవ్యాప్తంగా పలు జిల్లాల్లో, ప్రాంతాల్లో ఆందోళనకారులు రెచ్చిపోయి, హింసకు పాల్పడ్డారు. బుల్డోజర్లను తీసుకొచ్చి మరీ ఇళ్లను కూల్చివేశారు. గేట్లను విరిచి, ఇళ్లల్లోకి చొరబడి, వస్తువులను చెల్లాచెదురుచేసి, చేతికి అందిన వాటిని దోచుకుని, చివరగా వెళ్లేటపుడు ఇళ్లకు నిప్పంటించడం వంటి ఘాతుకాలకు పాల్పడ్డారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.



దాడుల్లో ధ్వంసమైన అవామీ లీగ్ నాయకుని ఇల్లు

తెలంగాణలో జనసేనకు ఎన్నికల కమిషన్ గుర్తింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో జనసేన పార్టీకి ఎలక్షన్ కమిషన్ గుర్తింపు లభించిందని తెలంగాణ జనసేన ఇంచార్జ్ శంకర్ గౌడ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గాజు గ్లాసు గుర్తును కేటాయించిన ఎలక్షన్ కమిషన్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణలోని జనసైనికులు, వీర మహిళల కష్టానికి ఫలితం లభించిందన్నారు. జనసేన పార్టీ రిజిస్టర్ పార్టీ నుంచి గుర్తింపు పొందిన పార్టీగా మారిందన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలో కూడా జనసేన పార్టీని బలోపేతం చేస్తామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసి జనసేన సత్తా చాటుతామని చెప్పారు. ఇందుకోసం తెలంగాణ జనసేన క్యాడర్ సిద్ధంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేసేవరకు ప్రజల పక్షాన పోరాడుతామన్నారు.

ఢిల్లీలో పలు స్కూళ్లకు బాంబు బెదిరింపులు

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలోని పలు పాఠశాలలకు మరోసారి బాంబు బెదిరింపులు వచ్చాయి. శుక్రవారం ఉదయం ఈస్ట్ ఢిల్లీ, నోయిడాలోని పలు స్కూళ్లకు ఈ-మెయిల్ ద్వారా బెదిరింపులు వచ్చాయి. సమాచారం అందుకున్న పోలీసులు బాంబు స్క్వాడ్ సిబ్బంది స్కూళ్లలో తనిఖీలు చేశారు. మయూర్ విహార్‌లోని అహ్లకాన్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు, నోయిడాలోని శివ్ నాడార్ స్కూల్‌కు బెదిరింపులు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఆ స్కూళ్లలో అనుమానాస్పద వస్తువు లేవీ లేవని ఢిల్లీ పోలీసులు వెల్లడించారు. బెదిరింపులకు సంబంధించి మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందనే విషయమై సైబర్ టీమ్ దర్యాప్తు చేస్తున్నదని, ప్రజలు ఇలాంటి వార్తలను నమ్మొద్దని నోయిడా పోలీసులు సూచించారు. ఢిల్లీలో గతంలో కూడా పలుమార్లు స్కూళ్లకు బాంబు బెదిరింపులు వచ్చిన సంగతి తెలిసిందే.

'సిగ్నస్ 25' అధికారిక వెబ్‌సైట్ ప్రారంభం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి నూజివీడు క్యాంపస్‌లో ఈ ఏడాది నిర్వహించనున్న వార్షిక సాంస్కృతిక మహోత్సవం సిగ్నస్ 25 అధికారిక వెబ్‌సైట్ https://www.cygnus-rguktn.org శుక్రవారం ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.అమరేంద్ర కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతికతతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా పాల్గొనాలని సూచించారు. మన దేశ సంస్కృతిని, సాంప్రదాయాలను ప్రతిబింబించేలా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నూజివీడు క్యాంపస్ పరిపాలన అధికారి డాక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ సిగ్నస్ 25 కేవలం వినోదానికి మాత్రమే కాకుండా విద్యార్థుల్లో నైపుణ్యాలు, నాయకత్వ గుణాలను అభివృద్ధి చేసే ఒక వేదికని అన్నారు.

భారతీయుల హక్కుల రక్షణలో కేంద్రం విఫలం : సంజయ్ రౌత్

న్యూఢిల్లీ : అమెరికాలో చట్టబద్ధమైన పత్రాలు లేకుండా నివసిస్తున్న భారతీయుల్ని స్వదేశానికి పంపిన తీరు అమానవీయంగా ఉంది. ఈ ఘటనపై ప్రతిపక్ష ఎంపీలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని వారు డిమాండ్ చేశారు. తాజాగా ఈ ఘటనపై శివసేన (యుబిటి) నేత సంజయ్‌రౌత్ మోడీ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'భారతీయులేమీ నేరస్తులు కాదు. వారి చేతులకు, కాళ్లకు సంకెళ్ల వేయడం చట్టాన్ని ఉల్లంఘించడమే. అసలు అమెరికా విమానాన్ని టేకాఫ్ చేయడానికి అనుమతించకుండా.. తిరిగి వెనక్కి పంపాల్సింది' అని ఆయన అన్నారు. అమెరికా భారతీయుల్ని వెనక్కి పంపినప్పటికీ.. వారి హక్కులను పరిరక్షించడంలో భారత ప్రభుత్వం విఫలమైంది. దీనిపై ప్రభుత్వం బలమైన వైఖరి తీసుకోవాల్సింది అని ఆయన నొక్కి చెప్పారు.

ఇ-వేలం యొక్క నియమాలు మరియు నిబంధనలు క్రింద విధంగా :
1. ఇ-వేలం అనేది "ఆన్ లైన్" లో "ఏది ఎక్కడ ఉన్నదో" "అది అక్కడ అలాగే" జరుపబడును. వేలం అనేది బ్యాంక్ వారు ఆమోదించిన సర్వీస్ ప్రొవైడర్ ద్వారా మెసర్స్.4 క్లోసర్ ఇండియా (సంప్రదించాల్సిన నెం. ..... వద్ద వెబ్ పోర్టల్ https://www.bankauctions.in ద్వారా జరుపబడును. ఇ-వేలం టెండర్ డాక్యుమెంటులో ఇ-వేలం బిడ్ ఫారం, డిక్లేరేషన్, సాధారణ నియమాలు మరియు నిబంధనలు కలిగి వేలం మరియు అమ్మకం వెబ్‌సైట్ https://www.bankauctions.in ద్వారా అందుబాటులో ఉంటాయి.
2. అధీకృత అధికారి యొక్క వివరణ మేరకు, ఆస్తులకు సంబంధించి ఎటువంటి గొడవలు లేవు. ఏదైతే ఆసక్తి ఉన్న బిడ్డరు వారు సొంత పరిధిని ఉపయోగించి ఆస్తికి సంబంధించిన ఎలాంటి గొడవలు ఉన్నాయో బిడ్ దాఖలుకు ముందుగానే ఆస్తులకు సంబంధించిన వేలం మరియు గొడవలు/హక్కులు/బకాయిలు/ ఆస్తి ని పాడుచేసే విభాగాలును మీరు తెలుసుకొనగలరు, ఇ-వేలం యొక్క ప్రకటన తెలియపరచలేదు మరియు ఎటువంటి కమిట్‌మెంట్‌కు ఆధారపడలేదు మరియు బ్యాంకు వారు తరుపు నుంచి కూడా. ఆస్తికి సంబందించి అన్ని ఉన్న మరియు లేని భవిష్యత్‌కు సంబందించిన గొడవలు బ్యాంకు వారికి తెలిసినవి మరియు తెలియనివి అమ్మబడును. అధీకృత అదికారికి మరియు / సెక్యూర్డ్ క్రెడిటార్‌కు మూడవ వ్యక్తి ద్వారా వచ్చిన గొడవలు/హక్కులు/బకాయిలకు ఎటువంటి సంబందం లేదు.
3. బిడ్ గనుక సత్ఫలితం ఇవ్వకపోతే ఎటువంటి వడ్డీ లేకుండానే బయానా తిరిగి ఇవ్వబడుతుంది. దిగువసంతకాదారుకు అన్ని ఆఫర్లను ఆమోదించే మరియు తిరస్కరించే హక్కు కలిగి ఉంటుంది మరియు వేలం యొక్క అమ్మకం ఎటువంటి కారణం తెలుపకుండానే పోస్ట్ పోన్ చేయవలసి ఉంటుంది. ఆఫర్ కనుక ఆమోదించబడితే కొనుగోలుదారు 25 శాతం (బయానా కాకుండా) ను అమ్మకం ధరను వేలం రోజునే డిపాసిట్ చేయాలి మరియు లేదా కొనుగోలుదారు డిపాజిట్ చేయని యెడల బయానాను బహిష్కరించవలసి ఉంటది మరియు ఆస్తి అనేది మరలా తిరిగి వేలం వేయబడుతుంది. కొనుగోలు ధర యొక్క మిగతా ధర అమ్మకం అనేది పూర్తయిన 15 రోజుల తర్వాత కట్టవలసి ఉంటుంది మరియు ఉన్న సమయములో మీరు కట్టకపోతే బయానాను బహిష్కరించవలసి ఉంటుంది మరియు ఆస్తి అనేది మరలా తిరిగి వేలం వేయబడుతుంది. ఇతర స్టాట్యూటరీ బకాయిలు/పన్నులు/స్టాంప్ డ్యూటీ/ రిజిస్ట్రేషన్ ఫీజు/ ఇతర బదిలీ ఫీజులు కొనుగోలుదారు కట్టవలసి ఉంటుంది.
4. అమ్మకం అనేది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద నియమాలు/నిబందనలకు లోబడి ఉంటుంది.

ఇ-వేలం యొక్క నియమాలు మరియు నిబంధనలు క్రింద విధంగా :
1. ఇ-వేలం అనేది "ఆన్ లైన్" లో "ఏది ఎక్కడ ఉన్నదో" "అది అక్కడ అలాగే" జరుపబడును. వేలం అనేది బ్యాంక్ వారు ఆమోదించిన సర్వీస్ ప్రొవైడర్ ద్వారా మెసర్స్.4 క్లోసర్ ఇండియా (సంప్రదించాల్సిన నెం. ..... వద్ద వెబ్ పోర్టల్ https://www.bankauctions.in ద్వారా జరుపబడును. ఇ-వేలం టెండర్ డాక్యుమెంటులో ఇ-వేలం బిడ్ ఫారం, డిక్లేరేషన్, సాధారణ నియమాలు మరియు నిబంధనలు కలిగి వేలం మరియు అమ్మకం వెబ్‌సైట్ https://www.bankauctions.in ద్వారా అందుబాటులో ఉంటాయి.
2. అధీకృత అధికారి యొక్క వివరణ మేరకు, ఆస్తులకు సంబంధించి ఎటువంటి గొడవలు లేవు. ఏదైతే ఆసక్తి ఉన్న బిడ్డరు వారు సొంత పరిధిని ఉపయోగించి ఆస్తికి సంబంధించిన ఎలాంటి గొడవలు ఉన్నాయో బిడ్ దాఖలుకు ముందుగానే ఆస్తులకు సంబంధించిన వేలం మరియు గొడవలు/హక్కులు/బకాయిలు/ ఆస్తి ని పాడుచేసే విభాగాలును మీరు తెలుసుకొనగలరు, ఇ-వేలం యొక్క ప్రకటన తెలియపరచలేదు మరియు ఎటువంటి కమిట్‌మెంట్‌కు ఆధారపడలేదు మరియు బ్యాంకు వారు తరుపు నుంచి కూడా. ఆస్తికి సంబందించి అన్ని ఉన్న మరియు లేని భవిష్యత్‌కు సంబందించిన గొడవలు బ్యాంకు వారికి తెలిసినవి మరియు తెలియనివి అమ్మబడును. అధీకృత అదికారికి మరియు / సెక్యూర్డ్ క్రెడిటార్‌కు మూడవ వ్యక్తి ద్వారా వచ్చిన గొడవలు/హక్కులు/బకాయిలకు ఎటువంటి సంబందం లేదు.
3. బిడ్ గనుక సత్ఫలితం ఇవ్వకపోతే ఎటువంటి వడ్డీ లేకుండానే బయానా తిరిగి ఇవ్వబడుతుంది. దిగువసంతకాదారుకు అన్ని ఆఫర్లను ఆమోదించే మరియు తిరస్కరించే హక్కు కలిగి ఉంటుంది మరియు వేలం యొక్క అమ్మకం ఎటువంటి కారణం తెలుపకుండానే పోస్ట్ పోన్ చేయవలసి ఉంటుంది. ఆఫర్ కనుక ఆమోదించబడితే కొనుగోలుదారు 25 శాతం (బయానా కాకుండా) ను అమ్మకం ధరను వేలం రోజునే డిపాసిట్ చేయాలి మరియు లేదా కొనుగోలుదారు డిపాజిట్ చేయని యెడల బయానాను బహిష్కరించవలసి ఉంటది మరియు ఆస్తి అనేది మరలా తిరిగి వేలం వేయబడుతుంది. కొనుగోలు ధర యొక్క మిగతా ధర అమ్మకం అనేది పూర్తయిన 15 రోజుల తర్వాత కట్టవలసి ఉంటుంది మరియు ఉన్న సమయములో మీరు కట్టకపోతే బయానాను బహిష్కరించవలసి ఉంటుంది మరియు ఆస్తి అనేది మరలా తిరిగి వేలం వేయబడుతుంది. ఇతర స్టాట్యూటరీ బకాయిలు/పన్నులు/స్టాంప్ డ్యూటీ/ రిజిస్ట్రేషన్ ఫీజు/ ఇతర బదిలీ ఫీజులు కొనుగోలుదారు కట్టవలసి ఉంటుంది.
4. అమ్మకం అనేది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద నియమాలు/నిబందనలకు లోబడి ఉంటుంది.

ముసాయిదా నియమాలపై పెరుగుతున్న నిరసనలు

- అభిప్రాయాలను తెలియజేయటానికి గడువును పొడిగించిన యుజిసి



న్యూఢిల్లీ : దేశంలోని విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో అధ్యాపకులు, విద్యా సిబ్బంది నియామకంపై యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) వివాదాస్పద ముసాయిదా నిబంధనలపై రాజకీయ గందరగోళం నెలకొన్నది. ఈ నేపథ్యంలో యుజిసి ముసాయిదా రెగ్యులేషన్‌పై ప్రజల అభిప్రాయాలను స్వీకరించటానికి గడువును ఈనెల 28 వరకు పొడిగించినట్టు ప్రకటించింది. యుజిసి రెగ్యులేషన్స్ 2025 ముసాయిదాపై అభిప్రాయాన్ని సమర్పించటానికి చివరి తేదీని పొడిగించాలని వచ్చిన అభ్యర్థనల దృష్ట్యా.. యుజిసి చివరి తేదీని ఈనెల 28 వరకు పొడిగించాలని నిర్ణయించినట్లు యుజిసి కార్యదర్శి ప్రొఫెసర్ మనీశ్ ఆర్ జోషి ఒక పబ్లిక్ నోటీసులో పేర్కొన్నారు. ఈ ముసాయిదాను యుజిసి వెబ్‌సైట్‌లో గతనెల 6న అప్‌లోడ్ చేశారు. ఈనెల 5 వరకు వాటాదారుల నుంచి అభిప్రాయాన్ని కోరింది. ఇప్పుడు ఆ తేదీ 28కి పొడిగించినట్టయ్యింది. ముసాయిదా నియామకాలు, పదోన్నతుల నిబంధనలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఇప్పటికే ఆరు బిజెపియేతర రాష్ట్రాలు కోరాయి. తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన మంత్రులు, ప్రతినిధులు.. యుజిసి ముసాయిదా నిబంధనలపై ఇప్పటికే 15 అంశాల తీర్మానాన్ని ఆమోదించారు. తమిళనాడులోని అధికార పార్టీ, ఇండియా బ్లాక్‌లో కీలక భాగస్వామి అయిన డిఎంకె దేశ రాజధాని ఢిల్లీలో నిరసనను వ్యక్తం చేసింది. కేరళలోని లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ ప్రభుత్వం దీనిని వ్యతిరేకించింది. ఇండియా బ్లాక్ పార్టీలు ఈ అంశాన్ని తీవ్రతరం చేశాయి. డిఎంకె విద్యార్థి విభాగం నిరసనలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు కూడా. 'ఒక చరిత్ర, ఒక సంప్రదాయం, ఒక భాష' అనే తన ఆలోచనను దేశంపై రుద్దాలనే తన ఆలోచనను సాధించడానికి ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాను నెట్టడానికి ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.

నిరసన తెలియజేశాం

- భారతీయుల తరలింపు తీరుపై మిస్రి వెల్లడి
- ఇంకా రావాల్సిన వారు మరో 487మంది



న్యూఢిల్లీ : చట్టబద్ధమైన పత్రాలు లేకుండా అమెరికాలో నివసిస్తున్న భారతీయులను వెనక్కి తిప్పి పంపడంలో ట్రంప్ ప్రభుత్వం వ్యవహరించిన తీరు పట్ల భారత నిరసన వ్యక్తం చేసిందని విదేశాంగ కార్యదర్శి మిస్రి తెలిపారు. 24గంటల పాటు సాగిన సుదీర్ఘ విమాన ప్రయాణంలో అత్యంత అమానవీయమైన రీతిలో భారతీయుల చేతులు, కాళ్లకు సంకెళ్లు వేసి తరలించడంపై దేశవ్యాప్తంగా విమర్శలు, ఖండనలు వెల్లువెత్తాయి. తొలుత ఆ చిత్రాల్ని బూటకమని, అలాంటిదేమీ జరగలేదని తోసిపుచ్చిన కేంద్రం తర్వాత జరిగిన తప్పును సరిదిద్దే చర్యలు చేపట్టింది. ఈ విషయంలో భారత్ ఆందోళనలు, నిరసనలను అమెరికా ప్రభుత్వానికి తెలియజేసినట్లు మిస్రి తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ప్రత్యేక మీడియా సమావేశం పెట్టి చెప్పారు. భారతీయుల తరలింపుపై తలెత్తిన ప్రశ్నలకు సమాధానాలిస్తూ, అమాయకులను తప్పుదారి పట్టించి, వారిని అక్రమంగా అమెరికాలోకి ప్రవేశించేలా చేయడమే ఇక్కడ అసలైన సమస్య అని ఆయన వ్యాఖ్యానించారు. అటువంటి నేరం చేసిన వారిని తప్పకుండా ప్రాసిక్యూట్ చేయాల్సిన అవసరం వుందని అన్నారు. అమెరికా నుండి ఇలా స్వదేశానికి పంపే భారతీయులు 487మంది వున్నారని తెలిసిందని చెప్పారు. వారిలో 298మందికి సంబంధించిన సమాచారాన్ని పంపించారని తెలిపారు. ఇప్పటికే తరలింపు ప్రక్రియలో తలెత్తిన అనుచిత వైఖరిని ఎత్తిచూపించామని, అవసరమైతే భవిష్యత్తులో కూడా ఇలాగే చేస్తామని చెప్పారు. ఈ నెల 12 నుండి రెండు రోజుల పాటు ప్రధాని మోడీ అమెరికాలో పర్యటించనున్నారు. ఆ సమయంలో ఆయన అమెరికా అధ్యక్షుడితో భేటీ అవుతారని విదేశాంగ శాఖ ప్రకటించింది.

మార్చి 7 నుండి హెచ్-1బి వీసాల రిజిస్ట్రేషన్ ప్రారంభం

న్యూయార్క్ : హెచ్-1బి వీసాల తొలి నమోదు ప్రక్రియ మార్చి 7 నుండి ప్రారంభమై మార్చి 24తో ముగుస్తుందని ఫెడరల్ ఏజెన్సీ అమెరికా పౌరసత్వ, ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యుఎస్‌సిఐఎస్) ప్రకటించింది. భారతీయ ఐటి నిపుణులు ఎక్కువగా కోరుకునే ఈ వీసాలను 2026 ఆర్థిక సంవత్సరానికి నమోదు చేసుకోవాల్సి వుంది. నాన్ ఇమ్మిగ్రెంట్ వీసా అయిన హెచ్-1బి వీసా కింద సైద్ధాంతిక లేదా సాంకేతిక నైపుణ్యం కలిగిన విదేశీ సిబ్బంది ప్రత్యేక వృత్తుల్లో అమెరికా కంపెనీల్లో పనిచేయవచ్చు. ఈ వీసాలపైనే ఆధారపడి టెక్నాలజీ కంపెనీలు వేలాదిగా ఉద్యోగులను ప్రతి ఏటా భారత్, చైనా వంటి దేశాల నుండి తెచ్చుకుంటాయి. ప్రకటించిన ఈ నిర్ణీత కాలంలో పిటిషనర్లు యుఎస్‌సిఐఎస్ ఆన్‌లైన్ అకౌంట్‌ను ఉపయోగించుకుని నమోదు చేసుకోవాలి. ప్రతి ఒక్క లబ్ధిదారునికి చెల్లించాల్సిన రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలి. 215 డాలర్లు ఈ ఫీజు వుంది. అమెరికా ఆర్థిక సంవత్సరం అక్టోబరు 1, 2025 నుండి ఆరంభమవుతుంది. ఈ వీసాల విషయంలో భారతీయులు ఎక్కువగా లబ్ధిపొందుతుంటారు. ప్రపంచవ్యాప్తంగా అద్భుతమైన నైపుణ్యాలు వీరి సొంతం.

ఇ-వేలం యొక్క నియమాలు మరియు నిబంధనలు క్రింద విధంగా :
1. ఇ-వేలం అనేది "ఆన్ లైన్" లో "ఏది ఎక్కడ ఉన్నదో" "అది అక్కడ అలాగే" జరుపబడును. వేలం అనేది బ్యాంక్ వారు ఆమోదించిన సర్వీస్ ప్రొవైడర్ ద్వారా మెసర్స్.4 క్లోసర్ ఇండియా (సంప్రదించాల్సిన నెం. ..... వద్ద వెబ్ పోర్టల్ https://www.bankauctions.in ద్వారా జరుపబడును. ఇ-వేలం టెండర్ డాక్యుమెంటులో ఇ-వేలం బిడ్ ఫారం, డిక్లేరేషన్, సాధారణ నియమాలు మరియు నిబంధనలు కలిగి వేలం మరియు అమ్మకం వెబ్‌సైట్ https://www.bankauctions.in ద్వారా అందుబాటులో ఉంటాయి.
2. అధీకృత అధికారి యొక్క వివరణ మేరకు, ఆస్తులకు సంబంధించి ఎటువంటి గొడవలు లేవు. ఏదైతే ఆసక్తి ఉన్న బిడ్డరు వారు సొంత పరిధిని ఉపయోగించి ఆస్తికి సంబంధించిన ఎలాంటి గొడవలు ఉన్నాయో బిడ్ దాఖలుకు ముందుగానే ఆస్తులకు సంబంధించిన వేలం మరియు గొడవలు/హక్కులు/బకాయిలు/ ఆస్తి ని పాడుచేసే విభాగాలును మీరు తెలుసుకొనగలరు, ఇ-వేలం యొక్క ప్రకటన తెలియపరచలేదు మరియు ఎటువంటి కమిట్‌మెంట్‌కు ఆధారపడలేదు మరియు బ్యాంకు వారు తరుపు నుంచి కూడా. ఆస్తికి సంబందించి అన్ని ఉన్న మరియు లేని భవిష్యత్‌కు సంబందించిన గొడవలు బ్యాంకు వారికి తెలిసినవి మరియు తెలియనివి అమ్మబడును. అధీకృత అదికారికి మరియు / సెక్యూర్డ్ క్రెడిటార్‌కు మూడవ వ్యక్తి ద్వారా వచ్చిన గొడవలు/హక్కులు/బకాయిలకు ఎటువంటి సంబందం లేదు.
3. బిడ్ గనుక సత్ఫలితం ఇవ్వకపోతే ఎటువంటి వడ్డీ లేకుండానే బయానా తిరిగి ఇవ్వబడుతుంది. దిగువసంతకాదారుకు అన్ని ఆఫర్లను ఆమోదించే మరియు తిరస్కరించే హక్కు కలిగి ఉంటుంది మరియు వేలం యొక్క అమ్మకం ఎటువంటి కారణం తెలుపకుండానే పోస్ట్ పోన్ చేయవలసి ఉంటుంది. ఆఫర్ కనుక ఆమోదించబడితే కొనుగోలుదారు 25 శాతం (బయానా కాకుండా) ను అమ్మకం ధరను వేలం రోజునే డిపాసిట్ చేయాలి మరియు లేదా కొనుగోలుదారు డిపాజిట్ చేయని యెడల బయానాను బహిష్కరించవలసి ఉంటది మరియు ఆస్తి అనేది మరలా తిరిగి వేలం వేయబడుతుంది. కొనుగోలు ధర యొక్క మిగతా ధర అమ్మకం అనేది పూర్తయిన 15 రోజుల తర్వాత కట్టవలసి ఉంటుంది మరియు ఉన్న సమయములో మీరు కట్టకపోతే బయానాను బహిష్కరించవలసి ఉంటుంది మరియు ఆస్తి అనేది మరలా తిరిగి వేలం వేయబడుతుంది. ఇతర స్టాట్యూటరీ బకాయిలు/పన్నులు/స్టాంప్ డ్యూటీ/ రిజిస్ట్రేషన్ ఫీజు/ ఇతర బదిలీ ఫీజులు కొనుగోలుదారు కట్టవలసి ఉంటుంది.
4. అమ్మకం అనేది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద నియమాలు/నిబందనలకు లోబడి ఉంటుంది.

IKF Finance Limited

Regd. Off.: #40-1-144, Corporate Centre, M.G. Road, VIJAYAWADA – 520 010
Phone: 91-866-2474644 Fax: 91-866-2485755
Website: ikffinance.com CIN: U65992AP1991PLC012736

Statement of Unaudited Standalone Financial Results for the Quarter and Nine Months Ended December 31, 2024
(Regulation 52(8), read with regulation 52(4) of the listing regulations)

(Rs in Lakhs)

Sl No	Particulars	Quarter Ended December 31, 2024 (Unaudited)	Quarter Ended September 30, 2024 (Unaudited)	Quarter Ended December 31, 2023 (Unaudited)	Nine Months Ended December 31, 2024 (Unaudited)	Nine Months Ended December 31, 2023 (Unaudited)	Year Ended March 31, 2024 (Audited)
1	Total Income from Operations	16068.17	14856.68	11038.67	44529.98	30025.75	42140.64
2	Net Profit / (Loss) for the period (before Tax, Exceptional and / or Extraordinary items#)	3,757.64	4,630.52	2,493.91	10,908.24	6,335.85	10,337.63
3	Net Profit / (Loss) for the period before tax (after Exceptional and / or Extraordinary items#)	3,757.64	4,630.52	2,493.91	10,908.24	6,335.85	10,337.63
4	Net Profit / (Loss) for the period after tax (after Exceptional and / or Extraordinary items#)	2,808.18	3,449.80	1,862.08	8,146.50	4,713.91	7,697.44
5	Total Comprehensive Income for the period [Comprising Profit/ (Loss) for the period (after tax) and Other Comprehensive Income (after tax)]	2,822.94	3,426.11	1,868.55	8,145.05	4,718.09	7,694.18
6	Paid up Equity Share Capital	7015.65	7015.65	7015.65	7015.65	7015.65	7015.65
7	Reserves (excluding Revaluation Reserve)	89195.89	86372.97	78074.32	89195.89	78074.32	81050.41
8	Securities Premium Account	45454.27	45454.27	45454.27	45454.27	45454.27	45454.27
9	Net worth	96,211.54	93,388.62	85,089.96	96,211.54	85,089.96	88,066.06
10	Paid up Debt Capital / Outstanding Debt	334826.34	330966.22	233413.86	334826.34	233413.86	273290.99
11	Outstanding Redeemable Preference Shares	NIL	NIL	NIL	NIL	NIL	NIL
12	Debt Equity Ratio	3.48	3.54	2.74	3.48	2.74	3.10
13	Earnings Per Share (of Rs10/- each) (for continuing and discontinued operations)						
	1. Basic	4.00	4.92	2.77	11.61	7.01	11.32
	2. Diluted	3.99	4.91	2.77	11.60	7.00	11.31
14	Capital Redemption Reserve	Not Applicable	Not Applicable	Not Applicable	Not Applicable	Not Applicable	Not Applicable
15	Debenture Redemption Reserve	Not Applicable	Not Applicable	Not Applicable	Not Applicable	Not Applicable	Not Applicable
16	Debt Service Coverage Ratio	Not Applicable	Not Applicable	Not Applicable	Not Applicable	Not Applicable	Not Applicable
17	Interest Service Coverage Ratio	Not Applicable	Not Applicable	Not Applicable	Not Applicable	Not Applicable	Not Applicable

Notes

a) The above is an extract of the detailed format of quarterly / annual financial results filed with the Stock Exchange(s) under regulation 52 of the Listing Regulations. The full format of the quarterly / annual financial results is available on the websites of the Stock Exchange(s) and the listed entity www.bseindia.com and www.ikffinance.com

b) For the other line items referred in regulation 52(4) of the Listing Regulations, pertinent disclosures have been made to the Stock Exchange(s) (BSE Ltd) and can be accessed on the URL www.bseindia.com

c) The impact on net profit/ loss, total comprehensive income or any other relevant financial item(s) due to change(s) in accounting policies shall be disclosed by means of a footnote.

For and on behalf of the Board of Directors
Vasumathi Devi Koganti
Sd/-
Managing Director

Place : Hyderabad
Date : February 07, 2025

సిద్ధరామయ్యకు ఊరట

బెంగళూరు : కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు హైకోర్టులో ఊరట లభించింది. మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా)కి సంబంధించిన భూకుంభకోణం కేసు దర్యాప్తును సిబిఐకి బదిలీ చేసేందుకు కర్ణాటక హైకోర్టు శుక్రవారం నిరాకరించింది. లోకాయుక్త పోలీసుల నుండి విచారణను బదిలీ చేయాలని కోరుతూ న్యాయవాది స్నేహమయి కృష్ణ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎం నాగప్రసన్న తిరస్కరించారు.

మహారాష్ట్రలో వయోజనుల కంటే ఓటర్లే ఎక్కువ?

- 5 నెలల్లో 39 లక్షల ఓటర్లు ఎక్కడ నుంచి వచ్చారు?
- ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శ



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మహారాష్ట్ర ఎన్నికల్లో కేవలం ఐదు నెలల్లోనే 39 లక్షల ఓట్లు ఎక్కడ నుంచి వచ్చాయని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. 'రాష్ట్ర వయోజన జనాభా 9.54 కోట్లు. కొత్త ఓటర్లతో కలిపి 9.7 కోట్ల మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు? ఇది ఎలా సాధ్యం? ఐదు నెలల్లో పెరిగిన ఓటర్ల సంఖ్య ఇంచుమించుగా హిమాచల్‌ప్రదేశ్ జనాభాకు సమానం. లోక్‌సభ ఎన్నికలప్పుడు లేని ఆ ఓట్లు మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలప్పుడు జాబితాల్లోకి ఎలా వచ్చాయి?' అని నిలదీశారు. శుక్రవారం నాడిక్కడ కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో శివసేన (ఠాక్రే) నేత సంజయ్ రౌత్, ఎన్‌సిపి (పవార్) నేత సుప్రియా సూలేతో కలిసి ఆయన మాట్లాడారు. మహారాష్ట్రలో ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాల్లో అవ్యవస్థ వుందని, ఎన్నో అవకతవకలను బయటపెట్టామని అన్నారు. నమోదు చేసుకున్న ఓటర్లతో పోలిస్తే ఎన్నికల సంఘం ప్రకటించిన జాబితా ఎక్కువగా ఉందన్నారు. ఓటర్ల జాబితాలో అవకతవకలపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. 2019 అసెంబ్లీ ఎన్నికల తరువాత నుంచి 2024 లోక్‌సభ ఎన్నికల వరకు 32 లక్షల మంది ఓటర్లు కొత్తగా నమోదయ్యారు. ఆ తరువాత ఐదు నెలల్లోనే 39 లక్షల మంది ఓటర్లు నమోదు కావడం ఏమిటని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా బ్లాక్ గెలిచిన నియోజకవర్గాల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొత్త ఓటర్లు అధికంగా నమోదయ్యారన్నారు. ఇండియా బ్లాక్‌ను ఓడించడానికి బిజెపి ఎన్నికల సంఘం సహాయంతో సరికొత్త కుట్రకు తెరలేపిందన్నారు. అన్ని రాష్ట్రాల్లో ఇదే వ్యూహాన్ని బిజెపి అమలు చేస్తోందన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వారిని చేర్చడంతో మహారాష్ట్రలో ఓటర్ల సంఖ్య ఆ రాష్ట్ర జనాభాను మించిపోయిందన్నారు.

ఎన్నికల సంఘం బతికుంటే సమాధానం చెప్పాలి? : సంజయ్‌రౌత్

ఎన్నికల సంఘం బతికే ఉంటే మహారాష్ట్ర ఓటర్ల జాబితాల్లో అవకతవకలపై రాహుల్ గాంధీ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని శివసేన (ఠాక్రే) ఎంపి సంజయ్ రౌత్ అన్నారు. ఈ కొత్త ఓటర్లు ఎన్నికలు ఎక్కడుంటే అక్కడికి వెళ్తారని, రేపు బీహార్‌లో ఎన్నికలుంటే బీహార్‌కు వెళ్తారని, వారిలో కొందరి పేర్లు ఢిల్లీ ఓటర్ల జాబితాలో కూడా ఉన్నాయని తెలిపారు. వాళ్లు తరువాత బీహార్‌కు, ఆ తరువాత ఉత్తరప్రదేశ్‌కు కూడా వెళ్తారని విమర్శించారు.

రాతపూర్వకంగా స్పందిస్తాం : ఇసి

మహారాష్ట్రలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాలో పెద్దయెత్తున అవకతవకలు చోటుచేసుకున్నాయంటూ రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘం (ఇసిఐ) స్పందించింది. రాజకీయ పార్టీలు లేవనెత్తిన ప్రశ్నలు, సూచనలను తాము గౌరవిస్తామని, దేశవ్యాప్తంగా ఒకేలా తాము అనుసరించిన విధానపరమైన అంశాలతో త్వరలోనే లిఖితపూర్వకంగా సమాధానం ఇస్తామని తెలిపింది.

ఆరోపణలకు ఆధారాలివ్వండి

కేజ్రీవాల్‌కు ఎసిబి నోటీసులు



కేజ్రీవాల్ నివాసం వద్ద ఎసిబి అధికారులు

న్యూఢిల్లీ : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఆప్ అభ్యర్థులకు బిజెపి లంచం ఇవ్వజూపిందని ప్రస్తావించిన ఆరోపణలకు సంబంధించిన వివరాలు, ఆధారాలు ఇవ్వాలని కేజ్రీవాల్‌కు ఢిల్లీ అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) ఆదేశించింది. ఈ మేరకు శుక్రవారం కేజ్రీవాల్‌కు లీగల్ నోటీసు జారీ చేసింది. ఢిల్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడికి ఒక రోజు ముందు ఈ నోటీసు జారీ చేయడం గమనార్హం. 16 మంది ఆప్ అభ్యర్థులకు పార్టీ మారేందుకు బిజెపి లంచం ఆశ చూపించిందని ఎక్స్‌లో కేజ్రీవాల్ చేసిన పోస్టును నోటీసుల్లో ఎసిబి ప్రస్తావించింది. ఈ పోస్టును కేజ్రీవాల్ స్వయంగా చేశారా.. లేదా అనే విషయాన్ని ధ్రువీకరించాలని, ఈ ఆరోపణలపై వివరణాత్మక సమాధానాన్ని అందించాలని నోటీసుల్లో ఎసిబి స్పష్టం కోరింది. ఫోన్ కాల్స్ అందుకున్న 16 మంది అభ్యర్థుల పేర్లు, వారిని సంప్రదించిన వారి ఫోన్ నంబర్లు, ఈ ఆరోపణలను ధ్రువీకరించడానికి ఇతర సహాయక ఆధారాలు కూడా ఇవ్వాలని ఎసిబి పేర్కొంది. ఢిల్లీ ప్రజల్లో భయాందోళనలు, అశాంతి పరిస్థితులు సృష్టించేందుకు మీడియా, సోషల్ మీడియాల్లో ఇటువంటి సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్న వారిపై ఎందుకు విచారణ చేయకూడదో వివరణ ఇవ్వాలని కేజ్రీవాల్‌ను కోరింది. ఈ నోటీసుకు స్పందించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

కేజ్రీవాల్ నివాసంలో హైడ్రామా

ఫిరోజ్‌షా రోడ్‌లోని కేజ్రీవాల్ నివాసంలో ఎసిబి ఈ నోటీసులను జారీచేసింది. ఈ సమయంలో హైడ్రామా నడిచింది. నోటీసులు జారీ చేయడం కోసం కేజ్రీవాల్ నివాసం వద్దకు ఉదయమే చేరుకున్న ఎసిబి అధికారులు దాదాపు రెండు గంటల పాటు భవనం బయట ఎదురుచూశారు. తరువాత నోటీసులను అందజేశారు. ఈ నోటీసులను 'రాజకీయ ప్రేరేపిత చర్య'గా ఆప్ విమర్శించింది. ఆప్ లీగల్ సెల్ చీఫ్ సంజీవ్ నాసిర్ మాట్లాడుతూ 'ఎసిబి అధికారులు ప్రారంభంలో ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు. అధికారులు ఎందుకొచ్చారో, వారి ఉద్దేశ్యం చెప్పకుండా కేజ్రీవాల్ నివాసం బయట దాదాపు రెండు గంటలు వేచి కూర్చున్నారు. తరువాత నోటీసులు జారీ చేశారు' అని తెలిపారు. ఎల్‌జి కార్యాలయం, బిజెపి కుమ్మక్కై ఈ డ్రామాను నిర్వహించారని, అధికారులు ఒత్తిడిలో ఉన్నారని విమర్శించారు. ఆప్ రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ మాట్లాడుతూ 'కేజ్రీవాల్ చేసిన ఆరోపణలపై ఇప్పటికే ఒకరి ఫోన్ నంబర్ ఇచ్చాం. ఇప్పుడు ఫిర్యాదు కూడా చేశాం. కనీసం ఒక్కరిపైనయినా చర్యలు తీసుకోవాలని మేం సవాల్ చేస్తున్నాం' అని అన్నారు.

ఆశారాం బాపుపై ఒటిటిలో సిరీస్
డిస్కవరీ ఛానెల్‌కు బెదిరింపులు

- ఛానెల్ ఉద్యోగులు, ఆస్తులకు రక్షణ కల్పించండి
- కేంద్రం, బెంగాల్‌తో పాటు ఆరు రాష్ట్రాలకు సుప్రీంకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ : స్వయం ప్రకటిత ఆధ్యాత్మిక నాయకుడు, లైంగికదాడి కేసులో దోషి ఆశారాం బాపుపై డాక్యుమెంటరీ సిరీస్ విషయంలో డిస్కవరీ ఛానెల్ బెదిరింపులను ఎదుర్కొంటోంది. బాపు ప్రస్తుతం బెయిల్‌పై విడుదలయ్యారు. ఆశారాం అఘాయిత్యానికి గురైన సాక్షులను అనుచరులు బెదిరిస్తుంటే... తాజాగా ఆయనపై ఒటిటి సీరియల్ తీసిన డిస్కవరీ ఛానెల్ అంతుచూస్తామని బెదిరింపులు ఎక్కువయ్యాయి. ఆ సంస్థ ఉద్యోగులు సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. ఛానెల్ ఉద్యోగులు, ఆస్తులకు భద్రత కల్పించాలని కేంద్రం, బెంగాల్, ఇతర ఆరు రాష్ట్రాలను న్యాయస్థానం ఆదేశించింది. డిస్కవరీ ఛానెల్.. గతనెల 29న దానిని ఒటిటి ప్లాట్‌ఫామ్ డిస్కవరీ ప్లస్‌లో 'కల్ట్ ఆఫ్ ఫియర్ : ఆశారాం బాపు' సిరీస్‌ను విడుదల చేసింది. జీవితఖైదు అనుభవిస్తున్న ఆశారాం.. ప్రస్తుతం మెడికల్ బెయిల్‌పై ఉన్న విషయం విదితమే. సిరీస్ విడుదలపై బెదిరింపుల విషయంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిత (సిజెఐ) సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కెవి విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం కేంద్రం, బెంగాల్‌తో పాటు తెలంగాణ, మహారాష్ట్ర, ఢిల్లీ, హర్యానా, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. అంతకుముందు, సినిమాటోగ్రాఫర్ అయిన శశాంక్ వాలియా, ఛానెల్ ఇతర ఉద్యోగుల తరపున హాజరైన సీనియర్ న్యాయవాది అభినవ్ ముఖర్జీ.. తన క్లయింట్లు నిరంతరం బెదిరింపులకు గురవుతున్నారని ధర్మాసనానికి వివరించారు.

స్వర్ణాంధ్ర 2047కు చేయూత

(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వాలని సూచించారు. మూడు సీపోర్టులు, మూడు ఎయిర్‌పోర్టులు ఉన్న తిరుపతి చెన్నై, నెల్లూరును ట్రైసిటీగా తీర్చిదిద్దితే ఆ ప్రాంతం అభివృద్ధిలో దూసుకు వెళుతుందని సూచించారు . అనంతరం నీతిఆయోగ్ వైస్‌ఛైర్మన్ సుమన్ భేరీ మాట్లాడుతూ వికసిత్ భారత్ 2047 సాధనలో ఎపి మోడల్ రాష్ట్రంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రానికి రాష్ట్రానికి ఇది అనుకూల సమయమని, అభివృద్ధికి ఎంతో ఆస్కారం ఉందని, అందులో నీతి అయోగ్ భాగస్వామ్యం తప్పనిసరిగా ఉంటుందని సుమన్‌భేరీ పేర్కొన్నారు. సచివాలయానికి తొలిసారి వచ్చిన సుమన్‌భేరీకి సిఎం ఘనస్వాగతం పలకడంతో పాటు సమావేశం ముగిసిన అనంతరం కారువద్దకు వచ్చి వీడ్కోలు పలికారు.

14 నుంచి 20 వరకు కేంద్ర బడ్జెట్‌పై నిరసనలు

(మొదటిపేజీ తరువాయి)

ఈ బడ్జెట్ విస్మరించిందని పేర్కొన్నారు. ప్రజావ్యతిరేక బడ్జెట్‌పై ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని వామపక్ష పార్టీలు నిర్ణయించాయని వివరించారు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర నిర్ణయిస్తూ చట్టబద్ధమైన హామీ కల్పించాలని, వ్యవసాయ మార్కెటింగ్‌పై జాతీయ విధాన ముసాయిదాను ఉపసంహరించాలని కోరాయి. నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ ద్వారా చేపట్టే ప్రభుత్వరంగ ప్రైవేటీకరణ చర్యలను, ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటురంగానికి బదలాయించడాన్ని ఆపాలని, బీమా రంగంలో వందశాతం ఎఫ్‌డిఐలను ఉపసంహరించాలని కోరాయి. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయింపులను 50 శాతం పెంచాలని డిమాండ్ చేశాయి. పట్టణ ఉపాధి హామీ చట్టాన్ని ప్రవేశపెట్టాలని, వృద్ధాప్య పెన్షన్లు, ఇతర సామాజిక భద్రతా ప్రయోజనాల కోసం కేంద్ర కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశాయి. ఆరోగ్య రంగ కేటాయింపులను జిడిపిలో మూడు శాతానికి, విద్యా రంగానికి ఆరు శాతానికి కేటాయింపులు పెంచాలని కోరాయి. ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఆహార సబ్సిడీని పెంచాలని, ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమానికి, మహిళా శిశు సంక్షేమానికి, ఐసిడిఎస్‌కు కేటాయింపులు, స్కీమ్ వర్కర్లకు ఇచ్చే గౌరవ వేతనాల్లో కేంద్ర వాటాను, రాష్ట్రాలకు నిధుల బదిలీని, కేంద్ర ప్రాయోజిత పథకాలకు నిధులు పెంచాలని కోరాయి. రాష్ట్రాలతో పంచుకునే విభాగంలో చేర్చని పెట్రోలియం ఉత్పత్తులపై సెస్సులను సర్ ఛార్జీలను రద్దు చేయాలని కోరాయి.

వాల్తేరు డివిజన్ 2ముక్కలు

(మొదటిపేజీ తరువాయి)

రూపకల్పన చేసింది. ఈ బిల్లును వచ్చేవారంలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి, పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ (ఆర్థిక వ్యవహారాలు)కఉ పంపనున్నారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఈ బిల్లును ప్రవేశపెడతామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇప్పటికే ప్రకటించారు. ప్రత్యక్ష పన్ను చట్టాన్ని అర్థం చేసుకోవడానికి, సులభతరం చేయడానికి కొత్త బిల్లును తీసుకొస్తున్నట్లు కేంద్రం చెబుతోంది. నూతన బిల్లుతో కొత్తగా ఎలాంటి పన్ను భారాలు విధించబోమని కూడా ప్రకటించింది. కొత్త బిల్లులో వివరణలు, నిబంధనలు, సుదీర్ఘ వ్యాఖ్యలు ఉండవని తెలిపింది.

ఇసుక అక్రమ తవ్వకాలపై విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

గత ప్రభుత్వ హయాంలో ఇసుక అక్రమ తవ్వకాలు జరిగాయన్న పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ వాయిదా పడింది. ఈ పిటిషన్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ బుయాన్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. ఇసుక తవ్వకాలన్నీ ఆపేసినట్లు విచారణ సందర్భంగా జయప్రకాశ్ పవర్ వెంచర్స్ తరపు న్యాయవాది ధర్మాసనానికి తెలిపారు. గత విచారణ తరువాత తీసుకున్న చర్యలను వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నివేదిక దాఖలు చేసింది. తదుపరి చర్యలు, తాజాగా తీసుకున్న నిర్ణయాలతో తుది నివేదిక దాఖలు చేయాలని ఎపి ప్రభుత్వాన్ని ధర్మాసనం ఆదేశించింది. కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ గమనించిన విషయాలు, తీసుకున్న చర్యలతో అఫిడవిట్ దాఖలు చేయాలని మంత్రిత్వశాఖకు సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను ఏప్రిల్ 7కు వాయిదా వేసింది.

తిరుపతిలో తొక్కిసలాటపై పిటిషన్ కొట్టివేత

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జనవరి 8న తిరుపతిలో చోటుచేసుకున్న తొక్కిసలాటపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర విచారణ జరపాలని దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. టిటిడి బోర్డును రద్దు చేసి, కొత్త బోర్డు నియమించాలని, జనవరి 8న తొక్కిసలాటపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర విచారణ జరపాలని, బాధితులకు పరిహారం పెంచాలని రామచంద్ర యాదవ్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారించింది. ఈ వ్యవహారాలపై అంతగా ఆసక్తి ఉంటే, రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు తెలిపింది. పిటిషన్‌లో పేర్కొన్న ఏ ఒక్క అంశంపై తాము ఎలాంటి అభిప్రాయం వ్యక్తం చేయడం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. పిటిషన్‌ను విచారించేందుకు ధర్మాసనం నిరాకరించింది.

సాలీడు - పాపాయి



'సాలీడ నీ గూడు సక్కగుంటాది
సన్నసన్నని దారమెక్కడుంటాది?'

'వినవోయి పాపాయి నా గూటి కథను
కనవోయి పాపాయి నా గూటి కళను
బొడ్డు కిందగ తీగె సృష్టించుకుంటాను
విడ్డూరమని మీరు మెచ్చుకుంటారు
నున్ననున్నని తీగె నేతగాడిని నేను
వన్నెచిన్నెల గూడు కట్టుకుంటాను'

'సాలీడ! సాలీడ! తీగె తెగిపోతే
నేల పడబోకుండ ఏమి చేస్తావు?'

'ఆపదను నా పొట్ట గమనించలదు
దారమాధారమై రక్షించగలదు
తెగిన గూడును కట్టుకొనుశక్తి కలదు
పడిన పురుగును చుట్టి బంధించగలదు'

'సాలీడ! నీ గూడు నేడకడతావు?
కాళ్ళెనిమిదున్నాయి కదలగలవా నీవు?'

'చెట్టుకొమ్మల మధ్య గూడు కడతాను
గడ్డి పరకల మీద గూడు కడతాను
మీ యిండ్ల మూలల్లో గూడు కడతాను
వచ్చివాలిన పురుగులన్ని తింటాను'

నాకాళ్ళు జోడించి నాల్గు చూపెడతాను
చకచకా ఎనిమిదిని వాడుకుంటాను'


'సాలీడ! నీగూడు మృత్యు గృహమంటారు?
పురుగు పడితే బతికి తిరిగి రాదంటారు?
పాపమనిపించదా, నీ మనసులోన
పట్టి బంధింతువే దారాల తోన'

'ప్రకృతి నాకిచ్చేటి ఆహారమదియె
ప్రకృతిని 'తులతూచి' కాపాడుటదియె
'ఆహారపు గొలుసు' సూత్రమౌతాను
మనుషలను,పైరులను కాపాడుతాను "

- కిలపర్తి దాలినాయుడు,
సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
రామభద్రపురం.

చుక్కలు కలపండి

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న ఆంగ్ల అక్షరాలను వరుసగా చుక్కల మీదుగా కలపితే అందమైన బొమ్మ వస్తుంది. చూడండి.



నేను గీసిన బొమ్మ





మరీదు వెన్నెల,
7వ తరగతి,
జిల్లా పరిషత్ హైస్కూలు, కలపర్రు,
పెదపాడు మండలం,
ఏలూరు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



మీకోసం

వాటర్ బాటిల్లో ప్రతిరోజూ కాస్త ఉప్పు వేసి శుభ్రపర్చడం వల్ల క్రిములు చేరవు.

జీవన సౌరభం

ఉన్నత వ్యక్తిత్వాన్ని సంతరించుకునే క్రమంలో ఎదురయ్యే సవాళ్లు, జీవిత నిర్మాణంలో పునాదిరాళ్లు అవుతాయి.

అనారోగ్యాన్ని దాటి .. ఆశాయాత్ర!



'జీవితం ఎంత కఠినంగానైనా ఉండనీ, ధైర్యంతో ముందుకు అడుగులు వేయాలి' అని చెబుతున్నాడు 32 ఏళ్ల హర్‌తేజ్ భర్తేష్. మధ్యప్రదేశ్‌కి చెందిన ఈ యువకుడికి 23 ఏళ్ల వయసులో క్యాన్సర్ 4వ స్టేజీలో ఉందని తేలింది. ఒక పక్క చదువు, ఉద్యోగం, చికిత్స, వైద్యఖర్చులు, మానసిక ఒత్తిడి.. ఇన్ని ప్రతికూల పరిస్థితుల్లో కూడా ధైర్యంగా నిలబడ్డాడు. చికిత్సతో పాటు మానసికస్థైర్యం ఉండడం వల్లే రోగాన్ని జయించవచ్చని గ్రహించాడు. ఆ స్ఫూర్తితోనే 'క్యాన్సర్ ముగింపు కాదు.. కొత్త జీవితంపై ఆశ' అని దేశవ్యాప్తంగా ప్రచారం చేశాడు. ఐదేళ్ల క్రితం ఓ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటుచేసి క్యాన్సర్ రోగుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్నాడు. క్యాన్సర్‌ని జయించిన హర్‌తేజ్‌కి ఈ నెలలో వివాహం జరగనుంది. ఈ సందర్భంగా అతని స్ఫూర్తివంత ప్రయాణాన్ని తెలుసుకుందాం.



పాఠశాల విద్య పూర్తిచేసిన హర్‌తేజ్, న్యాయవాద విద్య పూర్తి చేసేందుకు ఢిల్లీలోని అమిటి యూనివర్శిటీకి వెళ్లాడు. అక్కడ చివరి సెమిస్టర్‌లో ఉండగా 2012లో మెడపై వాపు కనిపించింది. సాధారణ చికిత్స తీసుకున్నాడు. ఈ లోపు కొంతమంది డాక్టర్లను కలిశాడు. ఎవరూ వ్యాధిని నిర్ధారణ చేయలేదు. ఆ సమయంలో తను ఎదుర్కొన్న పరిస్థితిని హర్‌తేజ్ ఇలా చెబుతున్నాడు. 'వ్యాధిని నిర్ధారణ చేసుకోకుండా ఏడాది సమయాన్ని వృథా చేశాను. 2013 మధ్యలో హైద్రాబాద్‌లో ఉన్న నా స్నేహితుడిని కలిశాను. అక్కడే క్యాన్సర్ తేలింది. హడ్జికిన్స్ లింఫోమా (అరుదైన రక్త క్యాన్సర్) 3వ స్టేజీలో ఉందని చెప్పారు. అప్పుడే, క్యాన్సర్‌ని యుద్ధంలా ఎదుర్కోవాలని అనుకున్నాను' అని ఆ చేదు జ్ఞాపకాలను ఆయన గుర్తు చేసుకున్నారు.

హర్‌తేజ్ పరిస్థితి అతని కుటుంబం జీర్ణించుకోవడం చాలా కష్టమైంది. అయినా ఆ బాధని దిగమింగి, అండగా నిలబడింది. 'అప్పుడు నాకు భయం వేయలేదు. కానీ త్వరగా కోలుకోవాలని ప్రతి రోజూ అనుకునేవాణ్ణి' అని హర్‌తేజ్ చెప్పారు. అప్పుడు డాక్టరు తనతో అన్న మాటలను కూడా ఆయన గుర్తు చేసుకున్నారు.

ఆ ఫుడ్ తినడం వల్లే..

'డాక్టర్ నాతో ఏం చెప్పారంటే.. కాలేజీ రోజుల్లో హోటల్ ఫుడ్ ఎక్కువగా తినేవాణ్ణి. అక్కడ వాళ్లు, ఉపయోగించిన నూనెని పదే పదే వాడడం వల్ల నాకు వ్యాధి వచ్చిందని చెప్పారు. నా జీవితంలో అతి ముఖ్యమైన రోజులను ఈ రోగం కారణంగా నేను కోల్పోయాను. ఏడాదిపాటు ప్రత్యామ్నాయ వైద్యం వైపు వెళ్లాను. అయినా ఫలితం రాలేదు' అని చెప్పారు.

2014లో ఎంబిఎ చేయడానికి హర్‌తేజ్ బెంగుళూరు వెళ్లారు. అక్కడ చేసిన పిఇటి స్కాన్‌లో క్యాన్సర్ 4వ స్టేజికి వచ్చింది. ఎముక మజ్జ వరకు వ్యాపించేసింది. చదువుకు కొంత విరామం ఇచ్చి, చికిత్స కోసం హర్‌తేజ్ హైద్రాబాద్‌కి వచ్చారు. బసవతారకం క్యాన్సర్ హాస్పటల్‌లో చేరారు. డాక్టర్ సెంథిల్ రాజప్ప ఆయనకి చికిత్స చేశారు. ఆ సమయంలో వైద్య ఖర్చుల కోసం తను పడిన ఒత్తిడిని ఆయన ఇలా చెబుతున్నారు.

'మాది మధ్యతరగతి కుటుంబం. మన దేశంలో క్యాన్సర్ చికిత్స చాలా ఖర్చుతో కూడుకున్నది. ఈ భారం మా కుటుంబం ఎలా భరిస్తుందో అని చాలా ఆందోళన పడేవాణ్ణి. ఒకవేళ ఖర్చు పెట్టిన తరువాత నేను మనుగడ సాగించడం అంతకంటే భారం అని కూడా అనుకునేవాణ్ణి' అంటున్నారు.

12 కీమోథెరపీలు చేయించుకున్న హర్‌తేజ్ సెషన్ సెషన్‌కి తీవ్ర అనారోగ్య ఇబ్బందులను ఎదుర్కొన్నారు. రోగనిరోధక శక్తి కోల్పోయారు. జుట్టంతా ఊడిపోయింది. నీరసం, నిస్సత్తువ ఆవహించింది. 25 ఏళ్ల కుర్రాడికి ఈ పరిస్థితి చాలా భయంకరం. 'ఈ ఒత్తిడిని అధిగమించడంలో కుటుంబం ఆయనకి అండగా నిలబడింది. ఎప్పుడూ పక్కనే ఉండి అతను ఆత్మవిశ్వాసం కోల్పోకుండా చూసేవారం' అంటూ తన అనుభవాన్ని హర్‌తేజ్ సోదరుడు శ్రోత్ చెప్పారు.

అమ్మకి తెలియకుండా ...


కుటుంబం గురించి చెబుతూ అమ్మతో ఎదురైన అనుభవాన్ని హర్‌తేజ్ ఇలా గుర్తుచేసుకున్నారు. 'మా అమ్మకి చాలా నెలలపాటు వ్యాధి తీవ్రత తెలియనివ్వలేదు. 7వ కీమో చేయించుకునేటప్పుడు ఆమెకి తెలిసింది. తను వెంటనే హైద్రాబాద్ వచ్చేసింది. అమ్మ రాగానే నాకు ఎంతో ప్రశాంతంగా అనిపించింది. తను వండిన ఆహారం తినగానే అప్పటి వరకు నేను చాలా కోల్పోయాను అనిపించింది' అని చెబుతున్నప్పుడు హరతైజ్ స్వరం దు:ఖంతో వణికింది.

కొత్త ప్రయాణం

క్యాన్సర్ నుండి కోలుకున్న హర్‌తేజ్ 2015 నాటికి రాయ్‌పూర్ చేరుకున్నారు. క్రమం తప్పకుండా ఫిజికల్ ఎక్సర్‌సైజ్ చేసేవారు. పోషకాహారం తీసుకుంటూ త్వరగా కోలుకున్నారు. అయితే ఇక్కడి నుండి అతను మరో యుద్ధం చేయాల్సివచ్చింది. ఉద్యోగం వేటలో ఉండగా ప్రతిభని పక్కనబెట్టి అనారోగ్యం సాకుతో అవకాశాలు రాలేదు.

ఉద్యోగం రాలేదు..

'నా సివి సమర్పించడానికి మూడేళ్ల విరామం వచ్చింది. దీనిపై కంపెనీవాళ్లు ప్రశ్నించేవారు. అప్పుడు నా తలపై, కనుబొమ్మలపై, వెంట్రుకలు కూడా ఉండేవి కావు. ఆ పరిస్థితికి కారణమేంటని వాళ్లు అడిగినప్పుడు నా అనారోగ్యాన్ని బయటపెట్టాను. ఈ సాకు చెప్పి, కార్పొరేట్ కంపెనీలు నాకు ఉద్యోగం ఇవ్వలేదు. రోగాన్ని జయించి వచ్చిన నాకు ఈ పరిస్థితి మరింత భయంకరంగా అనిపించింది. సమాజంలో క్యాన్సర్‌పై ఉన్న అపోహలు, రోగులు పడే ఇబ్బందులు ప్రత్యక్షమయ్యాయి. అప్పుడే క్యాన్సర్ అవగాహనా ర్యాలీ చేయాలని నిశ్చయించుకున్నాను' అని చెబుతున్న హర్‌తేజ్ బైక్‌పై ప్రయాణిస్తూ, వేలాది మంది క్యాన్సర్ రోగులను కలుసుకున్నారు. రైడ్ ఆఫ్ హోప్' పేరుతో అతను చేసిన బైక్ ర్యాలీ ఎందరిలోనో స్ఫూర్తి నింపింది. 2016 మే 1న సోలో రైడ్ ప్రారంభించిన అతడు 15 రాష్ట్రాలు, 22 పట్టణాల గుండా ప్రయాణించారు.



మీడియాలో విస్తృత ప్రచారం వచ్చింది. ఆస్పత్రుల్లోని రోగులకు హర్‌తేజ్‌తో మాట్లాడించేవారు. ఈ ప్రయాణం గురించి అతను మాట్లాడుతూ 'ప్రాంతాలు, మనుషులను కలవడంతో నా ప్రయాణం పూర్తవ్వలేదు. 'ఎంతోమంది జీవితాలను ఇది తాకింది' అంటున్నారు. తనకెదురైన అనుభవాలను కూడా గుర్తు చేసుకున్నారు. 'నాతో పాటు రైడ్‌లో పాల్గొన్న ఒక వ్యక్తికి నాలాగే మెడపై కణితి వచ్చింది. నా స్టోరీ తెలుసుకుని అతడు వెంటనే పరీక్ష చేయించుకున్నాడు. ప్రాథమిక స్టేజీలో క్యాన్సర్ ఉందని తేలింది. చికిత్స తరువాత చాలా తక్కువ కాలానికే కోలుకున్నాడు. ఇప్పటికీ, అతను, అతని కుటుంబం నాకు కృతజ్ఞతలు చెబుతారు. ఓ మహిళ రొమ్ము క్యాన్సర్‌ని కూడా ఇలాగే గుర్తించి, కోలుకుంది. ఇలాంటి అనుభవాలు నా ప్రయాణంలో ఎన్నో ఉన్నాయి'.

2020లో స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసి దాని ద్వారా క్యాన్సర్ రోగులకు అవగాహన కల్పిస్తున్న హర్‌తేజ్ 'నేను డాక్టర్‌ని కాదు. కానీ రోగాన్ని జయించాను. ఆ అనుభవమే అందరికీ పంచుతున్నాను. నేను పెళ్లి చేసుకునే అమ్మాయి సంరక్షిణి కూడా క్యాన్సర్ బాధితురాలే. ఆమె డాక్టర్ కూడా. పెళ్లి తరువాత నా ప్రయాణంలో తను కూడా తోడవుతుంది. అప్పుడు మరింత మందికి మా సేవలు దగ్గరవుతాయి' అంటున్నారు.

త్వరలో ఓటీటీలోకి 'సంక్రాంతికి వస్తున్నాం'



కథానాయకుడు వెంకటేష్ నటించిన దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కించిన సినిమా 'సంక్రాంతికి వస్తున్నాం' త్వరలో ఓటీటీలో విడుదల కానుంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై ఈ సినిమా సంక్రాంతికి విడుదలైన బ్లాక్‌బస్టర్ సాధించింది. గేమ్‌ఛేంజర్, డాకుమహారాజ్ వంటి చిత్రాలను దాటి బాక్సాఫీస్ వద్ద కలెక్షన్లను కొల్లగొట్టింది. మీనాక్షిచౌదరి, ఐశ్వర్యారాజేశ్ ఇందులో కథానాయికలు. ఈ సినిమా హక్కులను భారీ ధరకు జీ 5 సొంతంచేసుకుంది. మహాశివరాత్రి నుంచి ఈ సినిమా ఓటీటీలో అలరించనున్నట్లుగా తెలిసింది.

త్వరలో థియేటర్లలోకి '1000 వాలా'




సూపర్‌హిట్ మూవీ మేకర్స్ పతాకంపై షారుఖ్ నిర్మాణంలో అమిత్ కథానాయకుడిగా తెరంగ్రేటం చేస్తున్న సినిమా '1000 వాలా'. నమిత, కీర్తి కథానాయికలు. యువ దర్శకుడు అఫ్జల్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో ప్రముఖ నటులు సుమన్, పిల్లా ప్రసాద్, ముఖ్తార్‌ఖాన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. భారీ హంగులతో రూపొందించిన ఈ చిత్రాన్ని త్వరలో థియేటర్లలో విడుదల చేసేందుకు చిత్రయూనిట్ సన్నాహాలు చేస్తోంది. ప్రచార కార్యక్రమాల్లో భాగంగా మరో కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. నాలుగు హుషారైన పాటలు ఉన్నాయనీ, త్వరలోనే థియేట్రికల్ ట్రైలర్ ఉంటుందనీ, భారీఎత్తున ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహిస్తామని నిర్మాత షారుఖ్, దర్శకుడు అఫ్జల్ తెలిపారు. సెంటిమెంట్, నిజ జీవిత అంశాలకు దగ్గర ఉండే చిత్రం కావటం వల్ల అందరి ఆదరాభిమానాలతో తమ సినిమా భారీ విజయం సాధిస్తుందనే నమ్మకం ఉందని వివరించారు. ఇప్పటికే విడుదల చేసిన టీజర్, పోస్టర్లు సామాజిక మాధ్యమాల్లో బాగా ట్రెండింగ్‌లో ఉన్నాయి. కథ : అమిత్, కథనం, మాటలు : గౌస్‌ఖాజా, సంగీతం వంశీకాంత్ రేఖాన.



15న తమన్ మ్యూజిక్ కన్సర్ట్

ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తలసేమియా వ్యాధిగ్రస్తుల చికిత్సల నిమిత్తం, శిబిరాల ఏర్పాటుకోసం విరాళాల సేకరణకు టాలీవుడ్ సంగీత దర్శకుడు తమన్ సంగీత విభావరి ఏర్పాటుచేశారు. ఈనెల 15న విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఈ మ్యూజిక్ కన్సర్ట్‌ను నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఈ విషయాన్ని తమన్ వెల్లడించారు. విజయవాడలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఎన్టీఆర్ నటించిన సినిమాల్లోని ఉత్తమ పాటలను తమ బృందం పాడుతుందన్నారు.



రుష్యా హీరోగా ...

నిర్మాత నాగవంశీ బావమరిది హీరోగా లాంచ్ కాబోతున్నాడు. రుష్యా హీరోగా మిర్నా హీరోయిన్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమా శుక్రవారం ప్రారంభించారు. ఈ చిత్రాన్ని బన్నీ ముప్పానేని నిర్మిస్తున్నారు. తెలుగులో కలర్ ఫోటో, తెల్లారితే గురువారం, బెదురులంక 2012 లాంటి పలు సినిమాలను బెన్నీ ముప్పానేని నిర్మించారు.



శ్రీవిష్ణు 'సింగిల్'!

గీతా ఆర్ట్స్ సంస్థ శ్రీవిష్ణుతో ఓ సినిమా తెరకెక్కిస్తోంది. ఇది శ్రీవిష్ణు 18వ చిత్రం. ఈ చిత్రానికి కార్తిక్ రాజు దర్శకత్వం వహిస్తున్నారు. ఫీల్‌గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. చిత్రీకరణ తుదిదశకు చేరుకుంది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాకు 'సింగిల్' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు తెలుస్తోంది.



సిద్ధు 'తెలుసు కదా' కొత్త పోస్టర్

సిద్ధు జొన్నలగడ్డ నటిస్తున్న 'తెలుసు కదా' చిత్రం నుండి కొత్త పోస్టర్ విడుదలైంది. శుక్రవారం సిద్ధు పుట్టిన రోజు సందర్భంగా చిత్రబృందం ఓ స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. సిద్ధు జొన్నలగడ్డ, నీరజ కోన కాంబినేషన్‌లో రాబోతున్న ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టితో పాటు రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించనుంది. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమా ఈ ఏడాదే రిలీజ్ కానున్నట్లు సమాచారం.

1న బిసిసిఐ ప్రత్యేక సర్వసభ్య సమావేశం

ముంబయి: భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) నూతన కార్యదర్శిగా ఎన్నికైన దేవ్‌జిత్ సైకియా కొత్త జాయింట్ సెక్రటరీని నియమించేందుకు 1న ముంబయిలో ప్రత్యేక సర్వసభ్య సమావేశంను ఏర్పాటు చేసింది. గత నెలలో అసోం క్రికెట్ అసోసియేషన్‌కి చెందిన సైకియాను జై షా స్థానంలో నూతన కార్యదర్శిగా నియమించింది. గత ఏడాది డిసెంబర్‌లో అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసిసి) అధ్యక్షుడిగా జై షా బాధ్యతలు స్వీకరించడంతో అతని స్థానంలో సైకియా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎస్‌జీఎం కోసం రాష్ట్ర సంఘాలకు బిసిసిఐ పంపిన నోటీసులో ఏకైక ఎజెండా 'జాయింట్ సెక్రటరీ నియామకంగా పేర్కొంది. మార్చి 1న ముంబయిలోని బిసిసిఐ ప్రధాన కార్యాలయంలో జాయింట్ సెక్రటరీ ఎన్నిక, నియామకం కోసం జరగనుంది. బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అభిషేక్ దాల్మియా(తూర్పు జోన్), ఢిల్లీ అండ్ జిల్లా క్రికెట్ అసోసియేషన్(డిడిసిఎల్) చీఫ్ రోహన్ జైట్లీ (నార్త్ జోన్), ముంబయి క్రికెట్ అసోసియేషన్ సంజయ్ నాయక్ (వెస్ట్ జోన్) పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి.

ఐసిసి అవార్డు రేసులో గొంగడి త్రిష



దుబాయ్: తెలుగమ్మాయి గొంగడి త్రిష అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) ఉత్తమ మహిళా క్రికెటర్ జనవరి నెలకు గాను అవార్డు రేసులో నిలిచింది. ఇటీవల ముగిసిన ఐసిసి మహిళల అండర్-19 టి20 ప్రపంచకప్‌లో భారత్ విజేతగా నిలవడంలో త్రిష కీలకపాత్ర పోషించింది. మొత్తం 309 పరుగులతోపాటు టి20 ప్రపంచకప్ చరిత్రలో సెంచరీ చేసిన తొలి బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పింది. మరోవైపు పురుషుల విభాగంలో మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఉత్తమ ఆటగాడి అవార్డు కోసం పోటీపడుతున్నాడు. ఇటీవల ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌లో 14 వికెట్లు పడగొట్టిన వరుణ్.. భారత్ 4-1తో సిరీస్ గెలవడంలో ముఖ్యపాత్ర పోషించాడు. పాకిస్థాన్‌తో టెస్టు సిరీస్‌లో అదిరే ప్రదర్శన చేసిన స్పిన్నర్ జొమెల్ వారికన్ కూడా ఈ అవార్డు రేసులో ఉన్నాడు. పాక్‌తో సిరీస్‌లో అతడు 19 వికెట్లు పడగొట్టాడు.

నేటినుంచి రంజీట్రోఫీ క్వార్టర్ ఫైనల్స్



జమ్ము-కాశ్మీర్ స్పిన్నర్ సాహిల్‌తో పేసర్ నజీర్

ముంబయి: రంజీట్రోఫీ సీజన్-2024-25 క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. సౌరాష్ట్ర-గుజరాత్ జట్ల మధ్య రాజ్‌కోట్ వేదికగా నిరంజన్ షా స్టేడియంలో రెండో క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ మైదానం పూర్తిగా పచ్చికతో కూడి ఉంది. గుజరాత్ జట్టుకు రమేష్ పొవార్ కోచ్‌గా ఉండగా.. రాజ్‌కోట్ మైదానంలో ఇంత పచ్చిక మైదానాన్ని చూడడం ఇదే తొలిసారి. సౌరాష్ట్ర స్టార్ ఆటగాడు రవీంద్ర జడేజా దూరం కావడం ఆ జట్టుకు పెద్ద లోటు. దీంతో కెప్టెన్ ఉనాద్కట్‌పైనే సౌరాష్ట్ర ఆశలన్నీ ఉన్నాయి. ఇక కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా హర్యానా-ముంబయి జట్ల మధ్య, పూణే వేదికగా హర్యానా-ముంబయి జట్ల మధ్య ఇతర క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లు జరగనున్నాయి. సంచలన విజయాలతో క్వార్టర్స్‌కు చేరిన విదర్భ-తమిళనాడు జట్ల మధ్య మరో మ్యాచ్ జరగనుంది.

సంచలన విజయాలతో క్వార్టర్స్‌కు చేరిన జమ్ము-కాశ్మీర్ జట్టు బౌలర్లపైనే భారం వేసింది. ఆ జట్టు ముంబయి, బరోడా జట్లను చిత్తుచేసి జమ్ము జట్టు క్వార్టర్స్‌కు చేరింది. ఎంసిఎ స్టేడియంలో కేరళతో జమ్ము తలపడనుండగా.. కెప్టెన్ పరాస్ డోగ్రాపైనే ఆ జట్టు ఆశలు పెట్టుకుంది. ఇక కేరళ కోచ్ మాట్లాడుతూ కెప్టెన్ సచిన్ బేబి అద్భుత ఫామ్‌లో ఉండడం తమకు కలిసిరానున్నట్లు వెల్లడించాడు.

క్వార్టర్‌ఫైనల్స్..
హర్యానా × ముంబయి(ఈడెన్ గార్డెన్స్)
జమ్ము-కాశ్మీర్ × కేరళ(పూణే)
సౌరాష్ట్ర × గుజరాత్(రాజ్‌కోట్)
విదర్భ × తమిళనాడు(నాగ్‌పూర్)
(ఉదయం 9.00గం॥ల నుంచి)

స్మిత్, క్యారీ సెంచరీలు

- ఆస్ట్రేలియా 330/3
- శ్రీలంకతో రెండో టెస్ట్



గాలే: శ్రీలంకతో జరుగుతున్న రెండో, చివరి టెస్ట్‌లో ఆస్ట్రేలియా జట్టు పట్టు బిగిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంకను 257పరుగులకే పరిమితం చేసిన ఆసీస్.. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో రెండో రోజు ఆట ముగిసే సమయానికి 3వికెట్ల నష్టానికి 330పరుగులు చేసింది. సీనియర్ ఆటగాడు స్టీవ్ స్మిత్(120), క్యారీ(139) క్రీజ్‌లో ఉన్నారు. తాజా సెంచరీతో స్మిత్ ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ రికార్డును సమం చేశాడు. ఓవర్‌నైట్ స్కోర్ 9వికెట్ల నష్టానికి 229 పరుగులతో శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక జట్టు మరో 28పరుగులు జతచేసి లాహిరు కుమార(2) వికెట్ కోల్పోయింది. ఈ వికెట్ కుహ్నేమన్ పడగొట్టాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియాను ఓపెనర్లు హెడ్(21), ఖవాజా(36)కి తోడు లబూషేన్(6) నిరాశపరిచారు. దీంతో ఆస్ట్రేలియా జట్టు 91పరుగులకే 3వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో స్మిత్, క్యారీ సెంచరీలతో రాణించి జట్టును ఆదుకున్నారు. ఈ సెంచరీతో స్మిత్ టెస్ట్‌ల్లో అత్యధిక సెంచరీలు చేసిన ఆటగాళ్ల జాబితాలో ద్రవిడ్, రూట్‌తో కలిసి సంయుక్తంగా ఐదో స్థానంలో నిలిచాడు. టెస్ట్‌ల్లో అత్యధిక సెంచరీలు చేసిన రికార్డు సచిన్ టెండూల్కర్(51) పేరిట ఉంది. సచిన్ తర్వాతి స్థానాల్లో జాక్ కలిస్(45), రికీ పాంటింగ్(41), సంగక్కర(38) ఉన్నారు.

10 నుంచి మంగళగిరిలో ఐఎ అండ్ ఎడి సౌత్ జోన్ క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యాన మంగళగిరి ఎసిఎ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 10, 11, 12, 13 తేదీల్లో నాలుగు రోజులపాటు ఐఎ అండ్ ఎడి సౌత్ జోన్ క్రికెట్ టోర్నమెంట్-2025 పోటీలు జరగనున్నాయి. విజయవాడలోని ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఆడిట్) కార్యాలయం నేతృత్వంలో తొలిసారి సౌత్‌జోన్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తుంది. ఇందులో ఎపి, తెలంగాణ, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు చెందిన జట్లు పోటీలో తలపడనున్నాయని ఆడిట్ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68